అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

అదుపుతప్పి లోయలో పడిన ఆర్మీ వాహనం
పది మంది సైనికులు మృతి 05

27న ఐదు రోజుల పనిదినాల అమలుకు
దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె

సంపుటి 09, సంచిక: 55 | శుక్రవారం | 23-01-2026 | ఖమ్మం
Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఫోన్ ట్యాపింగ్ కేసు

## కెటిఆర్‌కు సిట్ నోటీసులు

నేడు విచారణకు హాజరు కావాలని ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి సిరిసిల్ల ఎంఎల్‌ఎ, మాజీ మంత్రి కె. తారక రామారావు (కెటిఆర్) కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన క్రైం నెంబర్ 243/2024 కేసులో భాగంగా, సెక్షన్ 160 సిఆర్‌పిసి కింద తరువాయి 2లో

న్యూ ఇయర్ వేళ డ్రంక్ అండ్ డ్రైవ్

## 270 మందికి జైలు శిక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్

నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో రోడ్డు భద్రతను పెంపొందించడం, ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరవ్యాప్తంగా 'డ్రంక్ అండ్ డ్రైవ్'పై ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ తనిఖీలు డిసెంబర్ 24, 2025 నుండి డిసెంబర్ 31,2025 వరకు జరిగాయి. ట్రాఫిక్ పోలీసుల తరువాయి 2లో




## పనిగంటలు పెంపు.. కార్మికులను మళ్లీ

# బానిసత్వంలోకి నెట్టడమే

- ఎనిమిదిగంటల పని విధానం రద్దుపై ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ విమర్శ
- 'వేతనం' పదానికి కొత్త నిర్వచనం ఇవ్వడంతో అలవెన్సులు తగ్గుతాయని ఆందోళన
- అనేక నిబంధనలతో కార్మికుల యూనియన్లను నిర్వీర్యం చేస్తున్నారని మండిపాటు
- సిఆర్ ఫౌండేషన్‌లో 'కొత్త లేబర్‌కోడ్‌లతో ప్రయోజనం ఎంత? కార్మికవర్గంపై వాటి ప్రభావం'పై సదస్సు

**తెలంగాణ రాష్ట్రంలో లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఏకగ్రీవ తీర్మానం**

ప్రజాపక్షం/హైదరాబాద్

దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించిన 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, యజమానుల ఇష్టానుసారంగా పని గంటలు పెంచుకునే వెసులుబాటు కల్పించడం కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టడమేనని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ విమర్శించారు. 'వేతనం' అనే పదానికి కొత్త నిర్వచనం ఇవ్వడం ద్వారా అలవెన్సులు తగ్గిపోతాయని, దీని ప్రభావం పిఎఫ్, గ్రాట్యుటీ, రిటైర్‌మెంట్ ప్రయోజనాలపై తీవ్రంగా పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక నిబంధనలతో కార్మిక యూనియన్లను నిర్వీర్యం చేస్తున్నారని ఆమె విమర్శించారు. దశాబ్దాల పోరాట ఫలితంగా సాధించిన చట్టాలను కార్పొరేట్ ప్రయోజనాల కోసం కుదించారన్నారు. ఇఎస్‌ఐ, పిఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాల పరిధిని తగ్గించడంతో కార్మికుల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. హైదరాబాద్ కొండాపూర్ సి.ఆర్. ఫౌండేషన్‌లో ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో 'కొత్త లేబర్ కోడ్‌లతో ప్రయోజనమెంత? కార్మిక వర్గంపై వాటి ప్రభావం' అనే అంశంపై గురువారం నిర్వహించిన సదస్సులో అమర్‌జీత్ కౌర్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షుడు పి. ప్రసాద్, ఎఐటియుసి సీనియర్ నేత బి.వి.విజయలక్ష్మి, సి.ఆర్.ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎఐటియుసి అధ్యక్షుడు ఎం.డి. యూసుఫ్, ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి రాంబాబు, సి.ఆర్.ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవ రావు పాల్గొనగా నీలం రాజశేఖర్ రెడ్డి తరువాయి 12లో

'విబి–జి రామ్ జి'కి వ్యతిరేకంగా

# పేదలు ఏకమవ్వాలి

- రైతులు చూపిన బాటలో 'ఎంజి నరేగా' పునరుద్ధరణ ఉద్యమం కోసం నడవాలి
- కొత్త చట్టం ఉద్దేశం... గతంలో మూడు నల్ల చట్టాల ఉద్దేశం ఒక్కటే...
- జాతీయ ఎంజి నరేగా కార్మికుల సదస్సులో రాహుల్‌గాంధీ
- ఉపాధి హామీ పథకం రద్దుపై పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో నిలదీస్తాం : ఖర్గే



**న్యూఢిల్లీ :** 'ఎంజి నరేగా' స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన 'వికసిత్ భారత్‌గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ) బిల్లు 'విబి–జి రామ్ జి'కి వ్యతిరేకంగా పేద ప్రజలంతా ఏకం కావాలని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టం ఉద్దేశం, గతంలో తీసుకువచ్చిన 'మూడు నల్ల వ్యవసాయ చట్టాల' ఉద్దేశం ఒకటేనని విమర్శించారు. రైతుల నుంచి స్ఫూర్తి పొంది నరేగాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌పై ఐక్యంగా ఉండాలని కార్మికులను కోరారు. గురువారం రచనాత్మక కాంగ్రెస్ నిర్వహించిన జాతీయ ఎంజి నరేగా కార్మికుల సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో రాహుల్‌గాంధీతో పాటు పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు జైరాం రమేష్, కె.సి. వేణుగోపాల్, రచనాత్మక కాంగ్రెస్ చైర్‌పర్సన్ సందీప్ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ మాట్లాడుతూ పేదలకు హక్కులు కల్పించడమే నరేగా ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న కార్మికులు పాల్గొన్నారు. వారు తమ పని ప్రదేశాల నుండి పిడికెడు మట్టిని తీసుకువచ్చారు. దానిని గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో మొక్కలకు వేయడం ద్వారా ప్రతీకాత్మకంగా నిరసన తెలిపారు. 'రాజ్యాంగంపై, భారతదేశ భావనపై నమ్మకం ఉన్న పేద ప్రజలకు ఎంజి నరేగా ఉద్యమం ఒక పెద్ద తరువాయి 2లో




## త్యాగాలు, పోరాటాలతో సిపిఐ మమేకం

- మరో వందేళ్లు కూడా ప్రజల గుండెల్లో సుస్థిరం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- భద్రాద్రి జిల్లా గౌతంపూర్‌లో 'శత వసంత పైలాన్' ఆవిష్కరణ


ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

భారతగడ్డపై సిపిఐది తిరుగులేని ప్రస్థానం అని, 1925లో దేశ స్వాతంత్ర్యానికంటే ముందే ఆవిర్భవించిన సిపిఐ అనేక త్యాగాలు, పోరాటాలతో మమేకమై ఉందని సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండల పరిధిలో గల గౌతమ్‌పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతవసంత పైలాన్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ పేదలు, కార్మికులు, రైతులు, రైతుకూలీలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే నాటి నుండి నేటి వరకు ఎర్రజెండా పనిచేస్తోందని తరువాయి 2లో

## భారత్ ఫ్యూచర్ సిటీలో

# ఎఐ డేటా సెంటర్

- 100 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన యుపిసి వోల్ట్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందంతో అవగాహన ఒప్పందం
- రూ.5 వేల కోట్ల పెట్టుబడులు – సుమారు 4 వేల మందికి ఉపాధి
- రూ.623 కోట్ల పెట్టుబడితో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ
- తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు వరల్డ్ ఎకనామిక్ ఫోరం మద్దతు



డబ్ల్యుఇఎఫ్ ఎండి జెరెమీ జర్గెన్స్‌తో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోనే తెలంగాణను ఎఐ డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక పెట్టుబడిని సాధించింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' బృందం దావోస్‌లో యుపిసి వోల్ట్ సంస్థతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. యుపిసి వోల్ట్ సిఈఓ హాన్ డీ గ్రూట్, యుపిసి రిన్యూవబుల్స్ ఎపిఎసి సహ వ్యవస్థాపకులు స్టీవెన్ జ్వాన్, యుపిసి రిన్యూవబుల్స్ ఇండియా సిఈఓ అలోక్ నిగమ్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నెదర్లాండ్స్‌కు చెందిన యుపిసి రిన్యూవబుల్స్ గ్రూప్, వోల్ట్ డేటా సెంటర్స్ కలిసి యుపిసి వోల్ట్ సంస్థగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఈ సంస్థ భారత్ ఫ్యూచర్ సిటీలో 100 మెగావాట్ల సామర్థ్యంతో ఎఐకు అనుకూలమైన డేటా సెంటర్ నెలకొల్పనుంది. ఈ ప్రాజెక్టుకు ఐదేళ్లలో రూ.5,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ డేటా సెంటర్‌కు అవసరమైన విద్యుత్ సరఫరాకు 100 మెగావాట్ల సామర్థ్యంతో ప్రత్యేక పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ దశలోనే 3 వేల మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి. డేటా సెంటర్ ప్రారంభమైన తర్వాత మరో 800 మందికి ఉద్యోగ అవకాశాలుంటాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల తరువాయి 2లో



ఆ రైస్ మిల్లులకు ధాన్యం


## కేటాయించొద్దు

- రాజకీయ జోక్యానికి లొంగవద్దు
- నిబంధనలు ఉల్లంఘించే రైస్ మిల్లులపై కఠిన చర్యలు
- బియ్యాన్ని ఎగుమతి చేసే మిల్లర్లకు ప్రోత్సాహం
- పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

డీఫాల్టర్ రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించొద్దని, ఈ విషయంలో ఎటువంటి రాజకీయ జోక్యానికి లొంగవద్దని అధికారులను రాష్ట్ర పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెలంగాణ బియ్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసేందుకు ముందుకొచ్చే రైస్ మిల్లర్లను ప్రోత్సహిస్తామని, పేదల కడుపు నింపే 'సన్న బియ్యం' విషయంలో అవకతవకలకు పాల్పడితే సహించబోమని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తరువాయి 2లో

## జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్



**తలపై రూ. కోటి రివార్డు ఉన్న మావోయిస్టునేత సహా 15 మంది మృతి**

ప్రాణాలు కోల్పోయిన అగ్రనేత పతిరామ్ మాఝీ

**చైబాసా :** జార్ఖండ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలో గురువారం భద్రతా బలగాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో 15 మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో తన తలపై రూ. 2.35 కోట్ల రివార్డు ఉన్న అగ్ర నాయకుడు అనల్ దా కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కిరిబురు పోలీస్ స్టేషన్ పరిధిలోని సరండా అడవిలోని కుండిలో సిఆర్‌పిఎఫ్ కోబ్రా యూనిట్‌కు చెందిన సుమారు 1,500 మంది సిబ్బంది ఈ ఆపరేషన్‌లో నిమగ్నమై ఉన్నారని వారు చెప్పారు. ఎదురు కాల్పులు తరువాత మావోయిస్టు అగ్ర నాయకుడు పతిరామ్ మాఝీ అలియాస్ అనల్ దా సహా 15 మంది మావోయిస్టుల మృతదేహాలను మేము స్వాధీనం చేసుకున్నామని చైబాసాలోని పోలీస్ ప్రధాన కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. భారీ మొత్తంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ ఎదురు కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయని వెల్లడించింది. సరండా అడవిలో మంగళవారం నుంచి మావోయిస్టుల వ్యతిరేక ఆపరేషన్ కొనసాగుతోందని, అయితే ఎదురు కాల్పులు గురువారం ఉదయం తరువాయి 12లో

## కర్నాటకలోనూ అదే తీరు...

శాసనసభ, మండలి సంయుక్త సమావేశంలో కేవలం రెండు, మూడు లైన్లే చదివిన గవర్నర్

అధికారపక్షంలో తీవ్ర ఆగ్రహానికి గురి చేసిన థావర్‌చంద్ గెహ్లాట్ చర్య

గవర్నర్‌పై 'సుప్రీం'కు వెళ్లే విషయాన్ని పరిశీలిస్తామన్న సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు :** బిజెపియేతర పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు, ప్రభుత్వాలకు మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి. రెండు రోజుల క్రితం కేరళ, తమిళాడు రాష్ట్రాల్లో జరిగిన ఘటనలే గురువారం కర్నాటకలోనూ పునరావృతమైంది. కొత్త ఏడాదిలో తొలిసారి కర్నాటకలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ శాసనసభలో తన సంప్రదాయ ప్రసంగాన్ని కేవలం మూడు వాక్యాలకే పరిమితం చేశారు. ప్రభుత్వం సిద్ధం చేసిన సుదీర్ఘ ప్రసంగంలోని మొదటి, చివరి వాక్యాలను మాత్రమే చదివారు. గవర్నరం చర్య అధికార పక్షంలో తీవ్ర ఆగ్రహానికి గురైంది. గవర్నర్‌పై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మండిపడ్డారు. గెహ్లాట్ తరువాయి 2లో

డెన్మార్క్–గ్రీన్‌లాండ్ తరపున

## ట్రంప్‌తో నాటో అధిపతి ఎలా చర్చిస్తారు?

డెన్మార్క్ ప్రధాని ఫ్రెడెరిక్సెన్ ఆగ్రహం



**లండన్:** మా సార్వభౌమాధికారంపై ఎవ్వరితోనూ మేం సంప్రదింపులు చెయ్యలేమని డెన్మార్క్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడరిక్సెన్ ప్రకటించారు. ఆర్కిటిక్ ద్వీపం భవితవ్యంపై డెన్మార్క్ లేదా గ్రీన్‌లాండ్ తరపున అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో నాటో అధిపతి మార్క్ రట్టే ఎలా సంప్రదింపులు జరుపుతారని ఆమె వ్యక్తం చేశారు. మా తరపున ఆయన సంప్రదింపులు జరపలేరన్నారు. దీంతో కొత్త వివాదం తలెత్తినట్లయింది. గ్రీన్‌లాండ్‌పై బలప్రయోగం అవసరం లేదని, ఆ ఉద్దేశం లేదని, ఐతే తక్షణం తాము చర్చలు కోరుతున్నామని దావోస్‌లో డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదన, నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టేతో ట్రంప్ ముఖాముఖీ సమావేశం తర్వాత గురువారం మధ్యాహ్నం మెట్టే ఫ్రెడరిక్సెన్ పైవిధంగా స్పందించారు. ఆర్కిటిక్ తరువాయి 12లో

# దావోస్‌లో 'శాంతి మండలి' ఆవిర్భావం
# సంతకాలు చేసిన 19 దేశాల అధిపతులు

ఐక్యరాజ్యసమితితో కలిసి పనిచేస్తాం..
మరో యుద్ధాన్ని కూడా పరిష్కరిస్తాం : ట్రంప్

**దావోస్ :** దావోస్ వేదికగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నాయకత్వాన ఆయన కోరుకున్న విధంగా గురువారం బోర్డ్ ఆఫ్ పీస్ (శాంతి మండలి) ఆవిర్భవించింది. ఈ 'శాంతి మండలి'చట్రానికి కట్టుబడి ఉండే 'గాజా కార్యనిర్వాహక మండలి' ఆ ప్రాంత అభివృద్ధికి పనిచేస్తుంది. ''మేం త్వరలో మరో యుద్ధాన్ని ఆపేయబోతున్నాం'' అని ఈ సందర్భంగా ట్రంప్ ఉక్రెయిన్ గురించి పరోక్ష ప్రకటన చేశారు. యథాప్రకారంగానే, ''ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను నేను నివారించా'' అని చెప్పుకున్నారు. ట్రంప్‌తోపాటు అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్‌మిలే, హంగేరీ ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బాన్, పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సహా మొత్తం 19 దేశాలకు చెందిన ప్రధానమంత్రులు లేదా అధ్యక్షులు ఈ వేదికపై ఆశీనులై 'ఛార్టర్ ఆఫ్ డాక్యుమెంట్‌పై సంతకాలు చేశారు. ఈ విషయంలో ఐక్యరాజ్య సమితిని పూర్తిగా పక్కకు నెట్టేసినప్పటికీ, శాంతి మండలి అంతర్జాతీయ సమితిలో కలిసి పనిచేస్తుందని ట్రంప్ ప్రకటించారు. గాజా పునర్నిర్మాణం, ప్రజలకు మానవతా సహాయం పంపిణీ ఈ బోర్డు ప్రస్తుత ప్రధాన లక్ష్యాలు. ఇప్పటివరకూ తెలిసిన సమాచారం ప్రకారం ఛార్టర్ ఆఫ్ డాక్యుమెంట్‌లో పాలస్తినా ప్రాంతం పేరు ఎక్కడా లేదు. ఈ శాంతి మండలి ఛార్టర్ డాక్యుమెంటును చూస్తే ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయంగా కార్యకలాపాలు నిర్వహించే లక్షణాలు కనిపిస్తున్నాయని నివేదికలు తెలిపాయి. పశ్చిమ ఆసియా ఇప్పుడు శాంతియుత వాతావరణంలో ఉందని, గాజాలోకి అపరిమితంగా మానవతా సహాయాన్ని ప్రవహింపజేస్తామని ప్రకటించారు.




గాజాలో యుద్ధం ముగింపు దశకు చేరుకుంటోందని, ఇప్పుడు ఉన్నది కేవలం చిన్న చిన్న మంటలు మాత్రమేనని, ఈ మంటలను చాలా సులభంగా ఆర్పేయవచ్చునని అన్నారు. హమాస్ వారు వాగ్దానం చేసిన విధంగా వారు ఆయుధాలను వదిలిపెట్టాలి, స్వాధీనం చేయాలి, లేకపోతే అదే వారికి అంతం అవుతుందని హెచ్చరిక చేశారు. గత ఏడాది అక్టోబరులో శాంతి ఒప్పందం అమలులోకి వచ్చినప్పటికీ అనేకసార్లు ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని వందలసార్లు ఉల్లంఘించింది. ఈ కాల్పుల్లో 466 మంది పాలస్తీనియన్లు మరణించారు. అంతర్జాతీయ సంఘర్షణలను పరిష్కరించేందుకు ట్రంప్ చైర్మన్‌గా ఆవిర్భవించిన ఈ ''శాంతి మండలి''లో శాశ్వత సభ్యత్వం పొందడానికి 100 కోట్ల డాలర్లు మొత్తాన్ని సభ్యదేశాలకు విరాళం లక్ష్యంగా ఆయన నిర్దేశించారు. శత్రు–మిత్రవులనే తేడా లేకుండా విస్తారంగా ఆయన అనేక దేశాలకు ఈ శాంతి మండలిలో చేరాలని ఆహ్వానాలు పంపారు. ఈ జాబితాలో భారత్–పాకిస్థాన్, ఇజ్రాయెల్–టర్కీ, కాబోడియా–ఇండోనేసియా, కెనడా, బ్రిటన్,ఫ్రాన్స్ తదితర దేశాలున్నాయి. గాజా పునర్నిర్మాణాన్ని, కాల్పుల విరమణను ఈ దేశాలు పర్యవేక్షించాల్సి ఉంటుంది. వైట్ హౌస్ విడుదల చేసిన సమాచారం ప్రకారం మొత్తం 50 దేశాలకు ట్రంప్ ఆహ్వానాలు పంపించారు. 35 దేశాలు ఈ శాంతి మండలిలో చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. తాజాగా గురువారం ఇండోనేసియా తన అంగీకారం తెలియజేసింది. గాజాలో 2025 అక్టోబరు 10వ తేదీ నుండి పూర్తిస్థాయీ కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది. బందీలను, మృతదేహాలను స్వాధీనం చేసుకునే మొదటి విడత ప్రక్రియ పూర్తికాగా ఇక హమాస్ ఉగ్రవాదులను సాగనంపి, గాజా బోర్డు ఏర్పాటు చేసే రెండోదశ ప్రక్రియ దావోస్‌లో ఈ రూపేణా ప్రారంభమైంది. ఆర్మేనియా, అజర్‌బైజాన్, బహ్రైన్, బల్గేరియా, ఇండోనేసియా, జోర్డాన్, కజకిస్థాన్, కొసావో, మంగోలియా, మొరాకో, పర్వాగే, ఖతార్, సాదీఅరేబియా, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఉజ్బెకిస్థాన్ దేశాల నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సెంట్రల్ గాజాలో ఇజ్రాయెల్ దాడి.. ముగ్గురు ఫోటో జర్నలిస్టులు మృతి




**గాజా:** సెంట్రల్ గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ముగ్గురు ఫోటో జర్నలిస్టులు మరణించారు. ఒకవైపు దావోస్‌లో 'శాంతి మండలి' ఆవిర్భావసభ అట్టహాసంగా జరిగిన సమయంలో గాజాలో ఇజ్రాయెల్ దాడులు చేసింది. గాజా వ్యాప్తంగా గడచిన 24 గంటల్లో జరిగిన దాడుల్లో మరో ఎనిమిది మంది మరణించారు. సెంట్రల్‌గాజాలో ఒక ట్యాంకర్ దగ్ధం కావడంతో 13 ఏళ్ల బాలుడు సహా ముగ్గురు మరణించారు. గత ఏడాది అక్టోబరులో గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటినుండి ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 466 మంది పాలస్తీనియన్లు కాల్పుల్లో మరణించారు. ఇజ్రాయెల్ దాడిలో మరణించిన ఫోటో జర్నలిస్టులను మహ్మద్ సలాహ్ క్వాస్టా, అనాహ్ ఘెయిమ్, అబ్దుల్ రావూఫ్ షాత్‌లుగా గుర్తించారు. వారు కారులో వెళుతుండగా సైన్యం దాడికి గురయ్యారు. నిజానికి ఈ ముగ్గురు ఫొటో జర్నలిస్టులు సెంట్రల్ గా జాలో ఈజిప్టు తరపున పనిచేసే ఒక సహాయ పునరావాస సంస్థ తరపున నిరాశ్రయులైన ప్రజల శిబిరాలను చిత్రీకరించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఐతే ఈ కారుకు మానవతా సహాయం అనే బోర్డులు రాసి ఉన్నాయని, ఉద్దేశపూర్వకంగానే వారి కారుపై దాడి జరిగిందని స్థానికులు చెబుతున్నారు. కాగా ఇజ్రాయెల్ సైన్యం మాత్రం అనేకమంది సందేహాస్పదంగా హమాస్ ఉగ్రవాదులతో కలిసి డ్రోన్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, మరికొందరు నిర్దేశిత ఎల్లోలైన్ దాడి వస్తున్నారని ఈ క్రమంలో కాల్పులు జరిగాయని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

## సిపిఐ మమేకం (మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. రానున్న వందేళ్లు కూడా ప్రజలతో మమేకమై ముందుకు సాగుతుందన్నారు. ఈనెల 18న ఖమ్మం కేంద్రంగా నిర్వహించిన సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సభకు దేశ విదేశాల నుండి కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు హాజరయ్యారని, కనీ వినీ ఎరుగని రీతిలో సభ జరిగిందని, లక్షలాది మంది హాజరైన ఈ సభ దేశ చరిత్రలోనే సువర్ణాధ్యాయంగా మిగిలిపోతుందన్నారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టుల పని అయిపోయిందని అనేక మంది అవాకులు చెవాకులు పేలుతున్నారని, కమ్యూనిస్టుల సత్తా ఏంటో మొన్నటి సభతో దేశంలో సూడో మేధావులుగా చెప్పుకునే వారికి అర్థమయ్యే ఉంటుందన్నారు. ప్రతీ కమ్యూనిస్టు కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని, ప్రజలతో మమేకమై ముందుకు సాగిన నాడు ఆ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారని, ఆ దిశగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలో జరగనున్న మున్సిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. వట్టికొండ మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు మిర్యాల రంగయ్య, చలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళీ, జీ వీరస్వామి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, భూక్యా ధస్రు, ఎస్‌కే ఫయాం, జిల్లా సమితి సభ్యులు కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, మునిగడప వెంకటేశ్వర్లు, నేరెళ్ల రమేష్, నాయకులు తోట రాజు, బొర్రా కేశవరావు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# యూరప్ దేశాలపై 10 శాతం సుంకాల ఉపసంహరణ

నాటో అధిపతితో భేటీ తర్వాత ట్రంప్ ప్రకటన

**దావోస్:** గ్రీన్‌లాండ్ స్వాధీనాన్ని వ్యతిరేకించిన ఎనిమిది యూరప్ దేశాలపై విధించిన 10 శాతం అదనపు సుంకాలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉపసంహరించుకున్నారు. దీంతో ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి వసూలు చేయాల్సిన 25 శాతం సుంకాలు తిరిగి 15 శాతానికి చేరాయి. గురువారం దావోస్‌లో నాటో కూటమి ప్రధాన కార్యదర్శి జనరల్ మార్క్ రట్టేతో ముఖాముఖీ సమావేశం తర్వాత తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఒక పోస్టింగ్ పెడుతూ పదీ శాతం సుంకాలను వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా గ్రీన్‌లాండ్ సహా యావత్ ఆర్కిటిక్ ప్రాంత భవితవ్యానికి సంబంధించి నిర్దేశిత ప్రణాళిక నిమిత్తం ఒక చట్రాన్ని తయారు చేస్తామని, ఈ మేరకు తాము ఒక అవగాహనకు వచ్చినందువల్ల ఎనిమిది యూరప్ దేశాలపై పదిశాతం అదనపు సుంకాలను ఉపసంహరించుకున్నానని ఆ పోస్టింగ్‌లో పేర్కొన్నారు. డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్,ఫిన్లాండ్ దేశాలకు నిర్ణీత ప్రకారం ఈ అదనపు సుంకాలు వర్తించాల్సి ఉంది. ట్రంప్‌తో సమావేశం చాలా బాగా జరిగిందని మార్క్ రట్టో ప్రకటించారు. గ్రీన్‌లాండ్‌పై భవిష్యత్ ఒప్పందం చేసుకోవడానికి వీలుగా ఒక ప్రణాళికా చట్రాన్ని తయారు చేసేందుకు ముఖాముఖీ చర్చల్లో తామిద్దరం అంగీకరించామని రట్టో చెప్పారు. గ్రీన్‌లాండ్‌లో ఆర్థిక, మిలిటరీపరమైన ప్రయోజనాలు పొందకుండా చూసేందుకు తదుపరి చర్చలు కొనసాగుతాయన్నారు. దీంతో గడచిన జులై నెలలో స్కాట్‌లాండ్ లోని ట్రంప్ సొంత గోల్ఫ్‌కోర్స్‌లో యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్–ట్రంప్ మధ్య ముఖాముఖీ చర్చల్లో కుదిరిన అమెరికా–యూరోపియన్ యూనియన్ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకునేందుకు ఉర్సులా సిద్ధపడ్డారు. ఈ ఒప్పందాన్ని లాంఛనంగా ఈ వారంలోనే ఆమోదించాల్సిన యూరోపియన్ పార్లమెంటు ఈ నిర్ణయాన్ని రద్దుచేసుకుంది. అమెరికా సరుకులపై ప్రతీకార సుంకాలకు కూడా ఉర్సులా సిద్ధమయ్యారు. యూరోపియన్ యూనియన్ దేశాల నాయకులందరూ గ్రీన్‌లాండ్ సార్వభౌమాధికారానికి, ఆర్కిటిక్ ప్రాంత సంరక్షణకు కట్టుబడి డెన్మార్క్ పక్షాన చేరారు. యూరోపియన్ యూనియన్ అమెరికాపై ఆధారపడకుండా సర్వ స్వతంత్రంగా ఉండేవిధంగా పునర్నిర్మించుకోవాలని ఉర్సులా పిలుపు ఇచ్చారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ దావోస్ వేదికపై జనవరి 20వ తేదీన ప్రసంగిస్తూ, ఆర్కిటిక్ ప్రాంత సార్వభౌమాధికారానికే తాము కట్టుబడి ఉన్నామంటూ నాటో చట్టంలోని ఆర్టికల్ ఫైవ్ పట్ల నిబద్ధత ప్రకటించారు. ఈ ఆర్టికల్ ప్రకారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సభ్యదేశాలపై దాడి జరిగితే అది యావత్ నాటో కూటమిపై జరిగిన దాడిగా సభ్యదేశాలు పరిగణిస్తాయి. ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరి ప్రపంచ అధికార సమతౌల్యంలో భారీ మార్పులు సంభవించే పరిణామాలు చోటు చేసుకోకముందే ట్రంప్ జాగ్రత్త పడ్డారు. దావోస్ వేదికగా జనవరి 21వ తేదీన కీలక ప్రసంగంలో నాటో,యూరప్ దేశాలపై ఘాటు విమర్శలు, ప్రశంసలు ఉపయోగించారు. ఫ్రాన్స్,జర్మనీ,బ్రిటన్, డెన్మార్క్, బెల్జియంలపట్ల సర్దుబాటు ధోరణితో వ్యవహరించారు. స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్‌సన్ స్పందిస్తూ, ట్రంప్ ధిక్కార వాక్చాతుర్యం ప్రయోగించారని, ఏ విధంగా చూసినా ట్రంప్ దావోస్ ప్రసంగం అన్యాయంగా ఉందని విమర్శించారు. గ్రీన్‌లాండ్‌పై బల ప్రయోగం చేయాల్సిన అవసరం లేదని ట్రంప్ చెబుతూ నాటోకోసం అమెరికా చాలా చేసిందన్నారు.

## సిట్ నోటీసులు (మొదటి పేజీ తరువాయి)

ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. జూబ్లీ హిల్స్ డివిజన్ సహాయ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి ఈ నోటీసులు పంపించారు.దర్యాప్తు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, కేసుకు సంబంధించిన విషయాలపై కెటిఆర్‌కు అవగాహన ఉందని గుర్తించిన నేపథ్యంలో, వ్యక్తిగతంగా విచారణకు హాజరై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీ హిల్స్‌లోని ఎసిపి కార్యాలయంలో హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు. చట్టబద్ధమైన కారణం లేకుండా నోటీసులను పాటించకపోతే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.ఫోన్ టాపింగ్ వ్యవహారంలో ఇప్పటికే పలువురు అధికారులను విచారించిన పోలీసులు, రాజకీయ నేతల పాత్రపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. కెటిఆర్‌కు నోటీసులు జారీ కావడంతో ఈ కేసు మరింత రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.**కెటిఆర్ విచారణకు హాజరవుతారు..:**ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు నోటీసులు అందాయి. 160 సిఆర్‌పిసి కింద సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో విచారణకు కెటిఆర్ హాజరు అ వుతారని న్యాయవాది సోమ భరత్ స్పష్టం చేశారు. ఈ కేసులో చట్టబద్ధంగానే న్యాయపోరాటం చేస్తామని కెటిఆర్ తరపు న్యాయవాది సోమ భరత్ తెలిపారు.

## పేదలు ఏకమవ్వాలి (మొదటి పేజీ తరువాయి)

అవకాశం. వారు ఐక్యంగా నిలబడితే, (ప్రధానమంత్రి నరేంద్ర) మోదీ వెనక్కి తగ్గుతారు. ఎంజి నరేగాను పునరుద్ధరిస్తారు' అని అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం వ్యవస్థలోని మూడవ అంచె అయిన పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా పనిచేసిందని, ఈ పథకంలో ప్రజల గళం, వారి హక్కులు పొందుపరిచి ఉన్నాయని, దీని ద్వారా పేదలకు పని హక్కు కల్పించబడిందన్నారు. అతే ఇప్పుడు నరేంద్ర మోదీ–బిజెపి ఈ భావనను అంతం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. 2020లో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చి, మరుసటి సంవత్సరం రద్దు చేసిన వ్యవసాయ చట్టాలను గుర్తుచేసుకుంటూ, కొన్ని సంవత్సరాల క్రితం బిజెపి రైతులపై దాడి చేసిందని గాంధీ అన్నారు. మోదీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకురాగా, వాటిని రైతులు అడ్డుకోగలిగారని, పార్లమెంటులో, వీధుల్లో, రైతులతో కలిసి తాము ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఆ చట్టాలను రద్దు చేయించామని రాహుల్ గుర్తు చేశారు. ప్రభుత్వం రైతులకు ఏ పద్ధతిని అయితే వర్తింపజేసిందో, ఇప్పుడు అదే పద్ధతిని కార్మికులపై కూడా ప్రయోగించడానికి ప్రయత్నిస్తోందని గాంధీ ఆరోపించారు. ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రానికి ఎంత డబ్బు పంపాలి అని నిర్ణయిస్తుందనేది దీని వెనుక ఉన్న ఆలోచన అని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు ఎక్కువ డబ్బు, ప్రతిపక్షాలు పాలించే రాష్ట్రాలకు తక్కు వ డబ్బు వెళ్తుందని ఆయన ఆరోపించారు. పని ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందో, కార్మికుడికి ఎంత వేతనం లభిస్తుందో కేంద్ర ప్రభుత్వం మాత్రమే నిర్ణయిస్తుందని, కార్మికుల హక్కులు పూర్తిగా హరించబడ్డాయని మండిపడ్డారు. కార్మికులకు గతంలో లభించేది ఇప్పుడు కాంట్రాక్టర్లు, బ్యూరోక్రసీకి వెళ్తుందని విమర్శించారు. దేశ సంపద, ఆస్తిని కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించడమే బిజెపి విధానాలన్నింటి లక్ష్యమని, ఆ కొద్దిమందే ఈ దేశాన్ని పరిపాలించాలని చూస్తున్నారని రాహుల్‌గాంధీ ఆరోపించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగంపై బిజెపి దాడి చేస్తోందని తాను చెప్పానని గాంధీ గుర్తు చేశారు. 'వ్యవసాయ చట్టాలు రాజ్యాంగంపై దాడి, పెద్ద నోట్ల రద్దు కూడా అంతే, లోపభూయిష్టమైన జిఎస్‌టి కూడా అంతే. ఈ కొత్త చట్టం పేరు ఏమిటి.... నాకు తెలియదు' అని ఆయన అనగా, సభికులలో కొందరు 'విబి–జి రామ్ జి' అంటూ గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, 'ఒక వ్యక్తి–ఒక ఓటు' అనే భావనను అంతం చేయడమే బిజెపి ఆలోచన అని మాజీ కాంగ్రెస్ అధినేత అన్నారు. మోదీ సర్కార్ ఎంజి నరేగాను రద్దు చేయడం మహాత్మాగాంధీ పేరును ప్రజల మదిలో నుండి తొలగించే ప్రయత్నమేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గురువారం ఆరోపించారు. పార్లమెంట్ రాబోయే బడ్జెట్ సమావేశాల్లో తమ పార్టీ ఈ విషయాన్ని గట్టిగా లేవనెత్తుతుందని ఉద్ఘాటించారు. ప్రజలు ఏకమై ఈ కొత్త చట్టాన్ని అమలు చేయకుండా ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

## ఎఐ డేటా సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడంలో ఆధునిక డిజిటల్ మౌలిక వసతులు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధిని సాధించడమే రాష్ట్ర లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ అధునాతన ఎఐ డేటా సెంటర్ల ఏర్పాటుకు అవసరమైన ప్రోత్సాహకాలు, సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.
**రూ.623 కోట్ల పెట్టుబడితో స్నైడర్ ఎలక్ట్రిక్ విస్తరణ**
తెలంగాణ రాష్ట్రంలో స్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా కంపెనీ తమ యూనిట్లను విస్తరించనుంది. శంషాబాద్ , గాగిల్లాపూర్‌లో రూ.623 కోట్ల పెట్టుబడితో విస్తరిస్తున్నట్లు వెల్లడించింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్) 2026లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, స్నైడర్ కంపెనీ సిఈఓ దీపక్ శర్మతో సమావేశమయ్యారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులు, విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు, గ్రిడ్ ఆధునీకరణ, విద్యుత్ సామర్థ్యం పెంపు, ఇండస్ట్రియల్ పార్కులు, పట్టణ మౌలిక వసతులకు డిజిటల్ విద్యుత్ నిర్వహణ వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. స్నైడర్ ఎలక్ట్రిక్‌కు తెలంగాణలోనే 38 నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఉన్నాయని, ఈ యూనిట్ల విస్తరణతో ఎలక్ట్రికల్ సేఫ్టీకి సంబంధించి ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్లు, మోల్డెడ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్లు, కాంటాక్టర్లు, పుష్ బటన్ల తయారీ సామర్థ్యం పెరుగనుందని అధికారులు వెల్లడించారు. ఇంధన నిర్వహణ, ఆటోమేషన్, ఈవీ భాగాల తయారీలో స్మార్ట్ ఫ్యాక్టరీల విస్తరణపై మంత్రులు చర్చించారు. ప్రస్తుతం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ కేంద్రాల్లో ఒకటిగా తెలంగాణ ఎదిగిందని మంత్రులు తెలిపారు.
**తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు వరల్డ్ ఎకనామిక్ ఫోరం మద్దతు:** దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో ఏర్పాటు చేసిన తెలంగాణ పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వరల్ ఎకనమిక్ ఫోరమ్ మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్, సి4ఐఆర్ నెట్‌వర్క్ కోఆర్డినేషన్ హెడ్ మంజు జార్జతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యాలతో పాటు వరల్ ఎకనమిక్ ఫోరమ్ ఫాలోఅప్ సదస్సు నిర్వహించే ప్రతిపాదనలను



చర్చించారు. జనవరిలో దావోస్‌లో జరుగుతున్న సదస్సులోని చర్చలు, తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించుకునేందుకు ఫాలో అప్ సమావేశం ఉపయోగపడుతుందని సిఎం చెప్పారు. తెలంగాణలో అందుబాటులో ఉన్న అవకాశాలు, పారిశ్రామిక రంగంలో ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ప్రభుత్వ విధానాలను ప్రపంచానికి చూపించాలనే ఆలోచనను పంచుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం సానుకూలంగా స్పందించింది. వివిధ దేశాల నుంచి ప్రతిపాదనలు వచ్చినప్పటికీ సమీప భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ తెలిపారు. చైనాలో ప్రతి ఏడాది 'సమ్మర్ దావోస్' జరుగుతోందని, సౌదీ అరేబియా కూడా ఆసక్తి ప్రదర్శిస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో తెలంగాణ రైజింగ్–2047 విజన్, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్, లక్ష్యాలను సిఎం వివరించారు. తెలంగాణ విజన్‌లోని విభిన్న కోణాలు, వివిధ కోణాలు పరస్పర సహకారానికి అవకాశం కల్పించేలా ఉన్నాయని డైరెక్టర్ జెరెమీ జర్గెన్స్ ప్రశంసించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో తాము భాగస్వామ్యం పంచుకుంటామన్నారు. తెలంగాణ ఆర్థిక వృద్ధి ప్రయాణంలో కలిసి వస్తామనే సంకేతాలు ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేట్టి, అధికారులు పాల్గొన్నారు.

## అదే తీరు...(మొదటి పేజీ తరువాయి)

సొంత వ్యాఖ్యలు చేశారని ఆరోపించడమే కాకుండా, ఆయనను కేంద్రానికి కనుసన్నల్లో పనిచేసే వ్యక్తి అని అభివర్ణించారు. కేరళ, తమిళనాడులతో పాటు, బిజెపియేతర పాలనలో ఉన్న మూడు దక్షిణ రాష్ట్రాలలో రెండు రోజుల్లో జరిగిన మూడవ ఘటన ఇది. గెహ్లోట్ శాసన సభ, శాసనమండలి సంయుక్త సమావేశంలో సంక్షిప్త ప్రసంగం తర్వాత బయటకు వెళ్లిపోయారు. ఈ సమయంలో అధికార కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలుపుతూ, ఆయన్ను ఘెరావ్ చేయడానికి కూడా ప్రయత్నించారు. కాగా, గవర్నర్ తన ప్రసంగాన్ని ముఖ్యమంత్రి, అసెంబ్లీ స్పీకర్ యుటి ఖాదర్, మండలి చైర్మన్ బసవరాజ్ హొరట్టి, ప్రతిపక్ష నాయకులు, మంత్రులు, సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రారంభించారు. 'రాష్ట్ర శాసనసభ ఉభయ సభల సంయుక్త సమావేశానికి మీ అందరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నాను. కర్ణాటక శాసనసభలో మరో సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించడం నాకు చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర ఆర్థిక, సామాజిక, భౌతిక అభివృద్ధి వేగాన్ని రెట్టింపు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. జై హింద్. జై కర్ణాటక' అని ఆయన హిందీలో చెప్పి, అక్కడి నుండి వెళ్లిపోయారు. హెచ్ కె పాటిల్ (న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాలు) వంటి మంత్రులతో సహా అధికార పక్ష సభ్యులు ఆశ్చర్యంతో లేచి, ప్రసంగాన్ని పూర్తి చేయాలని గెహ్లోట్‌ను అభ్యర్థించారు. గవర్నర్ నిష్క్రమణ ద్వారం వైపు వెళ్తుండగా, ఎమ్మెల్సీ బికె హరిప్రసాద్ సహా కొందరు అధికార పార్టీ శాసనసభ్యులు నినాదాలు చేస్తూ ఆయన్ను ఘెరావ్ చేయడానికి ప్రయత్నించారు. వారిని భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. అనంతరం శాసనసభ్యులు 'సిగ్గు సిగ్గు' అని, కన్నడలో 'ధిక్కార–ధిక్కార, రాజ్యపాలరిగే ధిక్కార' (గవర్నర్‌కు నిరసన) అని నినాదాలు చేశారు. అయితే గవర్నర్‌ను సమర్థిస్తూ బిజెపి సభ్యులు 'భారత్ మాతా కీ జై' అని నినాదాలు చేశారు. గెహ్లోట్ చర్యపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. ఆయన తన రాజ్యాంగ బాధ్యతలు, విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగానికి బదులుగా గవర్నర్ తన సొంత ప్రసంగాన్ని చదివారని ఆరోపించిన సిద్ధరామయ్య, గెహ్లోట్ రాజ్యాంగ ఆదేశాలను పాటించలేదని మండిపడ్డారు. ప్రభుత్వం సిద్ధం చేసిన పూర్తి ప్రసంగాన్ని చదవకుండా గవర్నర్ రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని, కేంద్ర ప్రభుత్వ 'కనుసన్నల్లో పనిచేసే వ్యక్తి'లా వ్యవహరించారన్నారు.'ప్రతి కొత్త సంవత్సరం గవర్నర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించాలి. రాష్ట్ర మంత్రివర్గం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదవాలి. అది రాజ్యాంగ బద్ధం. ఎందుకంటే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 176, ఆర్టికల్ 163 ప్రకారం గవర్నర్ ప్రభుత్వం లేదా మంత్రివర్గం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదవాలి' అని సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంలో మంత్రివర్గం సిద్ధం చేసిన ప్రసంగాన్ని చదవడానికి బదులుగా, ఆయన స్వయంగా సిద్ధం చేసుకున్న ప్రసంగం చేశారని,ఇది భారత రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని సిద్ధ రామయ్య పేర్కొన్నారు. ఇది ఆర్టికల్ 176, 163లను స్పష్టంగా ఉల్లంఘిస్తుందని, అందువల్ల ఇది గవర్నర్ ప్రసంగం కాదన్నారు. ఆయన రాజ్యాంగం ప్రకారం తన విధులను నిర్వర్తించలేదని ముఖ్యమంత్రి తీవ్రంగా విమర్శించారు. ఈ నేపథ్యంలో తాము గవర్నర్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన తెలుపబోతున్నామన్నారు. సుప్రీంకోర్టును ఆశ్రయించాలా వద్దా అని తాము పరిశీలిస్తున్నాని చెప్పారు. బిజెపియేతర పాలిత రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాలు, రాజ్‌భవన్‌ల మధ్య జరుగుతున్న వరుస ఘర్షణలలో భాగంగా, రాజ్‌భవన్, కాంగ్రెస్ ప్రభుత్వం మధ్య నెలకొన్న ఉద్రిక్త ప్రతిష్టంభన తర్వాత గెహ్లోట్ క్లుప్తంగా కనిపించారు. గవర్నర్ తన ప్రసంగం ముగింపులో జాతీయ గీతం ఆలపించే వరకు వేచి ఉండనందున, ఆయన జాతీయ గీతాన్ని అవమానించారని పాటిల్ ఆరోపించారు.

## కేటాయించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందని, ధాన్యం దిగుబడి, కొనుగోలులో కూడా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఆల్‌టైమ్ రికార్డ్‌ను సాధించిందని ఆయన వెల్లడించారు. '2025–26 రబీ సీజన్ 'ధాన్యం కొనుగోలు, రబీ 2025–26 రబీ సీజన్ కొనుగోలు ప్రణాళిక అంశంపైన హైదరాబాద్‌లోని ఐఎఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ బిల్డింగ్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ధాన్యం కొనుగోలు, దిగుబడి, సరఫరా, ప్రజా పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపైన పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ గైడ్‌లైన్స్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ బాగుపడితే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యంతో పాటు మరిన్ని నిత్యావసర సరుకుల సరఫరాకు ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. రాష్ట్రంలో 2020–21లో నమోదైన 70.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు రికార్డ్‌ను అధిగమించి, తాజాగా జరిగిన ఖరీఫ్ సీజన్ లో 71.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి దేశ చరిత్రలోనే కొత్త అధ్యాయం సృష్టించిందని వెల్లడించారు. దేశ చరిత్రలోనే ఇంత పెద్ద స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన దాఖలాలు దేశంలోని ఏ ఇతర రాష్ట్రాలలో లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశ చరిత్రలోనే రికార్డ్ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసిన ఘనత తెలంగాణ రాష్ట్రానికి దక్కిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నాలకు మొట్ట మొదటి సారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బోనస్ తో కలిపి మొత్తం రూ 18,532.98 కోట్లను 14.20 లక్షల మంది రైతులకు చెల్లించామని వివరించారు. ఖరీఫ్ సీజన్ లో రాష్ట్ర వ్యాప్తంగా 8,548 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, కొనుగోలుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ధాన్యాన్ని నిల్వచేసే గోదాముల సామర్థ్యం 29 లక్షల మెట్రిక్ టన్నుల వరకే పరిమితమైందని, దీనిని కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ప్రభుత్వ,ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో గోదాములను ఆధునికరించే అంశాన్ని ప్రభుత్వం యోచిస్తోందని ఆయన చెప్పారు. ఆధునికీకరణ వల్ల తేమ శాతం నియంత్రణలో ఉంటుందని,తద్వారా నష్టానివారణ చర్యలు తీసుకునే అవకాశాలు ఉంటాయన్నారు.
**విదేశాలకు 'తెలంగాణ బియ్యం'..**
ఎఫ్‌సిఐ,ప్రజాపంపిణీ వ్యవస్థకు సరఫరా చేసిన తర్వాత మిగిలిన తెలంగాణ బియ్యాన్ని అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ మేరకు విదేశాలకు ఎగుమతి చేసేందుకు విధి విధానాలను రూపొందిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి డిమాండ్ ఉన్న ధాన్యాన్ని పండించేలా రైతులను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహకాల ఆవశ్యకత ఉందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ 38,000 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమ చేయడం కుడా ఒక అరుదైన రికార్డ్ అని అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలోని 3.17 కోట్ల మందికి(85 శాతం ప్రజలకు) ఉచితంగా సన్న బియ్యంను పంపిణీ చేస్తున్నామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13,650 కోట్లను ఖర్చు చేస్తుందని వివరించారు.
**బిహార్ వలస కార్మికులపైనే రైస్ మిల్లుల ఆధారం**
బీహార్ వంటి రాష్ట్రాల నుండి వలస వచ్చే కార్మికులపై తెలంగాణ రాష్ట్రంలో రైస్ మిల్లులు ఆధారపడుతున్నాయని,ఇటీవల ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరిగితే వలస కార్మికులు వారి, వారి స్వస్థలాలకు వెళ్లిపోవడంతో కొనుగోళ్ల ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడ్డాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అటువంటి పరిస్థితి తిరిగి ఉత్పన్నం కాకుండా ఉండేందుకు స్థిరమైన కార్మిక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కాగా పెద్దపల్లి జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్‌కు మంత్రి ఉత్తమ్ ప్రశంస పత్రాన్ని అందజేశారు.

## జైలు శిక్ష (మొదటి పేజీ తరువాయి)

కఠిన చర్యలు, కోర్టు విచారణల అనంతరం, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 270 మందిని దోషులుగా నిర్ధారిస్తూ హైదరాబాద్‌లోని న్యాయస్థానాలు తీర్పునిచ్చాయి. దోషులుగా తేలిన వారికి జైలు శిక్ష విధించడంతో వారిని జైలుకు తరలించారు. అంతేకాకుండా, ఈ వ్యక్తులు పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వారు చదువుతున్న విద్యాసంస్థలకు లేఖలు రాస్తూ, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరుగుతోందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని, ఇది ప్రజల భద్రతకు పెను ముప్పు కలిగిస్తుందని హెచ్చరించారు. ఇటువంటి ఉల్లంఘనలను హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం కఠినంగా పరిగణిస్తోందని తెలిపారు. మద్యం సేవించి పట్టుబడిన నిందితులకు ఎటువంటి మినహాయింపు లేకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణాలను రక్షించడం, రోడ్డు క్రమశిక్షణను కాపాడటం కోసం ఈ ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయన్నారు. వాహనదారులందరూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించి, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.



## గిరిజనుల అభివృద్ధికి
# ఇందిరా సౌర గిరిజల వికాసం

### కృతజ్ఞతలు తెలపడానికే వచ్చా
### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు

**ప్రజాపక్షం/జైనూరు/కెరిమేరి :** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం రావాలని ఆనాడు పాదయాత్రలో దీవించిన గిరిజనులకు కృతజ్ఞతలు తెలపడానికే ఇక్కడికి వచ్చానని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గురువారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలం జాంగాం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో గిరిజనులు వివరించిన అటవీ భూముల సాగు సమస్యల పరిష్కారానికి దేశంలో ఎక్కడా లేని విధంగా ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని తీసుకువచ్చామని ప్రకటించారు. ఈ పథకం ద్వారా ప్రభుత్వమే ఉచితంగా బోరు వేయించి, సోలార్ పవర్ ద్వారా విద్యుత్, డ్రిప్పు, పామ్ ఆయిల్ వంటి మొక్కలను అందిస్తుందని వివరించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు వారానికి రెండు రోజులు పొలం బాట ప్రజల బాట నిర్వహిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే 1912 నంబర్‌కు కాల్ చేస్తే 24 గంటల్లోనే సిబ్బంది వచ్చి పరిష్కరిస్తారని పేర్కొన్నారు. పివిటిజి గిరిజనులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్య కోసం యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఉట్నూరు నుంచి ఆసిఫాబాద్ వరకు రహదారి వెడల్పు పనులకు టెండర్లు పిలవబోతున్నామని, అనార్పల్లి వంతెన నిర్మాణాన్ని మంజూరు చేసినట్లు ప్రకటించారు. మహిళా సంఘాలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి దండే విఠల్, ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ బెల్లయ్య నాయక్, జిసిసి చైర్మన్ కోట్నాక తిరుపతి, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్‌పి నితిక పంత్, డిఎఫ్‌ఒ నీరజ్ కుమార్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎఎస్‌పి చిత్తరంజన్, ఎఎంసి చైర్మన్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రం



### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12వ తేదీన చేపట్టనున్న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సు పిలుపునిచ్చింది. దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో "సమ్మె సన్నాహక రాష్ట్ర సదస్సు" హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగింది.

ఈ సదస్సుకు కార్మిక సంఘాల నాయకులు ఎం. నర్సింహా (ఎఐటియుసి), విజయ్‌కుమార్ (ఐఎన్‌టియుసి), రెబ్బారామారావు (హెచ్‌ఎంఎస్), చుక్క రాములు (సిఐటియు), పద్మ (టియుసిఐ), ఎం. శ్రీనివాస్ (ఐఎఫ్‌టియు), శ్రీనివాస్ (బిఆర్‌టియు), భరత్ (ఎఐయుటియుసి) అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మాట్లాడుతూ అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను సంపూర్ణంగా రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టి కార్మికుల హక్కులను కేంద్రం కాలరాస్తోందని విమర్శించారు. బ్రిటీష్ ప్రభుత్వంలో కార్మికులు అనేక ఉద్యమాలు చేసి 1923లోనే ప్రమాద నష్టపరిహార చట్టం సాధించుకున్నారని, ఈ చట్టం ఇప్పటికీ అమలవుతున్న చట్టాలలో ఒక్కటిగా ఉన్నదన్నారు. బిజెపి పాలనలో ప్రజల ఆర్థిక వ్యవస్థ దిగజారుతోందని, నిరుద్యోగం పెరుగుతోందని, సామాన్య ప్రజాస్వామ్య హక్కులపై దాడులు జరుగుతున్నాయని, విద్వేషపూరిత ప్రచారాల నేపథ్యంలో సంఘాలను ఏర్పటుచేసుకునే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. సమ్మె, నిరసనలు తెలియజేసే హక్కును కూడా బిజెపి ప్రభుత్వం అణచివేస్తుందని విమర్శించారు.

ఆదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను కారుచౌకగా అప్పగిస్తున్నారని దుయ్యబట్టారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జనక్‌ప్రసాద్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, టియుసిఐ రాష్ట్ర నాయకులు కె.సూర్యం, ఐఎఫ్‌టియుసి రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, బిఆర్‌టియు రాంబాబు యాదవ్, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు ఎం.కె.బోస్ మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు సామాన్యుల భూములను స్వాధీనం చేసుకునేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున పోరాటం చేశారని, ఫలితంగా కేంద్రం ప్రభుత్వం వెనక్కితగ్గాల్సి వచ్చిందని,రైతులకు ప్రధాని మోదీ క్షమాపణచెప్పాల్సి వచ్చిందని గుర్తుచేశారు. విత్తన, విద్యుత్ సవరణ బిల్లులు, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను మార్చి, గాంధీ పేరును మార్చి వివిజి రాంజి చట్టం 2025 తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# గ్రంథాలయాలు.. ఆధునిక దేవాలయాలు







### మంత్రి జూపల్లికృష్ణారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సమాజ రుగ్మతలను నిర్మూలించే శక్తి పుస్తకాల సొంతమని నేటి ఆధునిక యుగంలో గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, ప్రతి ఇల్లు ఒక గ్రంథాలయంగా మారాలని తెలంగాణ రాష్ట్ర టూరిజం, ఎక్సైజ్ శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం కొల్లాపూర్ పట్టణంలో నూతనంగా సిఎస్‌ఆర్ నిధులతో ఆధునికరించిన ఆధునాతన కంప్యూటర్లు, పుస్తకాలతో ఏర్పాటుచేసి డిజిటల్ గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ దినపత్రికలు చదవడాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని, యువతి, యువకులు గ్రంథాలయంలో జ్ఞానాన్ని పెంచుకునేవిధంగా గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. పోటిపరీక్షల్లో ప్రతిభతో రాణించేలా గ్రంథాలయాల వివిధ పుస్తకాలు, దినపత్రికలను చదవాలన్నారు.

జిల్లా కేంద్రంలో కూడా ఈరకమైన గ్రంథాలయంలేదని, మరిన్ని ఆధునాతన పుస్తకాలు వసతులు కల్పించి ప్రత్యేకంగా గుర్తింపువచ్చేలా గ్రంథాలయాన్ని తీర్చిదిద్దుతామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్‌డిఓ భన్సీలాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం :** మహిళలను కోటీశ్వరులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ ధృడసంకల్పమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్‌శాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ పట్టణంలోని రాజకోట ఆవరణలో నిర్వహించిన సభలో మెప్మాపరిధిలోని 153 స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రభుత్వం మంజూరుచేసిన వడ్డీలేని రుణాలు రూ.47.15లక్షల విలువైన జంబోచెక్‌ను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆత్మగౌరవం, ఆర్థికస్వావలంభన పెంపొందించడమే ప్రజాప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఇందిరమ్మరాజ్యంలో మహిళల సంక్షేమానికి తొలి సంతకంగా మహాలక్ష్మి పథకం అమలుచేసి ఉచితబస్సు ప్రయాణసౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని గుర్తుచేశారు. మహిళాభివృద్ధికి తెలంగాణప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, గ్రామాలు, పట్టణాల్లో మహిళలు దుబారాఖర్చులను తగ్గించుకొని పొదుపు, పెట్టుబడులవైపు దృష్టిసారించాలని సూచించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. మహిళలను ఆర్థికంగా బలోపేతంచేయాలనే ఉద్దేశ్యంతోఅన్నిరకాల సంక్షేమ, అభివృద్ధిపథకాలను మహిళలపేరుపై అమలుచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్‌డిఓ భన్సీలాల్, మెప్మా అధికారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, కవి యాకుబ్, రాష్ట్రసాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యులు పల్లెనర్సింహ్మా పాల్గొన్నారు.

## ఎపి మద్యం స్కామ్ కేసులో ...
# ముగిసిన విజయసాయిరెడ్డి విచారణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎపి మద్యం స్కామ్ కేసులో మాజీ ఎంపి విజయసాయి రెడ్డిని డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) అధికారులు గురువారం విచారించారు. అయితే ఈ విచారణ ఉదయం 10 గంటలకు ప్రారంభమై సాయంత్రానికి ముగిసింది. దీంతో విజయసాయిరెడ్డి ఇడి కార్యాలయం నుంచి వెళ్లిపోయారు. ప్రధానంగా గత ప్రభుత్వం హయాంలో జరిగిన మద్యం విక్రయాలు, మద్యం పాలసీ, నిధుల మళ్లింపు, అవకతవకలు, సూత్రధారులెవరు, లావాదేవీలు ఎలా జరిగాయనే కోణంలోనే ఇడి అధికారులు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ ఇడి కార్యాలయానికి రావాలని అధికారులు ఇచ్చిన నోటీసుల నేపథ్యంలో ఆయన విచారణకు హాజరయ్యారు. ఇడి అడిగిన పలు ప్రశ్నలకు విజయసాయిరెడ్డి సమాధానాలిచ్చినట్లు సమాచారం. దాదాపు 7 గంటల పాటు ప్రశ్నించిన అధికారులు విజయసాయి రెడ్డి స్టేట్మెంట్ రికార్డ్ చేశారు.

## సిఎం రేవంత్ రెడ్డి ఒక గంట ఆలోచిస్తే ...
# బిఆర్ఎస్ నామరూపాల్లేకుండా పోతుంది

### రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక గంట ఆలోచిస్తే బిఆర్‌ఎస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. తెలంగాణ రాష్టంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుందని, సిఎం గురించి నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోమని హెచ్చరించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పటినప్పటీ నుంచి ఇప్పటివరకు ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లలేని దద్దమ్మలు నేడు రేవంత్‌రెడ్డిని విమర్శించడం విడ్డూరంగా ఉందని, రాబోయే మున్సిపల్ ఎలక్షన్లలో రాష్ట్ర ప్రజలు చెంప చెల్లుమనేలా బిఆర్‌ఎస్‌కు గుణపాఠం చెబుతారని అన్నారు. కెటిఆర్, హరీష్‌రావు అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్లు అని, వంద అబద్దాలైన సునాయాసంగ నిజం అనుకునేలా మాట్లాడే సమర్థత వారిద్దరికే ఉందని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఏవైతే ఉన్నాయో, నీళ్లు, నిధులు, నియామకాలు అవి కేవలం కెసిఆర్ ఇంట్లో వాళ్లకే వచ్చాయని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకున్న కల్వకుంట్ల కుటుంబం ఏ రోజైనా తెలంగాణ ప్రజలకు ప్రయోజనాలపై దృష్టి పెట్టారా అని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 10 కిలోమీటర్ల గోతిలో బొంద పెట్టినా వారి బుద్ధి మారడం లేదని, రాష్ట్రానికి రూ.లక్షల కోట్ల పెట్టుబడులు వస్తుంటే, అవి ఓర్వలేకనే దావోస్ పర్యటన గురించి బిఆర్‌ఎస్ పెంచి పోషించే యూట్యూబ్ ఛానల్స్, ట్విట్టర్‌లో అడ్డగోలుగా మాట్లాడుతూ పోస్టులు పెడుతున్నారని మండిపడ్డారు.

## టిటిడి జెఇఒగా నల్గొండ జిల్లావాసి
# డా.శరత్ నియామకం



### పలువురు హర్షం.. అభినందనల వెల్లువ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి నల్గొండ జిల్లా మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొండ్రపోల్ సమీపంలో గల పార్థునాయక్ తండాకు చెందిన రిటైర్డ్ ఐఎఎస్ డాక్టర్ ఎ.శరత్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) విద్య, వైద్యం విభాగాల జాయింట్ ఎగ్జిక్యూటివ్ అధికారి (జెఇఒ)గా నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఈనెల 20న జీవో జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 1 ఏడాది పాటు పదవిలో కొనసాగనున్నారు. తెలంగాణ రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పనిచేస్తూ డాక్టర్ శరత్ జూలై నెలలో రిటైర్ అయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 19 ఆగస్టు 2025న తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి కార్పొరేషన్ (తెలంగాణ రెనువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) చైర్మన్‌గా నియమించారు. తెలంగాణ రాష్ట్రం 2005 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన డాక్టర్ శరత్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు అత్యంత సన్నిహితంగా మెలిగిన అధికారులలో ఒకరుగా పేరుపొందారు. డాక్టర్ శరత్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో (కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రత్యేక అధికారిగా పనిచేశారు. టిటిడి జెఇఒగా డాక్టర్ ఎ.శరత్ నియామకం కావడం పట్ల ఉమ్మడి నల్గొండ జిల్లా గిరిజన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, మాజీ సర్పంచ్, నల్గొండ జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సీతారాం నాయక్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోత్ దశరథ్ నాయక్, మాజీ సర్పంచ్ ఆనంద్ నాయక్, న్యాయవాది శ్రీధర్‌గౌడ్ కే మాత్రు నాయక్, జైత్రం నాయక్, మహేందర్ నాయక్, డాక్టర్ జితేందర్ నాయక్, నాయకులు శశిధర్ నాయక్‌తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలియజేశారు.

# ఆయిల్ పామ్ విస్తీర్ణాన్ని పెంచడమే ప్రభుత్వ ఉద్దేశం

### మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో ఆశించిన స్థాయిలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం లేని ఆయిల్ పామ్ కంపెనీల జోన్లను వెంటనే రద్దు చేసి, ఆసక్తి ఉన్న ఇతర కంపెనీలకు ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. ఆయిల్ పామ్ విస్తీర్ణాన్ని పెంచడమే ప్రభుత్వం ఉద్దేశమని, అందుకు ఎటువంటి కఠిన నిర్ణయాలైన తీసుకుంటామని స్పష్టం చేశారు. టిజి సీడ్స్ ద్వారా నాణ్యత కలిగిన విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు అందుబాటులో తీసుకురావాలని, ఆటోమేటెడ్ డ్రిప్ సిస్టంలను ప్రయోగాత్మకంగా పరిశీలించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సచివాలయంలో టిజి ఆయిల్ ఫెడ్, మార్క్‌ఫెడ్, విత్తనోత్పత్తి సంస్థల అధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆయా సంస్థల పురోగతిపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కేటాయించిన లక్ష్యాలను చేరుకోకపోవడంతో కరీంనగర్, ఆసిఫాబాద్, వరంగల్,హన్మకొండ జిల్లాలలోని ప్రైవేట్ ఆయిల్ పామ్ కంపెనీలకు సంబంధించిన జోన్లను ఇప్పటికే రద్దు చేసి, వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు అప్పగించామని, ఒక వేళ నిర్దిష్ట లక్ష్యాలను చేరుకోవడంలో ఆయిల్ ఫెడ్ సంస్థ కూడా విఫలమైతే ఆ సంస్థకు సంబంధించిన జోన్లను కూడా రద్దు చేస్తామని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ విస్తరణ కోసం అవసరమైన చోట అవుట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగులను నియమించుకోవాలని ఆయిల్ ఫెడ్ ఎండికి సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు అవసరమైన పనిముట్లను వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగం చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపిని ఆదేశించారు. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ అనంతరం వచ్చే వ్యర్థాల నుండి ఉప ఉత్పత్తులను తయారు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు . కల్లూరుగూడం, బీచుపల్లిలోని ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ల పనులను వేగవంతం చేయాలని, ఆయిల్ పామ్ సాగులో దిగుబడి పెంచేందుకు ఆయిల్ పామ్ రైతులకు ట్రైకోడర్మా, గానోడెర్మా నిరోధక బయో ఫర్టిలైజర్లైన వివిఎం, మెగ్నీషియం, సల్ఫర్ మొదలైన వాటిని 50 శాతం సబ్సిడీతో రైతులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర సేవల కోసం కస్టమ్ హైరింగ్ సెంటర్లను పామ్ ఆయిల్ రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయిల్ ఫెడ్ ఎండికి మంత్రి సూచించారు. పామ్ ఆయిల్ పై ప్రస్తుతం ఉన్న దిగుమతి సుంకాన్ని 16.5 శాతం నుండి గతంలో మాదిరిగా 44 శాతానికి పెంచాలని కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, శివరాజ్ సింగ్ చౌహాన్,పియూష్ గోయల్‌తో పాటు ప్రధాన మంత్రి మోదీకి కూడా లేఖ రాసినట్లు మంత్రి వివరించారు.

**'జొన్న, మొక్కజొన్న' ధాన్యానికి వెంటనే టెండర్లను ఆహ్వానించండి:** మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన జొన్న, మొక్కజొన్న ధాన్యానికి వెంటనే టెండర్లను ఆహ్వానించాలన్నారు. ప్రొక్యూర్‌మెంట్, సీడ్ వెరైటీలు, స్టోరేజీల నిర్వహణకు సంబంధించి ఇంకా పాత పద్ధతులనే అవలంభిస్తున్నామని, పెరుగుతున్న సాంకేతికతను దృష్టిలో పెట్టుకుని కొత్త విధానాలను రూపొందించాలని అన్నారు. మార్క్ ఫెడ్ లాంటి సంస్థల ద్వారా కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే ఇంత పెద్ద మొత్తంలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములలో ఎక్కువ కాలం స్టోరేజీ చేయకుండా, పంట పాడవకముందే మంచి రేటు రాగానే అమ్ముకోవాలని సూచించారు. విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా నాణ్యతమైన, అధిక దిగుబడి వచ్చే విత్తనాలను తయారు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని విత్తనాభివృద్ధి సంస్థ ఎండికి సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, విత్తన అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఆయిల్ ఫెడ్ ,విత్తనాభివృద్ధి సంస్థల ఎండి యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## సిసిపై రూ.1 కోటి రివార్డు ప్రకటించిన కేంద్ర హోంమంత్రిత్వ శాఖ

### సమాచారం అందించిన వారికి భారీ బహుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ భద్రతకు ముప్పుగా మారిన సైబర్ క్రైమ్ (సిసి) కేసుల నియంత్రణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఎ) ఏ సైబర్ క్రైమ్ కేసులోనైనా కీలక సమాచారం అందించిన వారికి రూ.1 కోటి వరకు నగదు బహుమతి (రివార్డు) ప్రకటించింది. సైబర్ నేరాలకు పాల్పడుతున్న నిందితుల గుర్తింపు, అరెస్టు, నెట్‌వర్క్‌ల నిర్వీర్యం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే విశ్వసనీయ సమాచారంతో సైబర్ మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు ఈ రివార్డు విధానం దోహదపడుతుందని కేంద్రం అభిప్రాయపడుతోంది. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, సరైన ఆధారాలతో దర్యాప్తుకు సహకరించిన వారికి మాత్రమే రివార్డు వర్తిస్తుందని ఎంహెచ్‌ఎ స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, డేటా చోరీలు, హ్యాకింగ్ ఘటనల నేపథ్యంలో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం కీలకంగా మారింది.

# సైబర్ నేరాలు 17

### నిందితులు, బాధితులది ఒకే లక్ష్యం
### సులువుగా డబ్బు సంపాదించాలని



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సైబర్ నేరగాళ్లు ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 17 రకాల నేరాలకు పాల్పడుతున్నారు. సైబర్ నేరగాళ్ల కొత్త పంథాను పోలీసులు పసిగట్టి చర్యలు తీసుకునే లోపే వాళ్లు మరో ఎత్తుగడతో దోచుకునేందుకు తెర లేపుతున్నారు. ఇప్పటి వరకు వీళ్లు పదిహేడు రకాల నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులకు అందిన ఫిర్యాదుల ఆధారంగా తేలింది. ఒక రకమైన సైబర్ నేరం నుంచి తప్పించుకునేందుకు ప్రజలను చైతన్య పరిచేలోపే మరో కొత్త పంథాతో నిందితులు ముందుకు రావడం పోలీసులకు పెద్ద ప్రాయసగా మారింది. సైబర్ నేరగాళ్లు ఏ కొత్త పద్దతుల్లో ముందుకు వచ్చినా వారి లక్ష్యం మాత్రం బాధితుల బ్యాంక్ నిధులను దండుకోవడమే.నేరాలకు పాల్పడుతున్న వారు, బాధితులు సైతం విద్యావంతులు కావడం గమనార్హం.అయితే ఇక్కడ డబ్బులు సంపాదించే నిందితులు, డబ్బు పోగోట్లుకున్న బాధితుల బలహీనత ఒకే రకంగా ఉంటుంది. తక్కువ సమయంలో, అత్యంత సునాయసంగా డబ్బులు సంపాదించేందుకు నిందితులు తెగిపడుతుండగా అదే పద్దతుల్లో అత్యాశకు లోనై బాధితులు తమ డబ్బులను పోగోట్టుకుంటున్నారు. సైబర్ నేరగాళ్ల పద్దతులు ఇలా ఉన్నాయి.

**హ్యాకింగ్ :** ఒక ప్రభుత్వ కార్యాలయ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి డేటాను మార్చడం లేదా వెబ్‌సైట్‌ను పనిచేయకుండా చేయడం.

**ఫిషింగ్ :** మీ బ్యాంక్ ఖాతా బ్లాక్ అవుతుంది అంటూ లింక్ పంపి, ఆ లింక్‌లో లాగిన్ డీటెయిల్స్ తీసుకుని ఖాతా ఖాళీ చేయడం.

**ఐడెంటిటీ దొంగతనం :** మీ ఆధార్, పాన్ వివరాలతో ఫేక్ సిమ్ తీసుకుని లోన్లకు అప్లై చేయడం.

డేటా బ్రీచ్, డేటా లీక్: హాస్పిటల్ డేటాబేస్ హ్యాక్ చేసి రోగుల మెడికల్ రిపోర్టస్ బయట పెట్టడం.

**మాల్‌వేర్/వైరస్ దాడులు :** ఫ్రీ యాప్ పేరుతో వైరస్ ఉన్న యాప్ పంపి మొబైల్ డేటాను దొంగతనం చేయడం.

**ర్యాన్సమ్‌వేర్ :** కంప్యూటర్‌లోని ఫైళ్లను లాక్ చేసి ₹5 లక్షలు చెల్లిస్తేనే ఫైళ్లు తెరుస్తాం అని డిమాండ చేయడం.

**ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు :** ఫేస్‌బుక్‌లో చౌకగా మొబైల్ విక్రయమని ప్రకటన పెట్టి డబ్బు తీసుకుని సరుకులు పంపకపోవడం.

**క్రెడిట్/డెబిట్ కార్డ్ మోసాలు :** ఒటిపి చెప్పమని ఫోన్ చేసి, కార్డ్ డీటెయిల్స్‌తో అక్రమ లావాదేవీలు చేయడం.

**సోషల్ మీడియా అకౌంట్ హైజాక్ :** వాట్సాప్ అకౌంట్ హ్యాక్ చేసి ఫ్రెండ్స్‌కు డబ్బు అడగడం.

సైబర్ బుల్లీయింగ్ హరాస్మెంట్:ఒక మహిళకు అశ్లీల మెసేజ్‌లు, ఫోటోలు పంపుతూ బెదిరించడం.

**డిజిటల్ అరెస్ట్ స్కామ్ :** మీ పేరు మనీలాండరింగ్ కేసులో ఉంది, వీడియో కాల్‌లో పోలీస్ విచారణ జరుగుతోంది అంటూ కోట్ల రూపాయలు కాజేయడం.

**చైల్డ్ ఎక్స్‌ప్లోటేషన్ -పోర్నోగ్రఫీ:** నాబాలికల ఫోటోలు/వీడియోలను ఆన్‌లైన్‌లో షేర్ చేయడం లేదా అమ్మడం.

**యుపిఐ-క్యూర్ కోడ్ స్కామ్:** రిఫండ పేరుతో క్యూర్ కోడ్ పంపి స్కాన్ చేయించుకుని ఖాతా నుంచి డబ్బు తీసుకోవడం.

**డిడిఒఎస్ దాడులు:** ప్రముఖ ఈకామర్స్ వెబ్‌సైట్‌ను ఓవర్‌లోడ్ చేసి సేవలు నిలిపివేయడం.

**ఫేక్ జాబ్ స్కామ్స్:** ఇంట్లో నుంచే పని అంటూ రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకుని మాయమవ్వడం.

**ఆన్‌లైన్ పెట్టుబడి మోసాలు:** క్రిప్టో,షేర్ మార్కెట్‌లో రోజుకు డబుల్ లాభం అంటూ నమ్మించి డబ్బు కాజేయడం.

**డిప్‌ఫేక్ నేరాలు :**
ఒకరి ముఖాన్ని వీడియోలో మార్పు చేసి అశ్లీల వీడియోలు తయారు చేసి బెదిరించడం.

**ప్రజలకు హెచ్చరిక :** టిజిసిఎస్‌బి శిఖాగోయల్
సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టామని శిఖాగోయల్ తెలిపారు.పోలీస్, సిబిఐ, ఇడి, బ్యాంక్ అధికారులు ఎప్పుడూ వీడియో కాల్‌లో అరెస్ట్ చేయరని ఆమె తెలిపారు.ఒటిపి,పిన్,క్యూర్ కోడ్ ఎవరికీ చెప్పకూడదన్నారు. అనుమానాస్పద లింక్‌లపై క్లిక్ చేయవద్దని హెచ్చరించారు.


**పురపాలక సంఘ కార్యాలయము - దుబ్బాక, జిల్లా :: సిద్దిపేట**

నెం. E1/08/15th FC/2025. — టెండర్ ప్రకటన — తేది: 22.01.2026.

దుబ్బాక పురపాలక సంఘం పరిధిలోని, 1). దుబ్బాక బి. సి. కాలనీ (మారెమ్మ గడ్డ) నుండి మల్లాయిపల్లి వరకు మంచినీటి పైపు లైన్ వేయుట కొరకు రూ: 9.00 లక్షలు, 2). దుబ్బాక పురపాలక సంఘం పరిధిలోని వివిధ వార్డులలో కొతగా ఏర్పడిన కాలనీలలో మంచినీటి పైపు లైన్లు వేయుట కొరకు రూ: 3.00 లక్షలు, 15 వ ఆర్థిక నిధుల నుండి మొత్తం రూ: 12.00 లక్షలు మంజూరీ కాబడినవి. ఇట్టి పనులు నిర్వహించుటకు పనులను చేపట్టుటకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ ఆహ్వానించనైనది.

| | | |
|---|---|---|
| 1. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: | 23.01.2026 11.00 A.M. |
| 2. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ చివరి తేది: | 26.01.2026 4.00 P.M. |
| 3. | బిడ్ వ్యాలిడిటి పీరియడ్ | 90 Days |
| 4. | వివరములకు సంప్రదించు ఫోన్ నెం. | 9390988378, 9391495430, |

పైన తెలిపిన పనులకు టెండర్ ద్వారా ఆహ్వానించనైనది. తదుపరి వివరాలకు ఈ ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ www.eprocurment.telangana.gov.in సంప్రదించగలరు.

సం/- కమీషనర్
పురపాలక సంఘం, దుబ్బాక.

DIPR R.O. No. : 14183-PP/CL/ADVT/1/2025-26, Date: 22-01-2026



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్ నెం.29, మూసారాంబాగ్.
GHMC

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన

Short Tender NIT No.02/EE-29/Moosarambagh/CRZ/GHMC/2025-26 తేది: 21.01.2026

**పని స్వభావం:** వార్షిక పూడికతీత పనులు. **అంచనా మొత్తం:** రూ.87.60 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 23.01.2026న మ.03.00గం.ల నుండి, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది: 27.01.2026న మ.03.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** శ్రీ షేక్ సనాఉద్దీన్, ఇఇ, సర్కిల్-29, మూసారాంబాగ్, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్. ఫోన్ నెం. 7993727669. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. **గమనిక:** టెండర్ నోటీసు తేదీ తర్వాత 1% ఈఎండిని పొందాలి.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-29, మూసారాంబాగ్, చార్మినార్ జోన్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 14188-PP/CL/ADVT/1/2025-26, Date: 22-01-2026



## ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య పత్రికలు వారధి

### ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన తహసీల్దార్

**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తాహశీల్దార్ విజయలక్ష్మి చేతుల మీదుగా ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాన్ని, సంస్కృతిని పరిరక్షించడానికి పత్రికలు తోడ్పడుతున్నాయన్నారు. ప్రజలకి ప్రభుత్వాలకు మధ్య పత్రికలు వారధిగా పని చేయాలన్నారు. ప్రజల గొంతుకగా ప్రజాపక్షం పత్రిక పనిచేసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆమె ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామారావు, ప్రజాపక్షం చింతపల్లి మండల రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ, ఏర్పుల డావలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమ్మిళిత వార్తల సమాహారం 'ప్రజాపక్షం'



**ప్రజాపక్షం/డిండి:** ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజల గొంతుకగా ప్రజాపక్షం తెలుగు జాతీయ దినపత్రిక నిలుస్తుందని సిపిఐ కింది శేషాయికుంట గ్రామ సర్పంచ్ వరికుప్పల స్వప్న అయోధ్య అన్నారు. గురువారం శేషాయికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపక్షం తెలుగు జాతీయ దినపత్రిక 2026నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్పంచ్ స్వప్న అయోధ్య ఆవిష్కరించారు. ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యానికి, విలేకరులకు సర్పంచ్ స్వప్న అయోధ్య నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## నిరంతరం సాధన చేస్తే సాధ్యం కానిది ఏమీ లేదు

### పిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**ప్రజాపక్షం/చండూరు:** విద్యార్థి నిరంతరం సాధన చేస్తూ చదివితే సాధించలేనిది ఏదీ ఉండదని చండూరు ఆర్డీవో శ్రీదేవి ,మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అన్నారు. గురువారం చండూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పిఆర్ఆర్ ఫౌండేషన్ సోషల్ సర్వీస్ చైర్మన్ చల్లం పాండురంగారావు ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాగగిరి రావు ,ఆర్డీవో హాజరై మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేస్తూ కష్టపడి చదవాలని సూచించారు. అనంతరం స్టడీమెటీరియల్‌ను ఆర్డీవో శ్రీదేవి, మాజీ ఎమ్మెల్యే యాదగిరి రావు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. న్యాయవాది బొమ్మరబోయిన వెంకన్న పాడిన ప్రేరణాత్మక గీతాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ శేఖర్ , చండూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కోటేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు

### ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఎల్ఏ బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ :** దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని గురువారం ప్రజా ప్రతినిధులతో కలిసి దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డుల్లో తిరుగుతూ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా డాక్టర్లు, సిబ్బంది చూసుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలను అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈకార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.
దేవరకొండ మండలంలోని ముదిగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పిఎండిఏ, జేజియూఏ నిధుల నుండి మంజూరు అయిన రూ. 2కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ. 80లక్షలతో బోధన సిబ్బంది కోసం ప్రత్యేక గదుల నిర్మాణ పనులకు అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోమౌలిక వస తుల కల్పనలో భాగంగా అదనపు తరగతి గదులను నిర్మిస్తున్నామన్నారు.

## భూసేకరణకు రైతులతో ముఖాముఖీ



**ప్రజాపక్షం/మోతె :** ప్రతి రైతుకు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని రైతులు నష్టపోకుండా చేయడం జరుగుతుందని ఆర్‌డిఓ మాధవరావు అన్నారు. గురువారం మండలంలోని బుర్కచర్ల గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి వారికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని బరోసా ఇచ్చారు. బుర్కచర్ల, రాంపురం తండ, గోల్‌తండ గ్రామాల రైతులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ యం వెంకన్న, డిటి పుష్ప, ఏఇ స్వప్న, ఆర్ఐలు కర్ణాకర్ రెడ్డి, రమేష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బానోతు కవిత పాల్గొన్నారు.

# ప్రత్యేక పర్యాటక కేంద్రంగా సూర్యాపేట

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేటను ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు సుందరీకరణ పనులకు శంఖుస్థాపన చేసి ఆయన మాట్లాడారు. సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రూ. 5 కోట్లతో మినీ ట్యాంక్‌బండ్ బ్యూటిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఆరు మాసాల లోపు ట్యాంక్ బండ్ ఒక ఆకర్షణీయమైన ప్రాంతంగా అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. పర్యాటకులకు ఆనందకరమైన వాతావరణం కల్పించేలా క్యాంటీన్, వాకింక్ ట్రాక్ లైన్, విశ్రాంతి ప్రదేశాలతోపాటు ఇతర మౌళిక సదుపాయాలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. తాను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రత్యేకంగా రూ. కోటి అంచనా వ్యయంతో 80 సీట్ల ఏసి బోటింగ్‌ను మంజూరి చేయించినట్లు తెలిపారు. ఈ బోటింగ్ నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయని నెల లోపు పూర్తిచేసి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులమీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. ఈ బోటింగ్‌ను ప్రధానంగా బర్త్‌డే పార్టీలు, చిన్న చిన్న ఫంక్షన్‌లు చెరువు మధ్యలో నిర్వహించుకునే విధంగా అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. సద్దుల చెరువు పరిసర ప్రాంతంలోని 5 ఎకరాల స్థలంలో రూ.15 కోట్లతో ఇంటర్నేషనల్ లెవెల్ పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిధులు మంజూరి చేసినట్లు తెలిపారు. అవసరమైతే అదనంగా మరో రూ.10కోట్ల వ్యయంతో పార్కును, ట్యాంక్‌బండ్, ఐ లాండ్ పార్క్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రజలు కుటుంబ సమేతంగా సద్దుల చెరువు దగ్గరకు వచ్చి ఆనందంగా గడిపేందుకు ఫ్లయింగ్ జోన్, మిని థియేటర్ వంటి ప్రత్యేక ఆకర్షణలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సూర్యాపేట పర్యాటక అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరి చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు, సిఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, సీనియర్ నాయకులు డాక్టర్ రామ్మూర్తి యాదవ్, మాజీ డిసిసిబి డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, నాయకులు నేరేళ్ళ మధు గౌడ్, మాజీ కౌన్సిలర్లు వెలుగు వెంకన్న, వల్దాసు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గవర్నర్ పర్యటనలో లోటుపాట్లు ఉండొద్దు

### రాష్ట్ర గవర్నర్ రాక సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (మఠంపల్లి) :** రాష్ట్ర గవర్నర్ జిష్టుదేవ్ వర్మ శుక్రవారం సూర్యాపేట జిల్లా, మట్టపల్లి లక్ష్మి నృసింహ స్వామి దర్శనార్థం మట్టపల్లి వస్తున్న సందర్భంగా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె నరసింహతో కలిసి గురువారం పరిశీలించారు. డయాస్, ప్రముఖులు, ఇతరుల సీటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టం, ఎల్ఈడీల ఏర్పాటు, డయాస్ పక్కనే వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు సంబంధించిన శిలాఫలకాల ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్ర గవర్నర్‌కు ఇచ్చే పోలీస్ గౌరవ వందనం, వివిధ శాఖల ద్వారా ఏర్పాటు చేస్తున్న స్టాల్స్, దేవాలయంలో డెకరేషన్ తదితర అన్ని ప్రదేశాలను కలెక్టర్, ఎస్‌పిలు తనిఖీ చేయడమే కాకుండా అధికారులు, సిబ్బందికి తగు సూచనలను జారీ చేశారు. గవర్నర్ రాక సందర్భంగా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, గవర్నర్ మట్టపల్లి వచ్చినప్పటి నుండి తిరిగి వెళ్ళిపోయే వరకు అన్ని సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా రాష్ట్ర గవర్నర్ మట్టపల్లి సందర్శన సందర్భంగా హుజూర్‌నగర్ సమీపంలోని ముగ్దుమ్ నగర్ వద్ద రూ.126 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ విశ్వవిద్యాలయానికి, కోదాడలో రూ.50కోట్ల వ్యయంతో నిర్మించనున్న జవహర్ నవోదయ విద్యాలయ భవనానికి, రూ.1 కోటి వ్యయంతో మట్టపల్లి లక్ష్మి నృసింహ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న డార్మెటరి, కిచెన్ షెడ్, తాగునీటి ట్యాంకుకు, అలాగే మరో కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న యాత్రికా సదన్, పిపిజిఐ షెడ్డు, సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర గవర్నర్ రాక సందర్భంగా దేవాలయ ఆవరణలో వ్యవసాయ, పౌరసరఫరాలు, ఉద్యాన, డిఆర్‌డిఏ, విద్య, నీటిపారుదల, గృహ నిర్మాణ శాఖలు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్‌ను రాష్ట్ర గవర్నర్ సందర్శించనున్నారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అధికారులు, ఆర్‌డిఓలు, పోలీసు అధికారులు ఉన్నారు.

# మిర్యాలగూడ పట్టణాభివృద్ధికి చర్యలు

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణ మెరుగుకై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్పీ క్యాంపు రాజీవ్‌గాంధీ స్టేడియంలో అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణానికి ఒకటే ప్రధాన రోడ్డు కావడం ఆ రోడ్డుపైనే అన్ని రకాల షాపులు ఉండడంతో ట్రాఫిక్ విపరీతంగా పెరిగిందని, ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్ అవసరమన్నారు. ఇందుకు అందరి సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారుడు భద్రంగా చేరుకోవాలన్న ఉద్దేశ్యంతో అరైవ్, అలైవ్ చేపట్టడం అభినందనీయమన్నారు. కోదాడ జడ్చర్ల రహదారి విస్తరణ అనంతరం మేదరవాడ నుంచి ఆర్టీసి బస్టాండ్ వరకు విస్తరణ పనులు పూర్తయితే ట్రాఫిక్ మెరుగు అవుతుందని ప్రజలు సహకరించాలని కోరారు. హెల్మెట్ల పంపిణీ ప్రారంభించామని శివరాత్రి లోపు 20వేల హెల్మెట్లు పంపిణీ చేస్తానన్నారు. మిర్యాలగూడ అభివృద్ధి చూసిన వారికి ఆదర్శమయ్యేలా చేయాలని ఉందని సహకరించాలని కోరారు. రోడ్డు భద్రతపై అన్ని విధాల ప్రజలకు అవగాహన, చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తుండడం అభినందనీయమని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడిపితే శిక్షలు తప్పవని డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. ఎంవీఐ చంద్రశేఖర్, మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్, సీఐలు నాగభూషణరావు, సోమ నర్సయ్య, పీఏన్‌డీ.ప్రసాద్, లారీ అసోసియేషన్ బాధ్యులు మల్లారెడ్డిలు పాల్గొన్నారు.



## నమ్మిన భక్తుల కోర్కెలు తీర్చేది జాన్‌పహాడ్ దర్గా ఉర్సు

**ప్రజాపక్షం/పాలకవీడు:** నమ్మిన భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా మత సామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తూ దినదినాభివృద్ధి చెందుతూ నేరేడుచర్ల మండలానికి 20 కిలో మీటర్లు, పాలకవీడు మండల కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరాన ఉన్న జాన్‌పహాడ్ దర్గా ఉమ్మడి జిల్లాలోనే గాక, రెండు ఉభయ తెలుగు రాష్ట్రాలకు పేరున్న దర్గాగా ప్రసిద్ధి చెందింది. ఈనెల 22,23,24 తేదీలలో ఉర్సు ఉత్సావాలు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఘనంగా జరగనున్నాయి. పక్క రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో ఉర్సు ఉత్సవాలకు తరలివస్తుంటారు. ఈ దర్గా ముస్లింలకు పవిత్ర స్థలమైనప్పటికీ హిందువులే అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు. భక్తులు తమ కోర్కెలు తీరితే కందూరు పేరిట మొక్కులు చెల్లించుకుంటారు. సంతానం లేని వారు సంతానం కలిగితే సైదులు బాబా పేరును పుట్టిన బిడ్డలకు నామకరణం చేస్తుంటారు. ఈ సంవత్సరం ఉత్సవాలకు భారీగా లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. జాన్‌పహాడ్ సైదన్నను దర్శించుకునేందుకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ ఉర్సు ఉత్సవాలు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు.

### ఉర్సు ఉత్సవానికి పటిష్ట భద్రత

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. గురువారం మండలంలోని జాన్‌పహాడ్ ఉర్సు ఉత్సవం జరిగే ప్రాంతాన్ని పరిశీలించి, దర్గాను సందర్శించి ప్రార్ధనలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు సోదరభావంతో కలిసిమెలసి ఉత్సవం నిర్వహించుకోవాలని కోరారు. దర్గా, వాహనాల పార్కింగ్ స్థలాలు, ఉత్సవం ప్రాంతంలోకి వచ్చిపోయే మార్గాలను పరిశీలించారు. ఉత్సవం ప్రాంతంలో 65 సిసి కెమెరాలతోఓ ఉత్సవ పర్యవేక్షణ చేయడం జరుగుతుందని అన్నారు. బందోబస్తు పర్యవేక్షణకు అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. అదనపు ఎస్‌పి రవీందర్‌రెడ్డి, డిఎస్‌పి శ్రీసివాసరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చరమందరాజు, మునగాల సిఐ రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

## హరీష్ రావువి 'కాకమ్మ కథలు'.. నిజాలు నిప్పులాంటివి

### ఎంపి చామల కిరణ్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి :** తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు విమర్శలకు భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నందుకే నోటీసులు ఇస్తున్నారన్న హరీష్ రావు వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన దావోస్ నుంచి మీడియాతో మాట్లాడారు. నైనీ బొగ్గు బ్లాకు టెండర్ల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇప్పటికే పూర్తి స్పష్టత ఇచ్చారని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకల వల్లే అప్పట్లో టెండర్లు రద్దు అయ్యాయన్న నిజాన్ని కిషన్ రెడ్డి బయటపెట్టారని గుర్తు చేశారు. సైట్ విజిటింగ్ ప్రక్రియ అనేది టెండర్లలో ఒక సాధారణ భాగమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని, నైనీ బొగ్గు బ్లాకు కోసం 17 మంది దరఖాస్తు చేసుకున్నారని కిరణ్ రెడ్డి తెలిపారు. ఈ ప్రక్రియ ఇంకా పూర్తి కాకముందే, సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ ఎవరికీ ఇవ్వకముందే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన బంధువులకు కట్టబెడుతున్నారంటూ బీఆర్ఎస్ అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ విచారణ జరుగుతుండటంతో ఆ విచారణను తప్పుదోవ పట్టించడానికే కేటీఆర్, హరీష్ రావు నైనీ బ్లాక్ అంశాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో స్వయానా కేసీఆర్ అల్లుడి ఫోన్నే ట్యాప్ చేసిన చరిత్ర వారిదని, తమకు ఎదురులేదని బావాబామ్మర్దులు విర్రవీగితే ప్రజలు ఎన్నికల్లో షాక్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి దోచుకున్నందునే ప్రజలు వారిని ఇంటికి పరిమితం చేశారని, ఇప్పటికీ వారు అబద్ధాలతో అధికారంలోకి రావాలని కలలు కంటున్నారని విమర్శించారు. హరీష్ రావు ఇప్పటికైనా బూటకపు మాటలు మానుకుని నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని, ఫోన్ ట్యాపింగ్ విచారణకు సహకరించాలని చామల కిరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.

## మునిసిపల్ ఎన్నికలపై ఎంపి, ఎమ్మెల్యే సమీక్ష



**ప్రజాపక్షం/హాలియా:** రానున్న మునిసిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికార కాంగ్రెస్ పార్టీ హాలియా, నందికొండ మునిసిపాలిటీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం రాత్రి హాలియా మునిసిపాలిటి ముఖ్య నాయకులతో నల్గొండ ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డి, సాగర్ ఎంఎల్‌ఏ కుందూరు జైవీర్‌రెడ్డిలు సమావేశాన్ని నిర్వహించి ముఖ్య నాయకులతో ముఖాముఖి నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అధికార పార్టీ కావడంతో ఆశావాహుల సంఖ్య భారీగా ఉండడం ప్రతి ఒక్క కార్యకర్త టికెట్ ఆశించడం కొంత ఇబ్బందికర పరిస్థితే ఎదురువుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి భీఫామ్ వస్తుందని ఎవరైనా రెబల్‌కు ప్రయత్నిస్తే పార్టీ నుండి ఉద్వాసన తప్పదనే హెచ్చరికలు కూడా వస్తున్నట్లు తెలుస్తుంది. హాలియా మునిసిపాలిటీ చైర్‌పర్సన్ జనరల్ కావడంతో ఆశావాహుల సంఖ్య పెరుగుతుంది. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ఎంపి రఘువీర్‌రెడ్డి, ఎంఎల్‌ఏ జైవీర్‌రెడ్డిలు పార్టీని ఒకే తాటిపైకి తెచ్చి అందరిని కలుపుకొని పోయే వ్యక్తులను అభ్యర్థులుగా ప్రకటించేందుకు చర్చలు జరుగుతున్నట్లు పార్టీ ముఖ్యనాయకులు చెబుతున్నారు. సాగర్ నియోజకవర్గంలో ఉన్న రెండు మునిసిపాలిటిను కైవసం చేసుకునేందుకు ఎంపి, ఎంఎల్‌ఏ కసరత్తు చేస్తున్నారు. హాలియా, నందికొండ మునిసిపాలిటిలో ఉన్న ముఖ్య నాయకులతో ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు.

## 'ప్రజాపక్షం' ఎప్పుడూ ప్రజల వైపే

**ప్రజాపక్షం/హాలియా :** పత్రిక ఎప్పుడు ప్రజల పక్షంగానే వ్యవహరించి వారికి మంచి జరిగేలా చూడాలని నల్లగొండ ఎంపి కుందూరు రఘువీర్ రెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి లు అన్నారు. గురువారం సాగర్ క్యాంప్ కార్యాలయంలో ప్రజాపక్షం దినపత్రిక క్యాలెండర్ ఎంపి, ఎమ్మెల్యే కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక ఎప్పుడు ప్రజల వైపే వ్యవహరించి మంచి కథనాలు రాస్తూ ప్రజలకు మేలు జరిగేలా చూస్తున్నారని చెప్పారు. సమాజంలో జర్నలిజం ఎప్పుడు ప్రజల పక్షమే ఉండాలని వారి కష్టసుఖాలను ఎప్పటికప్పుడు అధికారంలో ఉన్న పార్టీలకు తెలియపరుస్తూ ఇరువురికి వారధి లాగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చాపల శ్రీనివాస్, చిత్రం ప్రసాద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# ముందే లీక్... అంతా షాక్!

### మున్సిపల్ చైర్మన్ రేసులో కొప్పుల... ఆశావహుల ఆశలపై నీళ్ళు...

**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట మేజర్ మున్సిపాలిటీ చైర్మన్ పీఠంపై అధికార పార్టీ గురిపెట్టింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత రెండు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో గులాబీ పార్టీ తమ జెండా ఎగరవేసింది. ఈ ఎన్నికల్లో అత్యధికంగా వార్డులు కైవసం చేసుకొని చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవాలని మాజీ మంత్రి, స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ముందు నుండే పావులు కదుపుతున్నారు. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ వ్యూహాలను అంచనా వేస్తూ గెలుపు గుర్రాలను ఎన్నికల బరిలోకి దింపాలని కసరత్తు చేస్తున్నారు. దీంతో ఆ పార్టీలో చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. అన్ని రాజకీయ పార్టీల కన్నా కాంగ్రెస్‌లో నాయకులకు స్వేచ్ఛ ఎక్కువగా ఉండడంతో మేమేంటే మేమే మున్సిపల్ చైర్మన్‌లమంటూ తమ సన్నిహితులతో చెప్పుకుంటూ వస్తున్నారు. తాజాగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి చైర్మన్ పీఠాన్ని తాను ఆశిస్తున్నట్లు ఎన్నికల్లో 10వ వార్డు నుండి పోటీ చేయనున్నట్లు ముందే లీక్ ఇవ్వడంతో అంతా షాక్ అవుతున్నారు.

**ఆశావహుల ఆశలపై నీళ్ళు...**

మాజీ మంత్రి, స్వర్గీయ రాంరెడ్డి దామోదర్ రెడ్డికి ప్రధాన అనుచరుడు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఆశిస్తూ ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు ముందే లీక్ ఇవ్వడంతో ఆ పార్టీ నుండి ఆ పదవిని ఆశిస్తున్న మిగతా ఆశావహుల ఆశలు ఒక్కసారిగా నీరుగారాయి. సూర్యాపేట నియోజకవర్గంలో ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తరువాత కొప్పుల వేణారెడ్డి పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్నారు. అతన్ని కాదని పార్టీలో చైర్మన్ స్థానానికి పోటీపడేందుకు ఎవరూ కూడా సహసించే వారు ఎవరూ లేరన్నది అక్షర సత్యం. దీంతో గత కొంత కాలంగా చైర్మన్ స్థానం తమదంటే తమదేనని చెప్పుకున్న ఆశావహులు ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు.




**రాజకీయ వ్యూహంలో భాగంగానే...**

రాజకీయ వ్యూహంలో భాగంగానే మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఆశిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా ఆయన కొనసాగుతున్న పదవి కాలం కేవలం 14 మాసాలు మాత్రమే ఉంది. మున్సిపల్ చైర్మన్ స్థానం దక్కించుకుంటే 5 సంవత్సరాలు పదవీలో కొనసాగే అవకాశం ఉండడంతో దీనిపై కన్నేసినట్లు స్పష్టమవుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కూడా మరో మూడు సంవత్సరాల్లో ముగియనుంది. పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా తన పదవికి దోకా ఉండదని, తాను చైర్మన్‌గా పదవిని చేపడితే రానున్న జనరల్ ఎలక్షన్‌లో కూడా పార్టీకి మేలు జరుగుతుందని ఊహించే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ సాగుతుంది.

**సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అధికార కాంగ్రెస్ కైవసం చేసుకునేం దుకు పావులు కదుపుతుంది. ఎన్నికలకు ముందే చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారి సంఖ్య కూడా ఘననీయంగానే ఉంది. చైర్మన్ రేసులో మేమంటే మేమే ఉన్నామంటూ తమ సన్నిహితుల వద్ద నేతలు చెప్పుకుంటున్నారు. ఇదిలా ఉండగా తాజాగా మాజీ మంత్రి, దివంగత రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుడి భుజంగా ఉన్న సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తాను కూడా రేసులో ఉన్నానని లీక్ ఇవ్వడంతో అంతా షాక్ అవుతున్నారు. గత కొంత కాలంగా చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న ఆశావహుల ఆశలు ఒక్కసారిగా నీరుగారాయి.**

## అదుపుతప్పి లోయలో పడిన ఆర్మీ వాహనం

# పది మంది సైనికులు మృతి



### మరో ఏడుగురు జవాన్లకు గాయాలు

**భదేర్వా/జమ్ము:** జమ్ముకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆర్మీ ట్రక్కు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న లోయలో పడిపోయింది. ఈ ఘటనలో 10 మంది సైనికులు మృతి చెందారు. మరో ఏడుగురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో వాహనంలో 17 మంది సైనికులు ఉన్నారు. భదేర్వా–చంబా అంతర్రాష్ట్ర రహదారిలోని 9000 అడుగుల ఎత్తయిన ఖన్నీ టాప్ వద్ద గురువారం మధ్యాహ్నం సమయంలో ఈ ప్రమాదం జరిగింది. బుల్లెట్ ప్రూఫ్ ఆర్మీ వాహనం అధిక ఎత్తులో ఉన్న పోస్ట్ వైపు వెళ్తుండగా వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో ఆర్మీ వాహనం అదుపుతప్పి 200 అడుగుల లోతు గల లోయలోకి పడిపోయింది. ఘటనాస్థలిలోని నలుగురు సైనికులు చనిపోయారు. సైన్యం, పోలీసులు సంయుక్తంగా చేపట్టిన సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన 11 మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఆర్మీ వాహనం ఎత్తయిన ప్రదేశం నుంచి లోయలో పడడంతో తీవ్రంగా నుజ్జునుజ్జు అయింది. ఆ తరువాత క్షతగాత్రుల్లో మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన సైనికులను ప్రత్యేక చికిత్స కోసం ఉధంపూర్ కమాండ్ ఆసుపత్రికి హెలికాప్టర్ ద్వారా తరలించారు. 'సైనిక వాహనానికి దురదృష్టవశాత్తూ జరిగిన ప్రమాదంలో మేము 10 మంది సైనికులను కోల్పోయాము. మరో ఏడుగురు మంది గాయపడ్డారు' అని భదేర్వా అదనపు డిప్యూటీ కమిషనర్ సుమిత్ కుమార్ భూత్యాల్ పిటిఐకి తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా , ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన సైనికుల కుటుంబాలకు ముఖ్యమంత్రి హృదయపూర్వక సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## 'నేడు' వివాదాస్పద భోజ్‌శాల-కమల్ మౌలా మసీదు వద్ద ...

# హిందువులు, ముస్లిముల ప్రార్థనలకు 'సుప్రీం'ఓకె

### ముస్లిముల కోసం ఒక ప్రత్యేక స్థలాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశం

### శాంతిభద్రతల నిర్వహణ కోసం సహకరించాలని ఇరుపక్షాలకూ విజ్ఞప్తి



**న్యూఢిల్లీ :** మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాలోని వివాదాస్పద భోజ్‌శాలకమల్ మౌలా మసీదులో శుక్రవారం వసంత పంచమి సందర్భంగా ప్రార్థనలు చేసుకోవడానికి హిందువులు, ముస్లిములకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. హిందువులకు సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు, ముస్లిములకు మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం 3 గంటల వరకు నమాజ్ చేసుకునేందుకు అనుమతినిచ్చింది. గురువారంనాడు సుప్రీంకోర్టు ముస్లిం సమాజం నుండి నమాజ్ కోసం వచ్చే వ్యక్తుల జాబితాను జిల్లా పరిపాలనా యంత్రాంగానికి అందజేయాలని ఆదేశించింది. జనవరి 23న భోజ్‌శాల కాంప్లెక్స్‌లో మతపరమైన కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు హిందూ, ముస్లిం సంఘాలు అనుమతి కోరాయి. శుక్రవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతీ పూజ కూడా జరగనున్నది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలితో కూడిన త్రిసభ్య ధర్మాసనం మాట్లాడుతూ 'పరస్పర గౌరవాన్ని పాటించడానికి, శాంతిభద్రతల నిర్వహణ కోసం రాష్ట్ర, జిల్లా పరిపాలనా యంత్రాగానికి సహకరించాలని ఇరుపక్షాలకు విజ్ఞప్తి చేసింది. శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి మూడు గంటల మధ్య ముస్లిం సమాజానికి చెందిన ఎందరు వ్యక్తులు నమాజ్ కోసం వస్తారో తెలుసుకున్న తర్వాత అదే కాంపౌండ్ /ఆవరణలో ఒక ప్రత్యేక స్థలం అందుబాటులో ఉంచాలని, తద్వారా నిర్ణీత సమయంలో నమాజ్ నిర్వహించవచ్చని ఎఎస్‌జి, అడ్వకేట్ జనరల్ ఒక సముచితమైన సూచన చేశారు. అదేవిధంగా గత ఆచారం ప్రకారం వసంత పంచమి పండుగను పురస్కరించుకుని సాంప్రదాయ వేడుకను నిర్వహించడానికి హిందూ సమాజానికి ప్రత్యేకమైన స్థలం అందుబాటులో ఉంచబడుతుంది' అని సిజెఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. ఆ స్థలంలో ప్రార్థనలు నిర్వహించడానికి చట్టంచేసి, ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. జిల్లా యంత్రాంగం శాంతిభద్రతల పరిరక్షణ కోసం సందర్శకులకు ఉచితంగా తగిన పాసులు జరీ చేయవచ్చు...లేదా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఆచారాలు శాంతియుతంగా నిర్వహించబడతాయని నిర్ధారించుకోవడానికి ఏవైనా ఇతర న్యాయపరమైన చర్యలు తీసుకోవచ్చని ధర్మాసనం తెలియజేసింది. 11వ శతాబ్దపు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఎఎస్ఐ) రక్షిత స్మారక చిహ్నం అయిన భోజ్‌శాలను హిందువులు వాగ్దేవి (సరస్వతీ దేవత)కు అంకితం చేయబడిన ఆలయంగా భావిస్తారు. అయితే ముస్లిం సమాజం దీనిని కమల్ మౌలా మసీదు అని పిలుస్తుంది. 2003 ఏప్రిల్ 7న ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఏర్పాటు ప్రకారం హిందువులు మంగళవారం భోజ్‌శాల ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం ముస్లిములు కాంప్లెక్స్‌లో నమాజ్ చేస్తారు. వసంత పంచమి నాడు హిందువులు ప్రార్థనలు చేయడానికి ప్రత్యేక హక్కులను కోరుతూ 'హిందూ ఫ్రంట్ ఫర్ జస్టిస్' దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. న్యాయవాది విష్ణు శంకర్ జైన్ ద్వారా దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం అత్యవసర విచారణ కోసం ప్రస్తావించడం జరిగింది. ఆర్కియలాజికల్ సర్వేఫ్ ఇండియా 2003 ఉత్తర్వు శుక్రవారం ప్రార్థనలతో వసంత పంచమి నాడు కలిసి వచ్చే పరిస్థితిని ప్రస్తావించలేదని, వసంత పంచమి రోజు మొత్తం హిందువులకు ప్రత్యేకమైన, నిరంతరాయమైన ఆరాధన హక్కులను కోరిందని జైన్ అన్నారు. విచారణ సందర్భంగా జైన్ తన వాదనలు వినిపిస్తూ సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకూ పూజలు, హవనాలు ఉంటాయని ధర్మాసనానికి తెలియజేశారు. రోజంతా పూజకు అనుమతిని కోరారు. మసీదు కమిటీ తరఫున సీనియర్ అడ్వకేట్ సల్మాన్ ఖుర్షీద్ తన వాదనలు వినిపిస్తూ శుక్రవారం నమాజ్ మధ్యాహ్నం ఒంటిగంట నుండి 3 గంటల మధ్య జరుగుతుందని, ఆ తర్వాత ఆ ప్రాంగణాన్ని ఖాళీ చేయవచ్చని చెప్పారు. ఈ ప్రతిపాదనను అంగీకరిస్తూ ఖుర్షీద్ ముస్లిం కమిటీకి సంబంధించి నమాజ్ కోసం వచ్చే వ్యక్తులు ఎంత మంది హాజరుకానున్నారనే సంఖ్యను జిల్లా మెజిస్ట్రేట్‌కు అందజేస్తామని తెలిపారు. కేంద్రం, ఎఎస్ఐ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ జిల్లా అధికారయంత్రాంగం శాంతిభద్రతల పరిరక్షణ గురించి తప్పక జాగ్రత్త చర్యలు చేపడుతుందని చెప్పారు. 2024 మార్చి 11నాటి మధ్యప్రదేశ్ హైకోర్టు 'శాస్త్రీయ సర్వేపై' ఇచ్చిన ఆదేశాలను సవాల్‌చేస్తూ మౌలానా కమాలుద్దీన్ సంక్షేమ సమాజం దాఖలు చేసిన అప్పీల్‌ను కూడా అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ విషయాన్ని హైకోర్టులోని అత్యంత సీనియర్ న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ విచారించాలని సుప్రీంకోర్టు హైకోర్టుకు సూచించింది. ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రీయ సర్వేను పూర్తి చేసి తన నివేదికను ఒక సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు అందజేసిందని గమనించిన సుప్రీంకోర్టు ఆ నివేదికను సీల్‌చేసి, దానిపై అభ్యంతరాలు దాఖలు చేయగల పార్టీలకు అందించాలని హైకోర్టును ఆదేశించింది.

## ఎర్రకోటపై దాడి కేసులో ఎల్ఇటి ఉగ్రవాది ఆరిఫ్ పిటిషన్‌పై...

# ఢిల్లీ ప్రభుత్వానికి 'సుప్రీం' నోటీసు

### మరణశిక్షను సవాల్‌చేస్తూ ఆరిఫ్ దాఖలుచేసిన క్యూరేటివ్ పిటిషన్ విచారణకు 'అపెక్స్ కోర్టు' అంగీకారం

### 2000 సంవత్సరంలో జరిగిన ఈ దాడిలో ముగ్గురు ఆర్మీ జవాన్లు మృతి

**న్యూఢిల్లీ:** ఎర్రకోటపై 2000 సంవత్సరంలో జరిగిన దాడి కేసులో ముగ్గురు ఆర్మీ జవాన్ల మృతికి కారణమైన లష్కర్‌ఏతోయిబా (ఎల్ఇటి) ఉగ్రవాది మొహమ్మద్ ఆరిఫ్‌కు విధించిన మరణశిక్షకు వ్యతిరేకంగా దాఖలు చేసిన క్యూరేటివ్ (నివారణ) పిటిషన్‌ను విచారించడానికి గురువారం సుప్రీం కోర్టు అంగీకరించింది.ఈ కేసులో ఆరిఫ్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను 2022 నవంబరు 3న సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆరిఫ్ అలియాస్ అష్ఫాక్‌కు ట్రయల్ కోర్టు 2005 అక్టోబరులో మరణశిక్ష విధించింది. ఢిల్లీ హైకోర్టు 2007 సెప్టెంబరులో ట్రయల్ కోర్టు అభిప్రాయాన్ని సమర్థించింది. అనంతరం అతను హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. 2011 ఆగస్టులో సుప్రీంకోర్టు ఆరిఫ్‌కు విధించిన మరణశిక్షను ధృవీకరించింది. గురువారం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ జె.కె.మహేశ్వరిలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం మరణశిక్షను సమర్థించిన తర్వాత అప్పీల్, రివ్యూ పిటిషన్‌ను కొట్టివేసిన అనంతరం సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరించిన న్యాయవాది సమర్పణలను ప్రధాన నాయమూర్తి గమనించారు. 'నోటీసు జారీచేయండి' అని సిజెఐ సూర్యకాంత్ చెప్పారు. ఈ తీర్పును సవాల్ చేయడానికి ఒక వ్యక్తికి ఉన్న చివరి చట్టపరమైన మార్గం క్యూరేటివ్ పిటిషన్ అని తాజాగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ తీర్పును సుప్రీంకోర్టు రెండు సార్లు సమర్థించింది.



ఈ అప్పీల్, రివ్యూ పిటిషన్లను కొట్టివేసింది. ప్రాసిక్యూషన్ ప్రకారం 2000 సంవత్సరం డిసెంబరు రాత్రి కొందరు చొరబాటుదారులు ఎర్రకోట లోపల భారత సైన్యం యొక్క 7 రాజ్‌పుతన రైఫిల్స్ యూనిట్ ఉన్న ప్రాంతంలోకి చొరబడి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ముగ్గురు ఆర్మీ జవాన్లు మృతిచెందారు.

# విజయ్, కమల్ పార్టీలకు గుర్తుల కేటాయింపు

**చెన్నై :** తమిళగ వెట్రి కజగం (టివికె) అధినేత, దళపతి విజయ్, మక్కల్ నీది మయ్యం అధినేత కమల్ హాసన్ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా గుర్తులను కేటాయించింది. విజయ్ పార్టీకి 'విజిల్' గుర్తును కేటాయించగా, కమల్ హాసన్ పార్టీకి 'బ్యాటరీ టార్చ్' గుర్తును ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఇద్దరు అగ్ర కథానాయకులు ఇప్పుడు రాజకీయ వేదికపై తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు గురువారం తమిళనాడు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రిజిస్టర్డ్ గుర్తింపు లేని రాజకీయ పార్టీల జాబితా కింద ఈ గుర్తులను కేటాయించారు. ఎలక్షన్ సింబల్స్ ఆర్డర్, 1968లోని పారా 10బి నిబంధనల ప్రకారం ఈ పార్టీలకు ఇసి గుర్తులను కేటాయించింది. రాబోయే తమిళనాడు, బంగాల్, కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో (2025–26) ఈ పార్టీలు ఈ గుర్తులపై పోటీ చేస్తాయి. తమ అభ్యర్థులకు కామన్ సింబల్ కేటాయించాలన్న పార్టీల విజ్ఞప్తిని ఈసీ ఆమోదించింది. కాగా, ఉత్సాహవంతులైన పార్టీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా దానిని ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించారని టివికె సీనియర్ నాయకుడు సిటి ఆర్ నిర్మల్ కుమార్ గురువారం తెలిపారు. పది గుర్తుల జాబితాలో విజయ్ ప్రాధాన్యతగా కోరుకున్న గుర్తు విజిల్ అని తమిళగ వెట్రి కజగం సంయుక్త ప్రధాన కార్యదర్శి కుమార్ అన్నారు. యాదృచ్ఛికంగా, నటుడు విజయ్ అగ్రశ్రేణి హిట్ పాటలలో ఒకటి అతని 2024 చిత్రం 'గోట్' నుండి వచ్చిన 'విజిల్ పోడు' (విజిల్ వేయు),



ఇందులో అతని అప్పటి ప్రణాళికలో ఉన్న రాజకీయ ప్రవేశానికి సంబంధించిన కొన్ని ప్రస్తావనలు ఉన్నాయి. అతను 'బిగిల్' అనే చిత్రంలో నటించాడు. దీనికి కూడా విజిల్ అనే అర్థం ఉంది. 'తమిళనాడు ప్రజల మొత్తం ఆకాంక్ష, కోరిక ఏమిటంటే... మా నాయకుడు ముఖ్యమంత్రి కావాలి. మొదటి అడుగుగా తాము కోరుకున్న గుర్తు వచ్చింది' అని కుమార్ చెన్నైలో జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. పార్టీని ప్రారంభించిన రెండేళ్ల తర్వాత, 2026 అసెంబ్లీ ఎన్నికలు 50 ఏళ్ల విజయ్ నేతృత్వంలోని టివికె పార్టీకి మొదటి ఎన్నికల పోరాటం అవుతుందని కుమార్ అన్నారు. పార్టీ భారీ విజయం సాధించి విజయ్ ముఖ్యమంత్రి అవుతారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, అంతకుముందు విజయ్‌తో సమావేశమయ్యారని వార్తలు వచ్చిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్ చక్రవర్తి, రాష్ట్రంలో 2026 ఎన్నికల విజిల్ మోగిందని అన్నారు.

# దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె




### యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ వెల్లడి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వరంగ బ్యాంకులలో ఐదు రోజుల పని విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న దేశవ్యాప్త బ్యాంకుల సమ్మె చేయనున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ప్రకటించింది. హైదరాబాద్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో యుఎఫ్‌బియు నేతలు బి.ఎస్.రాంబాబు (ఎఐబిఈఎ), తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కె.ఆంజనేయ ప్రసాద్ మాట్లాడారు. ప్రభుత్వం 2015లో ప్రతి నెల 2వ, 4వ శనివారాలు సెలవు దినాలు ప్రకటించిందని, తర్వాత, 2023లో శుక్రవారం వరకు పని సమయాన్ని 40 నిమిషాలు పెంచి, మిగిలిన శనివారాలను సెలవుగా ప్రకటించాలని అంగీకరించి, ప్రభుత్వానికి సిఫార్సు కూడా చేశారని, అయినప్పటికీ రెండేళ్లుగా ప్రభుత్వ ఆమోదం పెండింగ్‌లో ఉన్నదని వారు తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గత ఏడాది ఉద్యోగులు సమ్మెకు పిలుపునివ్వడంతో ప్రభుత్వం తమ హామీలను పరిశీలిస్తుందని ఇచ్చిన హామీ మేరకు సమ్మెను వాయిదా వేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, పని సమయాన్ని పెంచి మిగిలిన శనివారాలను సెలవుగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. బ్యాంకింగ్ రంగంలో 98 శాతం కంటే ఎక్కువ బ్యాంకింగ్ లావాదేవీలు డిజిటల్ ద్వారానే జరుగుతున్నందున ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందిఉండబోదని స్పష్టం చేశారు. సమావేశంలో బ్యాంకు యూనియన్ల నేతలు శాండిల్య (ఎన్‌సిబిఇ), ఫణికుమార్ (ఎఐబిఒఎ), సతీశ్ (బిఇఎఫ్ఐ), అర్జున్ (ఐఎన్‌బిఒసి), సతీశ్‌రెడ్డి, రాజేశ్‌కుమార్, నాగార్జున పాల్గొన్నారు.

## సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో

# కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్ కుమార్ నిర్దోషి

### ఢిల్లీ కోర్టు తీర్పు



**న్యూఢిల్లీ:** సిక్కులకు వ్యతిరేకంగా 1984లో జరిగిన హింసాత్మక అల్లర్లలో నిందితుడుగా ఉన్న కాంగ్రెస్‌పార్టీ మాజీ ఎంపి సజ్జన్ కుమార్ నిర్దోషిగా బయటపడ్డారు. నేరం జరిగిన సమయంలో ఘటనాస్థలంలో ఆయన భౌతికంగా ఉన్నారనడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని న్యూఢిల్లీ కోర్టు తేల్చిచెప్పింది. న్యూఢిల్లీలోని జానక్‌పురి ప్రాంతంలో హింసకు పురిగొల్పారన్న ఆరోపణలపై సజ్జన్ కుమార్ నిందితుడుగా ఉన్నారు. ఈ అల్లర్ల సమయంలో బాధితులు, వారి కుటుంబాలు ఎంత మనోవేదన, బాధ అనుభవించి ఉంటారో న్యాయస్థానం అర్థం చేసుకుందని, కానీ ఆయనను నిర్దోషిగా విడుదల చేస్తూ తీసుకున్న కోర్టు నిర్ణయానికి భావోద్వేగాలతో సంబంధం లేదని ప్రత్యేక న్యాయమూర్తి డిగ్ వియన్ సింగ్ 60 పేజీల తన తీర్పులో పేర్కొన్నారు. కేసులో చాలా మంది సాక్ష్యులను విచారణ చేశామని, కానీ గడచిన 30 సంవత్సరాలుగా సాక్ష్యులు ఎవ్వరూ నిందితుడి పేరు చెప్పడంలో విఫలమయ్యారని, ప్రస్తుత విషయంలో ఈ సాక్ష్యాలను ఆధారం చేసుకుని మాత్రమే నిందితుణ్ణి నిర్దోషిగా ప్రకటించామని న్యాయమూర్తి తెలియజేశారు. హింసాత్మక అల్లర్లు సంభవించిన సమయంలో కుమార్ ఆ ప్రదేశంలో ఉన్నారనడానికి ఎలాంటి ఆధారాలూ లభించలేదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. నిందితుణ్ణి సాక్ష్యులు గుర్తించడం,ఆనవాలు పట్టడంపై ఆధారపడటం చాలా సంశయాత్మకం, అపాయకరం కాగలదని, చివరకు అధిక్షేపణకు గురవుతుందని పేర్కొన్నారు.

# ముంబయి మేయర్ పదవి మహిళకే..

**న్యూఢిల్లీ:** ముంబై: ముంబైకి మహిళా మేయర్ రానున్నారు. మహారాష్ట్రలోని 29 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పోస్టును ఏ కేటగిరీకి కేటాయించాలనే దానిపై లాటరీ ప్రక్రియను పట్టణాభివృద్ధి శాఖ గురువారం నాడు నిర్వహించింది. ఫలితాల్లో బృహన్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బిఎంసి) మేయర్ పోస్టు జనరల్ మహిళ కేటగిరీకి రిజర్వ్ అయింది. అయితే బీఎంసీ లాటరీ ప్రక్రియపై ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన(యుబిటి) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. బాయ్‌కాట్ చేసింది. లాటరీ నిర్వహించిన పద్ధతిపై శివసేన యుబిటి నేత, ముంబయి మాజీ మేయర్ కిషోర్ ఫడ్నేకర్ తప్పుబట్టారు. గతంలో రెండు దఫాలు కూడా ఈ పోస్టు ఓపెన్ కేటగిరీలోనే ఉందని అన్నారు. బిఎంసిని ఎందుకు ఒబిసి కేటగిరీ కింద పరిగణించలేదని ప్రశ్నించారు. ఎవరికీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే రూల్స్ మార్పు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. లాటరీ పద్ధతిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఎక్కడా ఎస్‌టి కేటగిరికి మేయర్ పోస్టు దక్కకపోవడాన్ని కూడా ఆ పార్టీ తప్పుపట్టింది. లాటరీ పద్ధతిలో కల్యాణ్ డోంబివిలి మున్సిపల్ కార్పొరేష్ ఎస్సీలకు కేటాయింపు జరిగింది. థానే మేయర్ పోస్టు ఎస్సీ కేటగిరీ (పురుషుడు)కి రిజర్వ్ అయింది. జల్నా–ఎస్‌సి పురుష, లాతూర్– ఎస్‌సి పురుష, ఇచల్కరంజీ – ఒబిసి పురుష, పాన్వెల్– ఒబిసి పురుష, అకోలా – ఒబిసి పురుష, అహిల్యానగర్– ఒబిసి మహిళ, ఉల్హాస్‌నగర్ – ఒబిసి పురుష, కొల్హాపూర్– ఒబిసి పురుష, చంద్రపూర్– ఒబిసి మహిళ, జలగావ్ – ఒబిసి మహిళకు రిజర్వ్ అయ్యాయి.

# స్టీల్ ప్లాంట్‌లో పేలుడు
# ఆరుగురు కార్మికులు మృతి



### ఐదుగురికి గాయాలు

**బలోదాబజార్ (ఛత్తీస్‌గఢ్) :** ఛత్తీస్‌గఢ్‌లోని బలోదాబజార్–భటాపారా జిల్లాలో గురువారం ఒక స్టీల్ ప్లాంట్‌లో జరిగిన పేలుడులో కనీసం ఆరుగురు కార్మికులు మరణించగా, మరో ఐదుగురు గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఈ సంఘటన భటాపారా గ్రామీణ ప్రాంతంలోని బకులాహి గ్రామంలో ఉన్న రియల్ ఇస్పాత్ అండ్ పవర్ లిమిటెడ్‌లో జరిగిందని జిల్లా కలెక్టర్ దీపక్ సోని పిటిఐకి ఫోన్‌లో తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, యూనిట్‌లోని డస్ట్ సెట్లింగ్ ఛాంబర్ (డిఎస్‌సి)లో పేలుడు సంభవించిందని, వేడి ధూళి కార్మికులపై పడటంతో ఆరుగురు కార్మికులు అక్కడికక్కడే మరణించగా, మరో ఐదుగురికి తీవ్రమైన కాలిన గాయాలయ్యాయని ఆయన తెలిపారు. సమాచారం అందిన వెంటనే, పోలీసులు, సీనియర్ పరిపాలనా అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన ఐదుగురు కార్మికులను బిలాస్‌పూర్‌లోని ఛత్తీస్‌గఢ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సిఐఎంఎస్)లో చేర్చినట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్యామ్ బిహారీ జైస్వాల్ కలెక్టర్‌తో మాట్లాడి, గాయపడిన వారికి సాధ్యమైనంత ఉత్తమ చికిత్స అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై త్వరితగతిన కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన కలెక్టర్‌ను ఆదేశించినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది. ఈ ఘటనపై జైస్వాల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ తీరని నష్టాన్ని భరించే శక్తిని వారి కుటుంబాలకు ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కష్టకాలంలో రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందని, అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## సిల్హెట్‌లో వేలాదిమందితో

# బంగ్లాదేశ్ బిఎన్‌పి ఎన్నికల ప్రచార ర్యాలీ

**సిల్హెట్:** ఇంటాబయటా కొన్ని గ్రూపులు కుట్రలకు పాల్పడుతున్నప్పటికీ వేలాది మంది ప్రాణత్యాగాలతో బంగ్లాదేశ్ ప్రజాస్వామ్యం దిశగా అడుగులు వేస్తూ ముందుకు కదులుతోందని బిఎన్‌పి (బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ) ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ అన్నారు. వచ్చేనెల 12వ తేదీన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గురువారం మధ్యాహ్నం వేలాదిమందితో సిల్హెట్‌లోని అలియా మద్రసా గ్రౌండ్స్‌లో బిఎన్‌పి నిర్వహించిన మొట్టమొదటి ర్యాలీలో తారిఖ్ రెహ్మాన్ ప్రసంగించారు. పశ్చిమ దేశాలతోపాటు ఇతర దేశాల నుండి బంగ్లాదేశ్ పౌరులు పంపిన పోస్టల్ బ్యాలెట్‌లను ఏ విధంగా దొంగిలించారో ఇటీవల పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను ప్రజలందరూ గమనించారని ఆయన గుర్తుచేస్తూ, దేశంలో రిగ్గింగ్‌కు పాల్పడి అజ్ఞాతవాసంలో ఉన్నవారంతా ఇప్పుడు ఎన్నికల సమయంలో మరోసారి అదేరకమైన కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు. పరోక్షంగా ఆయన షేక్ హసీనా, ఆమె అనుచరులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ విధమైన కుట్రలను ఉమ్మడిగా ప్రతిఘటించి అడ్డుకోగలుగుతామని తారిఖ్ రెహ్మాన్ అన్నారు.

# అసోంలో సాధారణ స్థితికి కొక్రఝర్

**గౌహతి:** అస్సాంలోని హింసాత్మక బాధిత కొక్రఝర్ జిల్లా సాధారణ స్థితికి చేరుకుంటుంది . గురువారం సైన్యంతో సహా భద్రతా సిబ్బంది బలహీన ప్రాంతాల్లో గస్తీ తిరుగుతున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారంసోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం తర్వాత జిల్లాలోని బోడోలు , ఆదివాసీల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరు వ్యక్తులు మరణించారు. మంగళవారం సాయంత్రం నుండి జిల్లాలో ఎటువంటి హింస జరగలేదు.నాలుగు సైన్య బృందాలు బలహీన ప్రాంతాల్లో గస్తీ తిరుగుతున్నారు.సి ఆర్ పిఎఫ్, అస్సాం పోలీస్‌లు కూడా బలహీన ప్రాంతాల్లో గస్తీ తిరుగుతున్నారు.ఐదు పాఠశాలలో ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలలో 1000మందికి పైగా ప్రజలు ఆశ్రయం పొందారని, వారుతమ ఇళ్లకు తిరిగి వెళ్ళేలా జిల్లా యంత్రాంగం ప్రయత్నాలు చేస్తోంది. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని, ఇంటర్నెట్ సేవలు నిలిపివేయబడ్డాయన్నారు. చిరాంగ్ జిల్లాలో కూడా ఇంటర్నెట్‌సేవలు నిలిపివేశారు.సోమవారం రాత్రి , కరిగావ్ ప్రాంతంలోని మాన్‌సింగ్ రోడ్డులో ముగ్గురు బోడోలతో కూడిన వాహనంఇద్దరు ఆదివాసీలను ఢీ కొట్టింది. ముగ్గురు బోడో వ్యక్తులను స్థానిక ఆదివాసులు కొట్టి , వాహనాన్ని తగుల బెట్టారు. దాడి జరిగిన వెంటనే ఒకరు మరణించగా, మరొకరు చికిత్స పొందుతూ గాయపడి మరణించారు.మంగళవారం, బోడో ,ఆదివాసీ వర్గాలు జాతీయ రహదారిని దిగ్బంధించడం, టైర్లు తగలబెట్టడం, ప్రభుత్వ కార్యాలయాన్ని తగలబెట్టడం , కరిగాం పోలీస్ అవుట్ పోస్ట్‌పై దాడి చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. కఠిన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన కలెక్టర్‌ను ఆదేశించినట్లు ఒక అధికారిక ప్రకటన తెలిపింది. పోలీస్‌లు నిరసనకారులపై లాఠీచార్జి చేసి , జనాన్ని చెదరగొట్టడానికి టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించారు. ఇందులో కొంతమంది పోలీస్ సిబ్బందితో సహా అనేక మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు.

SHRIRAM Finance

వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP36AT 0111 | Suresh Janne | Verna (Fludic) CRDI SX 1.6 VGT Diesel 5 Seater | 2012 |
| 2 | TG 25 9110 | Suman Dudapaka | Glanza V AT BS6 Petrol 5 Seater | 2024 |
| 3 | TS25E 0812 | Gadham Kumarswamy | Mahindra 475 DI | 2020 |

AUCTION DATE : 24-01-2026

VENUE : SHRIRAM AUTOMAL WARANGAL, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA , WARANGAL

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

1st Floor, H.No. 6-159, Above DCC Bank, Bhupalpally, Jayashankar Bhupalpally. Cell : 9849981545, 9949340057

# రూపాయి పతనం ఎన్నాళ్లు!

డాలర్‌తో పోలిస్తే, రూపాయి మారకం విలువ పతనం కొనసాగుతునే ఉంది. బుధవారం ఏకంగా 61 పైసలు పతనంతో, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డాలర్ విలువ 91.58 రూపాయలకు చేరింది. ఈ క్షీణత దేశ ఆర్థిక వ్యవస్థలో లోతుగా చోటుచేసుకుంటున్న పరిణామాలకు, సామాన్య ప్రజల జీవనంపై పడుతున్న భారానికి సూచిక. రూపాయి విలువ తగ్గడాన్ని మార్కెట్ సహజ పరిణామంగా, గ్లోబల్ పరిస్థితుల ప్రభావంగా పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం, బ్యాంకింగ్ వ్యవస్థలు తేలిగ్గా తీసుకునే ప్రయత్నం పలాయన వాదానికి తార్కాణం. రూపాయి మారకం విలువ పతనం నిరంతరంగా కొనసాగుతున్నప్పుడు, దాని ప్రభావాలు ప్రజల నిత్యజీవితంలో స్పష్టంగా కనిపించటం మొదలైనప్పుడు, ఇది ముమ్మాటికీ, ప్రభుత్వానికి, పాలకులకు, విధాన రూపకర్తలకు హెచ్చరికే. అభివృద్ధి కేవలం గణాంకాల్లో, నివేదికల్లో, అంతర్జాతీయ వేదికలపై చేసే ప్రకటనల్లో మాత్రమే కనిపిస్తే సరిపోదు. అది ప్రజల జీవన ప్రమాణాల్లో, వారి కొనుగోలు శక్తిలో, వారి భద్రతాభావంలో ప్రతిబింబించాలి. ఆ దృష్టితో చూస్తే రూపాయి పతనం మన ముందు జటిలమైన ప్రశ్నలను ఉంచుతున్నది. ఒక దేశ కరెన్సీ విలువ, ఆ దేశ ఆర్థిక బలం... ఆర్థిక స్థిరత్వం... అంతర్జాతీయ విశ్వసనీయతకు ప్రతీక.

రూపాయి విలువ తగ్గడమంటే డాలర్ వంటి విదేశీ కరెన్సీలకు ఎక్కువ రూపాయలు చెల్లించాల్సి రావడం. ఇది వినడానికి సాంకేతికపరమైన అంశంగా అనిపించినా, దాని ప్రభావం సామాన్య కుటుంబ బడ్జెట్‌పై నేరుగా పడుతుంది. భారత్ పెద్ద మొత్తంలో ఇంధనం, ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, ఎలక్ట్రానిక్స్, యంత్రాలు వంటి అవసరమైన వస్తువులను దిగుమతి చేసుకుంటుంది. రూపాయి బలహీనపడిన కొద్దీ, వీటి ఖర్చులు పెరుగుతాయి. ఆ ఖర్చు ప్రభుత్వం భరించదు... పరిశ్రమలే భరించవు... అది నేరుగా వినియోగదారుడిపైనే పడుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే రవాణా ఖర్చు పెరుగుతుంది. రవాణా ఖర్చు పెరిగితే కూరగాయల నుంచి పాలు, బియ్యం నుంచి మందుల వరకు అన్నీ ఖరీదవుతాయి. ఈ గొలుసు ప్రభావమే ద్రవ్యోల్బణం. ప్రస్తుతం ద్రవ్యోల్బణం ఇప్పటికే సహన స్థాయిని దాటింది. వినియోగ ధరల సూచీ నిరంతరం ఆందోళన కలిగిస్తున్నది. ఆదాయాలు దాదాపు స్థిరంగా ఉండగా, ధరలు మాత్రం రోజురోజుకూ పైపైకి పోతున్నాయి. ఇది ముఖ్యంగా తక్కువ ఆదాయం గల కుటుంబాలకు, మధ్య తరగతికి తీవ్రమైన దెబ్బ. వారి సంపాదనలో పెద్ద భాగం ఆహారం, ఇంధనం, అద్దె, విద్య, ఆరోగ్యం వంటి అవసరాలకే ఖర్చవుతుంది. పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు కోసం చేసే పొదుపు అన్నీ దెబ్బతింటాయి. ఈ పరిస్థితి సామాజిక అసమానతలను మరింత పెంచుతుంది. ఉన్నవారు ద్రవ్యోల్బణాన్ని కొంతవరకు తట్టుకోగలుగుతారు. కానీ లేనివారికి అది రోజువారీ జీవన పోరాటంగా మారుతుంది. 'ధనిక', 'పేద' వర్గాల మధ్య అంతరం మరింత పెరుగుతుంది. రూపాయి పతనం వల్ల మరో కీలక సమస్య విదేశీ పెట్టుబడులపై పడే ప్రభావం. కరెన్సీ నిరంతరం బలహీనపడుతున్న దేశంలో పెట్టుబడి పెట్టేందుకు విదేశీ మదుపరులు వెనకాడతారు. ఇప్పటికే అనేక సందర్భాల్లో విదేశీ సంస్థాగత పెట్టుబడులు భారత మార్కెట్ల నుంచి బయటకు వెళ్లిన దృశ్యాలు చూశాం. ఇది, మార్కెట్లలో అస్థిరత, షేర్ ధరల్లో పతనం, కంపెనీలకు మూలధనం అందుబాటులో తగ్గుదలకు సంకేతం. దీని ప్రభావం ఉద్యోగాలపై కూడా పడుతుంది. కొత్త పరిశ్రమలు రావడం తగ్గితే, ఉన్న పరిశ్రమలు విస్తరించలేకపోతే, ఉద్యోగ సృష్టి మందగిస్తుంది. నిరుద్యోగం పెరిగితే వినియోగం తగ్గుతుంది. వినియోగం తగ్గితే ఆర్థిక వృద్ధి కుంటుపడుతుంది. ఇది ఒక విషచక్రం. రూపాయి బలహీనపడటం విదేశీ రుణాలను మరింత భారంగా మారుస్తుంది. ప్రభుత్వం లేదా సంస్థలు విదేశీ కరెన్సీలో తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించేందుకు ఎక్కువ రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై ఒత్తిడి పెరుగుతుంది. చివరికి ఈ భారాన్ని కూడా పన్నుల రూపంలో లేదా సబ్సిడీల కోత రూపంలో ప్రజలే భరించాలి.

రూపాయి పతనం అనేది పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలో ఉండే అంశం కాదన్న వాదనను పూర్తిగా తిరస్కరించలేం. అయితే, దేశీయ విధానాలు, ఆర్థిక నిర్వహణ, ప్రజల నమ్మకం ఇవన్నీ కూడా కరెన్సీ విలువపై ప్రభావం చూపుతాయి. ఆర్థిక వ్యవస్థపై ప్రజలకు, పెట్టుబడిదారులకు నమ్మకం కలిగించేలా నిర్ణయాలు తీసుకోవడం ప్రభుత్వ కర్తవ్యం. ధరల నియంత్రణకు స్పష్టమైన చర్యలు ఉండాలి. అవసరమైన చోట సబ్సిడీలు, పన్నుల విధానంలో సమతౌల్యం, ఉత్పత్తి రంగాన్ని ప్రోత్సహించే చర్యలను సమన్వయంగా అమలు చేయాలి. అభివృద్ధి అనే పదాన్ని మళ్లీ నిర్వచించుకోవాల్సిన అవసరం కూడా ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి శాతం, స్టాక్ మార్కెట్ సూచీలు, అంతర్జాతీయ ర్యాంకింగ్స్ తదితరాలన్నీ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమే. కానీ అవి ప్రజల జీవితాల్లో ప్రతిబింబించకపోతే ఆ అభివృద్ధి అర్థహీనం. రూపాయి పతనం మనకు చెప్తున్న పాఠం ఇదే. కాగితాలపై వృద్ధి ఉన్నా, ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంటే, వారి భద్రతాభావం క్షీణిస్తుంటే, ఆర్థిక విధానాలను సమీక్షించుకోకతప్పదు. సమానత్వం, సమగ్రత, సామాజిక న్యాయం లేకుండా ఆర్థిక వృద్ధి నిలకడగా ఉండదు. అందుకే, ప్రభుత్వం తక్షణ చర్యలతో పాటు దీర్ఘకాలిక దృష్టితో ఆర్థిక విధానాలను ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలతో అనుసంధానించాలి. అభివృద్ధి నిజంగా ప్రజలకు లభించినప్పుడే రూపాయి బలపడుతుంది. లేకపోతే గణాంకాల్లో మాత్రమే వృద్ధి ఉంటుంది. సామాన్యుడు మరింత పేదవాడిగా మారే ప్రమాదం తప్పదు.



## పెట్టుబడిదారుల ప్రభావం పెరుగుతోంది

దేశంలో పెట్టుబడిదారుల ప్రభావం పెరుగుతున్నది. ఇది సోషలిస్ట్ ఆదర్శాలకు సవాలుగా మారింది. పెట్టుబడిదారీ విధానం మీడియాను ఆక్రమించింది. జర్నలిస్టులు ఎవరి ఎజెండాను అమలు చేయవద్దు. పెట్టుబడిదారులు ఆధిపత్యం చెలాయించినప్పుడు, సోషలిస్ట్ ఉద్యమం ఎలా ముందుకు సాగుతుంది, జనేశ్వర్ మిశ్రా జీ, నేతాజీ (ములాయం సింగ్ యాదవ్), బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్, రామ్ మనోహర్ లోహియా ఆదర్శాలను మనం ఎలా నిలబెట్టుకుంటామో అనేది మాకు సోషలిస్టులకు ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది. ఉద్యమ లాఠీని వారికి అందించినందుకు సోషలిస్టులు మిశ్రాను గుర్తుంచుకుంటారు. సమాజ్‌వాదీ పార్టీ పిడిఎ (పిచ్డా, దళిత, అల్ప సంఖ్యాక్ -- వెనుకబడిన తరగతులు, దళితులు, మైనారిటీలు) పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కట్టుబడి ఉంది.

ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్



## నీటి సంక్షోభం... ఒక అంతర్జాతీయ సవాల్

ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్నది అత్యంత తీవ్రమైన నీటి సమస్య— 'నీటి దివాలా'. ఐక్యరాజ్యసమితి యూనివర్సిటీ ఇన్స్టిట్యూట్ ఫర్ వాటర్, ఎన్విరాన్మెంట్ అండ్ హెల్త్ (UNUINWEH) తాజా నివేదిక ప్రకారం, ప్రకృతి తిరిగి భర్తీ చేయగల సామర్థ్యాన్ని మించిపోయే వేగంతో ప్రపంచం నీటిని వినియోగిస్తోంది. అనేక నదీ పరీవాహక ప్రాంతాలు, భూగర్భ జల భాండాగారాల్లో దశాబ్దాలుగా కొనసాగిన అతివినియోగం, పర్యావరణ క్షీణత కారణంగా, గతంలో ఉన్న నీటి – పర్యావరణ సమతుల్యతను తిరిగి సాధించడం ఇప్పుడు కష్టతరంగా మారింది. వాణిజ్యం, వలసలు, వాతావరణ మార్పులు, భౌగోళిక–రాజకీయ పరస్పర ఆధారాలు ఈ పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి.

ఇప్పటివరకు విస్తృతంగా ఉపయోగించిన నీటి ఒత్తిడి, నీటి సంక్షోభం వంటి పదాలు ఈ వాస్తవాన్ని పూర్తిగా వివరించలేవు. 'ఒత్తిడి' అన్నది ఇంకా సరిదిద్దగలిగే స్థితిని సూచిస్తే, 'సంక్షోభం' తాత్కాలికంగా ఏర్పడే తీవ్రమైన పరిస్థితిని సూచిస్తుంది. కానీ 'నీటి దివాలా' పూర్తిగా భిన్నమైన దశను సూచిస్తుంది— దీర్ఘకాల అతివినియోగం వల్ల నీటివ్యవస్థలు స్వయంగా కోలుకునే సామర్థ్యాన్ని కోల్పోవడం. ఈ వాస్తవాన్ని స్పష్టంగా అంగీకరించి, దానికి తగిన విధానాలు రూపొందించడం ఇప్పుడు అత్యవసరమైన కర్తవ్యంగా మారింది.

నీటి దివాలా నిర్వహణలో రెండు అంశాలు అత్యంత కీలకం— దివాలా స్థితి, తిరిగి సరిదిద్దలేని నష్టం. ఆర్థిక దివాలా సాధారణంగా అప్పులు–ఆస్తుల మధ్య సమతుల్యతను సరిచేయడంపైనే దృష్టి సారిస్తే, నీటి దివాలా మాత్రం డిమాండ్ సరఫరాల మధ్య ఉన్న సంబంధాన్ని పూర్తిగా పునరాలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. ఇది సంప్రదాయ సంక్షోభ నిర్వహణకంటే విస్తృతమైన దృష్టికోణం; దీర్ఘకాలిక పరిష్కారాలు, సమగ్ర విధానాలు అవసరమని స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ కొత్త నీటి వాస్తవానికి 'మనుషుల చేత సృష్టించబడిన కరువు' (Anthropogenic drought) కేంద్రబిందువుగా నిలుస్తోంది. నీటికొరత కేవలం సహజ కారణాల ఫలితం మాత్రమే కాదు; అతివినియోగం, భూగర్భ జలాల క్షీణత, నేల–భూమి నష్టం, అరణ్య నరుకుడు, కాలుష్యం, వాతావరణ మార్పులు కలిసి నీటి లభ్యతను తీవ్రంగా తగ్గిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సుమారు 70 శాతం నీటి వినియోగం వ్యవసాయ రంగంలోనే జరుగుతుండగా, ముఖ్యంగా గ్లోబల్ సౌత్‌లో ఇది కోట్లాది జీవనాధారాలతో ముడిపడి ఉంది. నీటిని ఒక ప్రవాహ అవకాశ రంగంగా గుర్తించడం ద్వారా దేశాల మధ్యనే కాదు, దేశాల లోపల గ్రామీణ–పట్టణ ప్రాంతాల మధ్య, విభిన్న రాజకీయ వర్గాల మధ్య కూడా విశ్వాసాన్ని పునర్నిర్మించే అవకాశం ఉంది. 2026 –2028 UN Water Conferences, 2028 Water Action Decade ముగింపు, 2030 SDG6 లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుంటే, ప్రపంచం ఇప్పుడు ఒక కొత్త, సమగ్ర, స్థిరమైన నీటి విధానాన్ని రూపొందించాల్సిన కీలక మలుపు వద్ద నిలిచిం ది. నీటి దివాలా ఒక అంతర్జాతీయ సవాల్ మాత్రమే కాదు; ఇది మానవ భద్రత, సమానత్వం, స్థిరత్వానికి సంబంధించిన పరీక్ష. దీన్ని గుర్తించడం సరిపోదు— దీని పరిష్కారానికి న్యాయపూర్వకమైన, దీర్ఘకాలిక విధానాలను తక్షణ మే అమలు చేయాల్సిన బాధ్యత మన ముందుంది.

**డా.కృష్ణ కుమార్ వేపకొమ్మ**
ప్రొఫెసర్ & ప్రిన్సిపాల్ (రిటైర్డ్), హైదరాబాద్

# మోదీ–షాలకు హెచ్చరికలు పంపనున్న 2026 ఎన్నికలు

**ఆర్.సత్యమూర్తి**

భారత ఎన్నికలు దశాబ్దకాలంగా మోసపూరితమైన ఒక ఫార్ములా చుట్టూ తిరుగుతున్నాయి: అది నరేంద్ర మోదీ ప్రజలకు సాక్షాత్కరిస్తాడు. అమిత్ షా ఎన్నికల అంకగణితాన్ని పరిపూర్ణం చేస్తాడు. ఒకటి కథనంపై ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుంది. మరొకటి యంత్రాంగాన్ని నియంత్రిస్తుంది. వీరిద్దరూ కలిసి భారతీయ జనతా పార్టీని అత్యంత కేంద్రీకృత, క్రమశిక్షణ కలిగిన, ఎన్నికలపరంగా సమర్థవంతమైన రాజకీయ సంస్థగా మార్చారు. భారతదేశం కాంగ్రెస్ పతాక స్థాయిలో ఉండగా చూసినట్లుగా వారు తమ పార్టీని మార్చేశారు.

బిజెపి ఎదుర్కోకుండా జాగ్రత్తగా తప్పించుకుంటున్న అత్యంత అసౌకర్య వాస్తవాన్ని 2026 బహిర్గతం చేసే ప్రమాదం ఉంది: అదేమంటే, జాతీయ ఆధిపత్యం తానంతటతానుగా ప్రాంతీయ శక్తిగా పరివర్తన చెందదు.

పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు కేంద్రంలోని నరేంద్ర మోదీప్రభుత్వాన్ని అస్థిరపరచవు లేదా పార్టీపై అమిత్ షా పట్టును సడలించబోవు. ఎన్నికలపరంగా మోదీ జాతీయ స్థాయిలో సవాలు చేయబడడు. సంస్థపై షా ఆధిక్యం దాదాపు సంపూర్ణంగా ఉంది. కానీ, ప్రతిచోటా, సంస్కృతులు, భాషలు, కుల దొంతరలు, రాజకీయ సంప్రదాయాలకు అతీతం గా ఎన్నికలపరంగా ఎదురులేనివాడు అని బిజెపి ఒక దశాబ్దం పాటు పెంచి పోషించిన బ్రాండ్ మోదీ అనే మిథ్యను ఈ ఎన్నికలు గాలి తీయగలవు. న్యూఢిల్లీలో కాకుండా ఇక్కడే మోదీ–షా పథకానికి గట్టి ప్రతిఘటన ఎదురవుతుంది. బిజెపి ఎంచుకున్న గణాంకాల ప్రకారం, ఆ పార్టీ తిరుగులేనిదిగా కనిపిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో దాని ఓట్ల వాటా దాదాపు 36.5 శాతంగా ఉంది. అది భారతదేశంలో అతిపెద్ద రాజకీయ శక్తిగా నిలిచింది. ఆర్థిక వ్యవస్థ 6.77 శాతంతో వృద్ధి చెందుతోంది. ద్రవ్యోల్బణం తగ్గింది. నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ 18 రాష్ట్రాలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పరిపాలిస్తోంది. ప్రతిపక్షం విచ్ఛిన్నమై, సైద్ధాంతికంగా అసంబద్ధంగా, వ్యూహాత్మకంగా విభజించబడింది.

కానీ జాతీయ సగటుల ఆధారంగా ఎన్నికల పోరాటాలు జరగబోవు. అవి నిర్దిష్ట సామాజిక సంకీర్ణాలలో, చారిత్రక జ్ఞాపకాలలో, స్థానిక అధికార నిర్మాణాల ఆధారంగా జయాపజయాలు ఉంటాయి. 2026లో ఓటు వేయబోయే ఐదు రాష్ట్రాలలో, బిజెపి కేవలం అస్సాం రాష్ట్రాన్ని మాత్రమే ప్రత్యక్షంగా పరిపాలిస్తుంది. అందులోనూ అక్కడ హిమంత బిశ్వ శర్మ తప్ప మోదీ గురుత్వాకర్షణ కేంద్రం కాదు. మిగతా అన్ని చోట్లా, మోదీ–షా బ్రాండ్ పాతుకుపోయిన సాంస్కృతిక, కుల, భాషా అడ్డంకులను ఎదుర్కొంటున్నది. వాటిని కేంద్రంలో పన్నెండు సంవత్సరాల నిరంతరాయ అధికారం తొలగించలేకపోయింది.

**పశ్చిమ బెంగాల్** బిజెపిని అత్యంత బహిర్గత పరిచే పరిశీలనార్హమైన అంశం. 2011–2021 మధ్య ఆ పార్టీ ఓట్ల వాటా 10 శాతం నుండి దాదాపు 38 శాతానికి పెరిగింది. ఇది బిజెపి చరిత్రలో అత్యంత వేగవంతమైన ఎన్నికల పెరుగుదలలో ఒకటి. అయినప్పటికీ, 2021లో మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ 48 శాతం ఓట్లతో, 294 అసెంబ్లీ స్థానాలకు గాను 213 స్థానాలను గెలుచుకుని, ఈ సవాలును చిత్తుగా ఓడించింది.

క్షీణిస్తున్న ప్రతిఫలాలు అంటే ఇలాగే ఉంటాయి. బిజెపి దశాబ్దానికి పైగా దూకుడుగా విభజన రాజకీయాలు చేసింది. విస్తృతంగా ప్రజలను సమీకరించింది. సంస్థాగత శ్రమను ధారపోసింది. కానీ బెంగాల్ రాజకీయాలు కేవలం సైద్ధాంతిక విభజనల ద్వారా మాత్రమే నిర్ణయించబడవు. అవి సంక్షేమ పథకాల అమలు, స్థానిక అభిమాన అనుసంధానాలు, లోతుగా పాతుకుపోయిన బెంగాలీ ఉప–జాతీయవాద భావన ద్వారా రూపుదిద్దుకుంటాయి. బెంగాల్ జనాభాలో ముస్లింలు 27–28 శాతంగా ఉన్నారు. వారిలో సుమారు మూడింట రెండు వంతుల నుండి నాలుగింటి మూడు వంతుల మందికి తృణమూల్ కాంగ్రెస్ పట్ల విధేయత ఉంది. దీనికి అదనంగా లక్ష్మీ ర్ భండార్ వంటి పథకాల ద్వారా, మొత్తం ఓటర్లలో దాదాపు 49 శాతంగా ఉన్న మహిళా ఓటర్లు టిఎంసి సంక్షేమ వ్యవస్థలో రాజకీయంగా సమీకృతం చేయబడ్డారు. ఇది బిజెపికి గల పరిమితిని ఏ మాత్రం పొరపాటు లేకుండా చూపిస్తుంది.

మోదీ బ్రాండ్ ర్యాలీలను ఉత్తేజపరచవచ్చు. కానీ బెంగాల్లో ఎన్నికలు వేదికల ద్వారా గెలవబడవు. అవి మునిసిపల్ కార్యాలయాలు, రేషన్ దుకాణాలు, పరిసర ప్రాంత కమిటీలలో గెలవబడతాయి.ఈ ప్రదేశాలలో బిజెపి ఇప్పటికీ పాలక ప్రత్యామ్నాయంలా కాకుండా, ఒక దూకుడుగా వ్యవహరించే వెలుపలి వ్యక్తిలా ఎక్కువగా కనిపిస్తుంది.

బెంగాల్ బిజెపి పరిమితులను బయటపెడితే, **తమిళనాడు** దాని అంచనాలను అవమానిస్తుంది.

పొత్తులు, కేంద్ర ప్రచారాలు, నిరంతరం కేంద్రం ఉనికి ప్రదర్శన ఉన్నప్పటికీ, తమిళనాడులో బిజెపి ఓట్ల శాతం 3 నుండి 6 శాతం మధ్యే నిలిచిపోయింది. 2021లో కూడా, ఎఐఎడిఎంకె పొత్తుతో ఎన్‌డిఎ 234 మందిసభ్యుల అసెంబ్లీలో కేవలం 23 స్థానాలను మాత్రమే గెలుచుకుంది.

ఇది సందేశం అందించడంలో వైఫల్యం కాదు. ఇది అక్కడి పరిస్థితులకు సరిపోని కారణంగా సంభవించిన వైఫల్యం.




జాతీయ స్థాయిలో బిజెపికి అత్యంత విశ్వసనీయమైన మద్దతుదారులుగా ఉండే అగ్ర కులాలు తమిళనాడు జనాభాలో కేవలం 3–4 శాతం మాత్రమే ఉన్నారు. ఒబిసిలు, ఎంబిసిలు కలిసి మొత్తం ఓటర్లలో దాదాపు మూడింట రెండు వంతుల మంది ఉన్నారు. ఇక్కడ ద్రవిడ రాజకీయాలు కేవలం సైద్ధాంతిక ప్రదర్శన కాదు; ఇది రోజువారీ పాలన, సామాజిక అస్థిత్వంలో పాతుకుపోయిన రాజకీయ వివేకం. ఆర్థికపరంగా తమిళనాడు బిజెపికి ఇష్టమైన ప్రచారానికి మరింత గండి కొడుతుంది. ఈ రాష్ట్రం భారతదేశ జిడిపిలో సుమారు 9 శాతం వాటాను అందిస్తుంది. తలసరి ఆదాయం రూ.2.8 లక్షలకు పైగా ఉంది. మోదీ కంటే దశాబ్దాల ముందు నుంచే ఉన్న ద్రవిడ చట్రం ద్వారా సంక్షేమాన్ని అందిస్తోంది. ఇక్కడి ఓటర్లు జాతీయ పరివర్తన కోసం ఎదురుచూడటం లేదు. వారు పంపిణీ, ఆత్మగౌరవం, స్వయంప్రతిపత్తి కోసం బేరసారాలు ఆడుతున్నారు. 'మోదీ మాయాజాలం' ఏదీ ఈ నియమాన్ని ఛేదించలేకపోయింది. 2026లో అది సాధ్యమవుతుందనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. **కేరళ**ను బిజెపి వ్యూహకర్తలు తరచుగా పార్టీకి 'తదుపరి సరిహద్దు'గా చిత్రిస్తుంటారు. కానీ అందుబాటులోని సమాచారం మరింత వాస్తవిక చిత్రాన్ని అందిస్తుంది. 2015, 2020, 2025 సంవత్సరాల లో స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి ఓట్ల శాతం 14–15 శాతం మధ్యే కొట్టుమిట్టాడుతూ ఉంది. ఇది పురోగతి కాదు, స్తబ్దత. కేరళ జనాభా స్వరూపం అంత సులభమైనది కాదు. జనాభాలో ముస్లింలు సుమారు 27 శాతం, క్రైస్తవులు దాదాపు 18 శాతం ఉన్నారు. దాదాపు 45 శాతం మంది ఓటర్లు మైనారిటీలే. వీరు బిజెపి జాతీయ సైద్ధాంతిక ప్రణాళికపై తీవ్రమైన సందేహంలో ఉన్నారు. 2024లో పార్టీ సాధించిన ఎంతో ప్రశంసలు పొందిన ఒక లోక్‌సభ సీటు విజయం కూడా ఈ సమీకరణాన్ని ఏ మాత్రం గణనీయంగా మార్చలేదు. అంచనాలు తక్కువగా ఉన్నందునే స్వల్ప లాభాలను చారిత్రాత్మక మార్పులుగా చిత్రీకరిస్తున్నారు.

కేరళలో మోదీ బ్రాండ్ కుప్పకూలదు. అది కేవలం విస్తరించడానికి నిరాకరిస్తుంది. బిజెపికి **అస్సాం** అతి బలమైన ప్రతివాదన. 2021లో ఎన్‌డిఎ 126 స్థానాలకు గాను 75 స్థానాలను సుమారు 45 శాతం ఓట్ల వాటాతో గెలుచుకుంది. కానీ ఈ విజయం మోదీ ఆకర్షణ కంటే హిమంత బిశ్వ శర్మకే ఎక్కువగా దక్కుతుంది. అస్సాం రాజకీయాలు అత్యంత స్థానికమైనవి. అవి జాతి, భూ హక్కులు, వలసల ఆందోళనలు, అస్థిత్వ సంఘర్షణల ఆధారంగా ప్రభావితమవుతాయి. జనాభాలో 34–35 శాతంగా ఉన్న ముస్లింలు, ఎక్కువగా బిజెపికి దూరంగా ఉన్నారు. శర్మ యొక్క శక్తిమంతమైన స్థానిక నాయకత్వం అస్సామీ హిందువులు, ఒబిసిలు, గిరిజన సమూహాలను ఏకీకృతం చేయడం ద్వారా పార్టీ ఈ లోటును పూడ్చుకుంటోంది. ఈ నమూనా బదిలీ చేయదగినది కాదు. దీనికి ఒక ఆధిపత్య ప్రాంతీయ నాయకుడు అవసరం. చాలా హిందీయేతర రాష్ట్రాలలో బిజెపికి లేనిది స్పష్టంగా ఇదే. ఇది బిజెపికి అత్యంత ఇబ్బందికరమైన సంస్థాగత సమస్య. దాని జాతీయ భాగస్వాములైన అగ్ర కులాలు, ఒబిసిలలో ఒక వర్గం హిందీ రాష్ట్రాలలో అద్భుతంగా పనిచేసింది. కానీ అగ్ర కులాలు జనాభాలో 10 శాతం కంటే తక్కువగా ఉన్న రాష్ట్రాలలో, సామాజిక న్యాయ రాజకీయాలు హిందుత్వ కంటే ముందు ఉన్న చోట, ఈ సూత్రం విఫలమవుతూంది. కులం కేవలం అంకగణితం కాదు. అది జ్ఞాపకం, చరిత్ర, జీవిత అనుభవం. భారతదేశంలోని చాలా ప్రాంతాలలో, ఆ జ్ఞాపకం బిజెపి సైద్ధాంతిక కథనానికి అనుకూలంగా లేదు.

2026 అసెంబ్లీ ఎన్నికలు మోదీ నాయకత్వానికి లేదా షా అధికారానికి ముప్పు కలిగించవు. కానీ, అవి నిశ్శబ్దంగా,మోదీ–షా బ్రాండ్ తన ప్రాంతీయ పరిమితులను చేరుకుందని అత్యంత నష్టం కలిగించే తీర్పును ఇవ్వవచ్చు. రాజకీయాల్లో పన్నెండేళ్లు చాలా సుదీర్ఘ కాలం. కేంద్రంలో దశాబ్దం పాటు నిరంతరాయంగా అధికారంలో ఉన్న తర్వాత కూడా బిజెపి పశ్చిమ బెంగాల్, తమిళనాడు లేదా కేరళలో పాగా వేయలేకపోతే, సమస్య నాయకత్వం, ప్రయత్నం లేదా వనరులు కాదు. అది వ్యవస్థాగతంగా అనుగుణంగాలేని లోపం. బిజెపి భారతదేశాన్ని పరిపాలించడం కొనసాగవచ్చు. కానీ భారతదేశాన్ని పరిపాలించడం అంటే, దానిలోని ప్రతి భాగానికి ప్రాతినిధ్యం వహించడం కాదు. 2026లో ప్రాంతీయ భారతదేశం మోదీ–షా జగన్నాథ రథం చాలాకాలంగా ప్రతిఘటిస్తున్న ఒక సత్యాన్ని గుర్తు చేయబోతోంది :కొన్ని కోటలు జయించబడేందుకు ఎదురు చూడవు. అవి ఏ మాత్రం ప్రభావితం కావు.

# స్ఫూర్తినింపిన సిపిఐ శతాబ్ది ఉత్సవాలు




భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ సందర్భంగా ఈనెల 18 నుంచి 21 వరకు జరిగిన కార్యక్రమాలు స్ఫూర్తిని నింపాయి. ముఖ్యంగా 18న ఖమ్మంలో జరిగిన ప్రదర్శన, బహిరంగ సభ కమ్యూనిస్టు శక్తులకు ఉత్తేజాన్ని, ఊపును ఇచ్చింది. కమ్యూనిస్టులు బలహీనపడ్డారని వాదించే వారికి శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ తగు రీతిలో సమాధానం ఇచ్చింది. దశాబ్దాల నాడు కమ్యూనిస్టు పార్టీ సభలకు తరలి వచ్చిన రీతిలో కమ్యూనిస్టు శక్తుల పురోగమనాన్ని కోరుకుంటూ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. శరీరానికే వార్ధక్యం కానీ ఆలోచనకు కాదని రుజువు చేస్తూ అనేక మంది వృద్ధులు పడుతూ లేస్తూ ప్రదర్శనలో పాల్గొని యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలో జరిగిన జనసేవాదళ్ కవాత్ నభూతో నభవిష్యత్ అన్న రీతిగా సాగింది. ఇంత మంది యువకులు కమ్యూనిస్టు పార్టీ వెనక ఉన్నారా అని ఆలోచించే రీతిలో వేలాది మంది యువకులు లెఫ్ట్ రైట్ అంటూ ఖమ్మం పుర వీధుల్లో చేసిన కవాతు మరికొన్ని దశాబ్దాల పాటు గుర్తుండి పోయేలా చేసింది. కిలో మీటర్ల మేర ప్రదర్శన ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బహిరంగ సభకు అనూహ్య రీతిలో ప్రజలు కదలి వచ్చారు. 18న ఎటు చూసినా ఎర్ర జెండా రెపరెపలతో ఖమ్మం అరుణకాంతులినిండి. ఎటుచూసినా ఎర్ర జెండాలు పట్టిన జనమే కనిపించారు. త్యాగాలు, పోరాటాలతో వందేళ్లు గడిచినా తాము మద్దతుగానే నిలుస్తామని సభకు వచ్చిన ప్రజలు చాటి చెప్పారు. సభ పునరుత్తేజాన్ని ఇచ్చింది. భవిష్యత్తు పోరాటాలకు ప్రేరణగా నిలిచింది.

శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఖమ్మంలో జరిగిన సిపిఐ జాతీయ స్థాయి సమావేశాలు రానున్నకాలంలో పార్టీ అనుసరించాల్సిన విధానాలకు సంబంధించి దిశా నిర్దేశం చేశాయి. పెరుగుతున్న ఫాసిస్టు శక్తుల దుశ్చర్యలను అడ్డకునేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కలుపుకుని బహుముఖ పోరాటాలకు సమాయత్తం కావాలని సమావేశాలు పిలుపునిచ్చాయి. ప్రపంచంలో పెరుగుతున్న ధోరణులు, ట్రంప్ విధానాలను నిరసిస్తూ వెనుజులా, క్యూబా లాంటి దేశాలకు కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. బిజెపి విధానాలు ఈ దేశ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారాయని, ఒక పక్క పార్లమెంటును నిర్వీర్యం చేస్తూ మరో పక్క దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని సమావేశం పేర్కొన్నది. వీటిని అడ్డుకోవడానికి ప్రజలను చైతన్యవంతం చేయడంతో పాటు మతతత్వ శక్తులను నిలువరించేందుకు పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని సమావేశాలు నిర్ణయించాయి.

విపక్ష పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బందుల పాలు చేస్తున్న గవర్నర్ వ్యవస్థను రద్దు చేయాలని సిపిఐ సమావేశాల సందర్భంగా డిమాండ్ చేస్తూ తీర్మానాన్ని ఆమోదించాయి. జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో మొత్తం తొమ్మిది తీర్మానాలను ఆమోదించారు. ఫిబ్రవరి 12న మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదానికి కృషి చేయాలని, ఎంజి ఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకం కొనసాగింపుకు పోరాడాలని, విబి జి రామ్ జీ పేరిట మోడీ తీసుకు వచ్చిన పథకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ తీర్మానించింది. శ్రీ మాతా వైష్ణో దేవి మెడికల్ ఇనిస్టిట్యూట్ రద్దు ప్రతిపాదనను తక్షణం ఉపసంహరించుకోవాలని, భారతదేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో పెరుగుతున్న వాయుకాలుష్య నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రైవేట్ సెక్టార్‌లో రిజర్వేషన్లు కల్పించాలని, ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉన్న విబి జి రామ్ జి చట్టాన్ని ఖండించాలని జాతీయ స్థాయి సమావేశాలు తీర్మానించాయి. శతాబ్ది ఉత్సవాల సందర్భం గా జరిగిన సెమినార్ ఐక్య ఉద్యమాలకు పిలుపునిచ్చింది. ఈనెల 20న నేటి భారత దేశం–వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జరిగిన సెమినార్‌లో సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, జాతీయ కార్యదర్శులు డి. రాజా, ఎంఎబేబీ, దీపాంకర్ భట్టాచార్య, జి. దేవరాజన్‌తో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పాల్గొన్నారు. భారత ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని ఒక పక్క ఓట్ల తొలగింపు జరుగుతుండగా మరో పక్క జనాభా లెక్కల పేరుతో బిజెపి సర్కార్ మరో కుట్రకు పూనుకుందని వక్తలు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ సూచనలతో బిజెపి ప్రభుత్వం పాలనలోకి మతాన్ని చొప్పిస్తుందని, కులం పేర, మతం పేర సమాజాన్ని విడదీస్తుందని ఆరోపించారు.

అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా ఈ దేశంలో శాశ్వతంగా అధికారంలో ఉండాలని బిజెపి ప్రయత్నిస్తుందని మోడీ చర్యలు నియంత పాలన వైపుకు దారి తీస్తున్నాయని వామపక్షాల నేతలు ఆరోపించారు. ఈ సెమినార్ వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్య పోరాటాలకు పిలుపునిచ్చింది. మొత్తంగా శతాబ్ది ఉత్సవాలు వందేళ్ల సిపిఐ చరిత్రలో త్యాగాలు చేసిన వారిని స్మరించుకుంటూ గత పోరాటాలను మననం చేసుకుని భవిష్యత్ పోరాటాలకు కార్యోన్ముఖులను చేసింది. ఓట్లు, సీట్లు నోట్లతో ముడిపడి ఉన్న రోజుల్లో ప్రజా ఉద్యమ నిర్మాణం, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగాలని శతాబ్ది ఉత్సవాలు పిలుపునిచ్చాయి. జాతీయ స్థాయి సమావేశాల ముగింపు సందర్భంగా నాయకులు బెలూన్లు ఎగురవేసి ఘనంగా ముగించారు.

**ఏనుగు వెంకటేశ్వరరావు,** ఖమ్మం

## గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు

### మంత్రికి సర్పంచ్ మురళీగౌడ్ విజ్ఞప్తి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** పిల్లుట్ల గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర మంత్రి దామోదరరాజనర్సింహాను కోరినట్టు పిల్లుట్ల సర్పంచ్ బుర్ర మురళీగౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా మంత్రి దామోదరరాజ నరసింహాను మర్యాదపూర్వకంగా లసి నిధులు కోరినట్టు తెలిపారు. గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి, సీసీరోడ్లు, ప్రాథమిక పాఠశాల అభివృద్ధితో పాటు గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చిన మంత్రికి గ్రామస్థుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంగళపర్తి స్వామియాదవ్, ఆంగ్రెస్ పార్టీ గ్రామాధ్యక్షులు రాఘవరెడ్డి, బొమ్మిడాల శంకర్, పెద్దపులి సతీష్, కరుణాకర్‌రెడ్డి, తలారి హనుమంతు, దినేష్‌రెడ్డి, గుల్లయ్యగారి రవీందర్, మస్కురి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువత ఎదుగుదలకు క్రీడా మైదానాలు

### మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** గ్రామీణ ప్రాంత యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగడానికి క్రీడా మైదానాలు ఎంతో అవసరమని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పేర్కొన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం బలగాల గ్రామంలో నూతనంగా నిర్మించిన క్రీడా మైదానాన్ని గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. భవిష్యత్తులో గ్రామీణ యువత రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించేందుకు ఇటువంటి మౌలిక వసతులు ఎంతగానో దోహదపడతాయని ఆయన వివరించారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్న యువతకు ఇవి సరైన వేదికలుగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, క్రీడాభిమానులు, విద్యార్థులు, కోయవాగు, చింతగుడా, బలగాల గ్రామాలకు చెందిన యువతీ యువకులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యం



**ప్రజాపక్షం/లక్ష్మణచందా :** గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అందరి యొక్క సమన్వయంతో ముందుకు సాగుతామని గ్రామ సర్పంచ్ గిరిజ రవి తిరపల్లి గ్రామసభలో పాల్గొని మాట్లాడారు.గ్రామంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనుల గురించి తీర్మానం చేశారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ ప్రవీణ్,బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు గాండ్ల చిన్నాయ, పంచాయతీ కార్యదర్శి వీణశ్రీ,ఏఈఓ పవిత్ర, అంగన్వాడీ టీచర్ ఏఎన్ఎం,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు త్వరగా పూర్తి


### మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్



**ప్రజాపక్షం / పెంచికలపేట్ :** ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మిగిలి ఉన్న ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ సూచించారు. గురువారం పెంచికలపేట్ మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఉపాధి హామీ పథకం పేరును వివిజె రామ్ జీగా మార్చినట్లు తెలిపారు. ప్రతి కుటుంబం వంద రోజులు పని చేసే విధంగా అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. మండలంలో మంజూరైన గ్రామ పంచాయతీ భవనాలు, కిచెన్ షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన వారు త్వరగా పూర్తి చేయాలని, మిగిలిన వారు పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. సీఎం కప్ 2025 క్రీడల ద్వారా గ్రామీణ క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని, వారిని ప్రోత్సహించాలని సూచించారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ఫిబ్రవరి 1 నుండి 20 వరకు గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల పంచాయతీ అధికారి మహేందర్, ఆర్ డబ్ల్యూఎస్ఎఇ ప్రణీత్, హౌసింగ్ ఎఇ అక్షిత, ఎపిఓ సతీష్, ఇరిగేషన్ అధికారులు, సర్పంచ్‌లు మరియు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నూతన పాలకవర్గానికి సన్మానం

**ప్రజాక్షం/ఆర్మూర్ :** మండలంలోని పల్లె గ్రామంలో (హరిపూర్) నూతనంగా ఎన్నుకోబడ్డ సర్పంచ్ పార్దేమ్ మనీషా సంజీవ్, ఉసర్పంచ్ రవితో పాటు వార్డు సభ్యులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురకంటి చిన్నారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పంచాయతీరాజ్ ఆవరణలో ఘనంగా సన్మానించి మాట్లాడారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపి నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌కుమార్‌రెడ్డి సహకారంతో పల్లె గ్రామానికి అభివృద్ధికి తమ సహాయసహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు.శేఖర్, శాంతి, మధుమిత, కవిత, లావణ్య, మాధురి, రాంసన్, గంగాధర్, శ్రీనివాస్, సుధాకర్, ధర్మయ్య, దేవరాజ్, శ్రీరాం, అశోక్ పాల్గొన్నారు.



# బాసరలో వసంత పంచమికి పటిష్ఠ ఏర్పాట్లు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జ్ఞాన సరస్వతీ క్షేత్రమైన బాసరలో రేపు జరగనున్న వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని నిర్మల్ జిల్లా పోలీస్ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా,అత్యంత పారదర్శకంగా ,శాంతియుతంగా వేడుకలు నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపిఎస్ నేతృత్వంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.గురువారం ఆమె బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులకు,సిబ్బందికి క్షేత్రస్థాయిలో దిశానిర్దేశం చేశారు.అడుగడుగునా నిఘా ..భారీ బలగాల మోహరింపు అక్షరాభ్యాసాలకు ప్రసిద్ధి చెందిన బాసర క్షేత్రానికి వసంత పంచమి పర్వదినాన భక్తుల రద్దీ అత్యధికంగా ఉంటుందని,అందువల్ల ప్రతి పాయింట్ వద్ద నిశిత నిఘా ఉంచామని తెలిపారు. ఆలయ పరిసర ప్రాం తాల్లో,గోదావరి స్నాన ఘట్టాల వద్ద, భక్తులు రాకపోకలు సాగించే ప్రధానన మార్గాల్లో ప్రత్యేక బలగాలను మోహరించినట్లు వివరించారు. ము ఖ్యంగా చిన్నపిల్లలతో వచ్చే తల్లిదండ్రులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

### టెక్నాలజీతో భద్రత సాదా దుస్తుల్లో నిఘా..

భద్రతా ఏర్పాట్లలో భాగంగా టెక్నాలజీని పెద్ద ఎత్తున వినియోగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.ఆలయ ముఖ్యద్వారం నుండి గర్భాలయం వరకు,అలాగే పార్కింగ్ స్థలాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించి నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు.దొంగతనాలు,చైన్ స్నాచింగ్ వంటి సంఘటనలు జరగకుండా సాదా దుస్తుల్లో షీ టీమ్స్,క్రైమ్ పార్టీ పోలీసులు భక్తుల మధ్య నిరంతరం గస్తీ,తిరుగుతారని హెచ్చరించారు.ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ప్లాన్ వేడుకల సమయంలో బాసర వైపు వచ్చే వాహనాల రదీని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ మళ్లింపు,పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు.లడ్డూ ప్రసాదం కౌంటర్లు,అన్నదాన సత్రాల వద్ద తోపులాట జరగకుండా బారికేడింగ్ ఏర్పాటు చేశారు.భక్తులు క్రమశిక్షణతో క్యూలైన్లలో వెళ్లి అమ్మవారిని దర్శించుకోవాలని,పోలీసు సిబ్బంది భక్తులతో మర్యాదగా ప్రవర్తిస్తూనే విధి నిర్వహణలో కఠినంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు.ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించినా వెంటనే సమీపంలోని పోలీసులకు లేదా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని కోరారు.సమయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని, లోతైన ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు.పోలీస్ శాఖ సమన్వయంతో భక్తులందరికీ క్షేమకరమైన దర్శనం కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఎస్పి జానకి షర్మిల స్పష్టం చేశారు.



## మంత్రి కొండా సురేఖకు కలెక్టర్ అభిలాష అభినవ్ స్వాగతం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర న్యాయ, అటవీ,పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖకు,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్,అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందించి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.అనంతరం ఇరువురు సమావేశమై పలు అంశాలపై చర్చించారు.మంత్రి స్వాగతం పలికిన వారిలో జిల్లా ఎస్పి జానకి షర్మిల,అదనపు కలెక్టర్(రెవెన్యూ)కిషోర్ కుమార్ ఎఎస్పి సాయికిరణ్,డీఎఫ్ఓ సుఖదేవ్ బోబడే,ఆర్డీవో రత్నకళ్యాణి, ఉన్నారు.

## ప్రభుత్వ భూమిని కాజేసినవారిపై చర్యలుండేనా?

**ప్రజాపక్షం / చెన్నూరు :** చెన్నూరు పట్టణ కేంద్రంలోని సర్వే నెంబర్ 840లో గల ప్రభుత్వ భూమి వ్యవహారం ప్రస్తుతం స్థానికంగా దుమారం రేపుతోంది. రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామి 47 కోట్ల నిధులతో ఇక్కడ ఎటిసి సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేయగా, కొంతమంది ఆ భూమి తమదేనంటూ అడ్డుకునే ప్రయత్నం చేశారు.జిల్లా కలెక్టర్ కు మార్ దీపక్ స్పందిస్తూ.. తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిని దక్కించుకోవడమే కాకుండా, దొడ్డిదారిన ఇంటి నెంబర్లు పొందారని ఘాటుగా వ్యా ఖ్యానించారు. కలెక్టర్ స్వయంగా అక్రమాలను ధృవీకరించడంతో ఇప్పుడు అందరి దృష్టి బాధ్యులపై చర్యల వైపు మళ్లింది. దాదాపు 3 ఎకరాల 36 గుంటల విస్తీర్ణం కలిగిన విలువైన ప్రభుత్వ భూమిని రియల్ వ్యాపారులు తప్పుడు పత్రాలతో ఫ్లాట్లుగా మార్చి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్లు చేసిన సబ్ రిజిస్ట్రార్, నిబం ధనలకు విరుద్ధంగా 34 ఇంటి నెంబర్లు కేటా యి ంచిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసు కోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ చేసిన వ్యాఖ్యలు కేవలం మాటలకే పరిమి తమవుతాయా లేక అక్రమార్కులపై తీసు కుని ప్రభుత్వ ఆ స్తిని కాపాడుతారా ఎదురుచూస్తున్నారు.



# బాలికలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాక్షం/నిజామాబాద్ :** కస్తూర్బాగాంధీ విద్యాలయాలు, మోడల్ స్కూల్స్‌లో చదువుకుంటున్న ప్రతి బాలికను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతూ వారి బంగారు భవిష్యత్తు కోసం బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నిర్వాహకులకు హితవు పలికారు. విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవటం, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సవాళ్లను సాధికారతతో ధీటుగా ఎదుర్కోవడం, బాలికల్లో మానసిక స్థైర్యం పెంపొందించటం, నాయకత్వ లక్షణాలను కలిగి ఉండటం తదితర అంశాలపై కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, మోడల్ స్కూల్స్ కేర్ వార్డెన్లకు విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కపిల హోటల్‌లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సందర్శించారు. 19 నుండి 23 వరకు ఐదు రోజుల పాటు ఆయా అంశాలలో అందిస్తున్న శిక్షణపై విద్యాధికారులు కలెక్టర్‌కు వివరించారు. క్షేత్రస్థాయిలో కేజీబీవీ బాలికలకు ఎదురైన పలు సున్నితమైన సమస్యలను పరిష్కరిస్తూ వారిని మానసికంగా కుంగుబాటుకు గురి కాకుండా తీసుకున్న చర్యలపై స్పెషల్ ఆఫీసర్లు ఆయా ఉదంతాలపై తెలిపారు.కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు బాలికల సామాజిక, మానసిక వృద్ధికి వికాస కేంద్రాలు దోహదపడాలని, కేవలం చదువులోనే కాకుండా అన్ని అంశాలలో విద్యార్థినులను ప్రతిభావంతులుగా తయారు చేయాలని నిర్వాహకులకు ఉద్బోధించారు. బాలికలు అనేక సమస్యలతో సతమతమవుతారని, వారి పట్ల ఆప్యాయతను చూపితే తమ ఇబ్బందులను నిర్భయంగా చెప్పుకుంటారని, తద్వారా వాటిని పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు. విద్యార్థినుల మానసిక స్థితి, ప్రవర్తనను గమనిస్తూ వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించాలని సూచించారు. బాలికలపై లైంగికపరమైన దాడులకు సంబంధించిన కేసులలో ఎక్కువగా దగ్గరి సంబంధీకులు అఘాయిత్యాలకు ఒడిగడుత్నుందున గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై ప్రతి బాలికకు పరిపూర్ణమైన అవగాహన కల్పించాలన్నారు. సానుకూల దృక్పథంతో వారు ముందుకు సాగేలా విద్యార్థి దశ నుండి వారి ఆలోచనలను తీర్చిదిద్దుకునేలా కృషి చేయాలన్నారు.



## ఎడపల్లి గురుకుల పాఠశాల వివాదం ఉపాధ్యాయురాలి రాజీనామా

**ప్రజాపక్షం/ఎడపల్లి:** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రం శివారులోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో గత కొద్ది రోజులుగా నెలకొన్న ఉద్రిక్తతలకు తెరపడింది. విద్యార్థినుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ, వారిని మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు పి.రజని తన ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేశారు. గురువారం ఆమె తన రాజీనామా లేఖను పాఠశాల ప్రిన్సిపాల్ గంగాశంకర్‌కు అందచేశారు. ఈ నెల 8వ తేదిన పాఠశాల విద్యార్థినులు పెద్ద ఎత్తున ధర్నాకు దిగడంతో ఈ ఉదాంతం వెలుగులోకి వచ్చింది. ఉపాధ్యాయురాలు రజని తరగతి గదిలో విద్యార్థినుల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని విద్యార్థినులు ఆరోపించారు. అలాగే తల్లిదండ్రులు కూడా పాఠశాలకు చేరుకొని యజమాన్యాన్ని నిలదీయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ ఘటనపై గురుకులాల కమీషనర్ స్పందించి, ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించారు. విద్యార్థినుల నుంచి స్టేట్‌మెంట్లను సేకరిస్తున్నారు.పెరిగిన ఒత్తిడి కారణంగా ఉపాధ్యాయురాలు రజని తప్పుకోవాలని నిర్ణయించుకున్నారు. ఆమె రాజీనామాను సమర్పించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో విద్యార్థినుల భద్రత, క్రమశిక్షణ, ఉపాధ్యాయుల ప్రవర్తనా నియమావళిపై కొత్త చర్చకు దారితీసింది. విద్యార్థులపై వేధింపులు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

## గ్రామ పంచాయతీకి స్థలం కేటాయించాలి



### తహసీల్దార్‌కు సిపిఐ నాయకుల వినతి

**ప్రజాపక్షం / లక్షెట్టిపేట :** లక్షెట్టిపేట మండలంలోని దౌడపెల్లి గ్రామ పంచాయతీ నూతన కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని సిపిఐ మండల కార్యదర్శి మేదరి దేవవరం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం లక్షెట్టిపేట తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత గ్రామ పంచాయతీ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, భవనం సరిగ్గా లేకపోవడంతో గ్రామసభలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో కార్యాలయ నిర్మాణం కోసం నిధులు మంజూరైనప్పటికీ, స్థలం అందుబాటులో లేకపోవడంతో పనులు నిలిచిపోయాయని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాన్ని సందర్శించి, అనువైన స్థలాన్ని కేటాయించి కార్యాలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. అలాగే గ్రామంలో కనీస సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రంలో విన్నవించారు. ఈ కార్యక్రమంలో రాచర్ల రవికుమార్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠకుల ఆదరణ 'ప్రజాపక్షం'



**ప్రజాక్షం/నిజామాబాద్ :** ప్రజాపక్షం పాఠకుల ఆదరణ పొందిందని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. ప్రజాపక్షం ప్రచురించే కథనాలతో ప్రజలు చైతన్యమవుతున్నారని పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రజాపక్షం 2026 క్యాలండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాపక్షం ప్రజల పక్షాన నిలుస్తూ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలో జరిగే సమస్యల పరిష్కారం కోసం వార్తలు, కథనాలు రాస్తూ వార్త పత్రికలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు ఎలా పొందాలో అవగాహన కల్పిస్తుందన్నారు. ప్రభుత్వానికి అధికారులకు మధ్య వారధిగా ఉంటూ సమసమాజ నిర్మాణం కోసం అడుగులు వేస్తుందన్నారు. ప్రధాన పత్రికలకు పోటీగా ప్రజాపక్షం ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజలకు అందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానన్నారు. మారుమూల ప్రాంతాలలో జరుగుతున్న సమస్యలను సైతం అధికారుల దృష్టికి తీసుకెళ్లటంలో ప్రజాపక్షం కృషి ఎనలేనిదన్నారు. దినదినాభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా స్టాఫర్ కర్క రమేష్, నాయకులు భాస్కర్‌రెడ్డి, గంగారెడ్డి, అర్బన్ రిపోర్టర్ ఉమా మహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# కేతిక సంగమేశ్వరస్వామి జాతరలో సౌకర్యాలు కలుగకుండా చర్యలు

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాఫక్షం/ సంగారెడ్డి :** మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 12 నుంచి 20 వరకు జరగనున్న ఝరా సంఘం శ్రీ కేతిక సంగమేశ్వర స్వామి జాతరను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య కోరారు. శ్రీ కేతిక సంగమేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర నిర్వహణ ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య జహిరాబాద్ శాసన సభ్యులు మాణిక్‌రావులతో కలిసి ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అదికారులు తమ తమ శాఖల ద్వారా చేపట్టనున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళా భక్తులకు ప్రత్యేకంగా అదిక సంఖ్యలో టాయిలెట్లు తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని స్నానాలకు అవసరమైన వపర్లు మంచినీటి సదుపాయాలు కల్పించాలని తెలిపారు. దేవస్థానం వరకు వెళ్లే కనెక్టివ్ రోడ్లను మరమ్మతులు చేయించి గుంతలు, పూడ్చాలని అవసరమైన చోట సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సంబందిత అధికారులకు ఆదేశించారు. జాతర ఆవరణతో పాటు దేవస్థానం పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం నిరంతరం సక్రమంగా జరిగేలా చూడాలని ఎక్కువ మంది పారిశుద్ధ్యం కార్మికులను నియమించుకోవాలని బ్లిచింగ్ ,కోరినేషన్ ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు. విద్యుత్ సరపరాలో అంతరాయం లేకుండ చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఆరోగ్య శాఖ ఆద్వర్యంలో జాతర ప్రాంతంలో వైద్య శిభిరాలు ఏర్పాటు చేసి 108 అంబులెన్స్ వాహనాన్ని అందుబాటులో ఉంచాలని తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు దేవస్థానం పరిసరాల్లో అగ్ని మాపక పరికరాలు ,సిబ్బందిని సిద్దంగా ఉంచాలని సంబందిత అధికారులకు సూచించారు. భద్రతా పరంగా గుడి లోపల ,బయట, గుడి ఆవరణలో పార్కింగ్ ప్రాంతాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని మహిళల స్నాన ప్రాంతాల్లో మహిళా పోలీస్ సిబ్బందిని నియమించాలని పోలీస్ శాఖ అధికారులకు తెలిపారు. భక్తుల రాకపోకలకు అనుగుణంగా తగినన్ని బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అదికారులను ఆదేశించారు. భక్తుల ఆహ్లాదం కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని విద్యా శాఖ అధికారికి సూచించారు. హల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడంతో పాటు దివ్యాంగ భక్తుల కోసం వీల్‌చైర్స్ అందుబాటులో ఉంచాలని జిల్లా సంక్షేమా అధికారికి తెలిపారు. దేవస్థానం వద్ద మరో సారి ఆయా అధికారులు అందరితో మీటింగ్ ఏర్పాటు చేయాలని అన్ని శాఖల అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి షిఫ్ట్ వారీగా అధికారులు వివరాలు పొందుపరచాలని కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆర్డీను ఆదేశించారు. ఎవైన సమస్యలు ఉంటే ఆర్డీఓ ,తన దృష్టికి తీసుకురావాలని దేవస్థానం ఈవోకు సూచించారు. ఈసందర్బంగా జహిరాబాద్ శాసన సభ్యులు మాణిక్‌రావు మాట్లాడుతూ ప్రతి శాఖ అధికారి తన బాద్యతలను సక్రమంగా నిర్వర్తించాలని రోజువారీ పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా జరిగేలా చూడాలని భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఫిభ్రవరి 14 నుంచి భక్తులకు రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళల స్నాన ప్రాంతాల్లో మహిళా పోలీసులను నియమించి కంట్రోల్ రూమ్‌కూడాఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.జడ్పీ సీఈఓ ,డిపిఓ జానకిరెడ్డి ,జహీరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి దేవుజా, ఆయా శాఖల అధికారులు ,ఝూరాసంగం తహసీల్దార్ దేవస్థానం, ఈవో శివ రుద్రప్ప చైర్మన్ చంద్రశేఖర్, పాటిల్, గ్రామ సర్పంచ్ వినోద తదితరులు పాల్గొన్నారు.



## బ్లాక్‌స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు: కలెక్టర్




**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రదేశాల్లో నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఆర్ అండ్ బి, పోలీస్, రవాణా, ఆర్టీసీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో జిల్లా రోడ్డు భద్రత కమిటీ, జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ గత రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలు ఏమిటని రవాణా, పోలీస్, రోడ్లు భవనాలు, మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ లను గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ప్రదేశాలలో సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద అవకాశం ఉన్న స్థలాల్లో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సుల్లో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ కరీంనగర్ జగిత్యాల రోడ్డుకు ఇరువైపులా ఆరు అడుగుల మేర చదును చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని పలుచోట్ల స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక సైన్ బోర్డులు, లైటింగ్ తదితర ఏర్పాట్లు అవసరం ఉన్నాయని, తాము సూచించిన ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం, ఆర్టీసీ డిఎం సునంద, ఏసీపీ వెంకటస్వామి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎలక్టోరల్ పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జిల్లాలో కొనసాగుతున్న ఎలక్టోరల్ పక్రియ పనితీరుపై సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. జగదేవ్‌పూర్ తహసీల్దారు కార్యాయం గురువారం కలెక్టర్ సందర్శించి ఎలక్టోరల్ మాపింగ్ పక్రియను పరిశీలించారు. జిల్లాలో కొన్ని మండలలో ఎలక్టోరల్ పక్రియ మందకోడిగా సాగుతున్నందున అధికారుల పనితీరుపై ఆమే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎలక్టోరల్ మ్యాపింగ్ వంద శాతం పూర్తి చేయాలని, అయా వార్డుల వారిగా జీపిఒలు, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఒలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రోగ్రెస్ తక్కువగా ఉన్నా పోలింగ్ స్టేషన్‌లో బిఎల్‌ఒల పనితీరును పర్యవేక్షణ చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ప్రత్యేకంగా ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అన్ని పనులను ఫీల్డ్ స్థాయిలో ఇంటింటి తనిఖీలు వేగవంతం చేయాలన్నారు. అలాగే ప్రతి రోజు చేసిన మ్యాపింగ్ వివరాలు కంప్యూటర్‌లో పొందుపర్చే పక్రియను పర్యవేక్షించారు.

## పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలి: ఎస్‌పి




**ప్రజాపక్షం/ముస్తాబాద్:** వార్షిక తనిఖీల్లో భాగంగా ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలు, వివిధ కేసులలో సీజ్ చేసిన వాహనాల వివరాలు, స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేసి, స్టేషన్ భౌగోళిక మ్యాప్ పరిశీలించి క్రైం హాట్‌స్పాట్స్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో వున్న కేసులకు క్షుణ్ణంగా రివ్యూ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై సవివరంగా అడిగి తెలుసుకుని విలేజ్ పోలీస్ అధికారి (వి పి ఓ) వ్యవస్థను పకడ్బందీగా అమలు చేస్తూ గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కి వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంతో పోలిస్తే నేరాల రేటు తగ్గుముఖం పట్టిందని,కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని తెలిపారు. పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందించారు. అధికారులతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి,సి.ఐ మొగిలి,ఎస్.ఐ గణేష్ సిబ్బంది ఉన్నారు.

## అరైవ్... అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం: ఎసిపి




**ప్రజాపక్షం/కరీంనగర్:** నగరంలోని మానేరు రివర్ ఫ్రంట్, లేక్ పోలీస్ అవుట్‌పోస్ట్ పరిధిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే ఉద్దేశంతో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, మరియు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్యామ్ పరిసర ప్రాంతాల్లో వాకర్స్ మరియు విద్యార్థులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటస్వామి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. బైక్‌లపై ముగ్గురు ప్రయాణించడం చట్టవిరుద్ధం, ప్రమాదకరం అన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, ఇతరుల ప్రాణాలకు నష్టం కలిగించకూడదన్నారు. వయసు నిండని పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. మితిమీరిన వేగం ప్రమాదాలకు ప్రధాన కారణం, కావున వేగ నియంత్రణ పాటించాలన్నారు. అనంతరం, రోడ్డు నిబంధనలను పాటిస్తామని, తోటి వారికి అవగాహన కల్పిస్తామని, ప్రమాదాల రహిత సమాజం కోసం కృషి చేస్తామని విద్యార్థులు మరియు వాకర్స్‌తో అధికారులు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాంచందర్ రావు, లేక్ పోలీస్ అవుట్‌పోస్ట్ ఆర్.ఎస్.ఐ (RSI) రమేష్, ఇతర పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



### సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/ధర్మపురి :** పేదలు, బలహీన వర్గాల సంక్షేమమే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలను అందిస్తామని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధుల, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరెలు, ఇందిరమ్మ ఇళ్ల ఇంటి నంబర్ పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళల ఆర్థిక భద్రత, గౌరవాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ఇందిరమ్మ చీరెలు పంపిణీ, మహిళా స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళలు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం, పేదల సొంత ఇంటి కలల సాకారం చేసే ఇందిరమ్మ ఇళ్ల వంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలకు అర్హులైన ప్రతీ ఒక్కరికీ వర్తింపజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంగనబట్ల దినేష్, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్,పట్టణ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మాజీ కౌన్సిలర్లు నాగలక్ష్మి, సంతోషి, అరుణ, ఐ.రామయ్య, వేణుగోపాల్, పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ పాలనలో ఎలా అభివృద్ధి చెందిందో

# ప్రజలకు విపులీకరించాలి

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో గులాబీ జెండానే ఎగరబోతుందని మెజారిటీ వార్డులను గెలవడమే లక్ష్యంగా బిఆర్ఎస్ పార్టీ ముందుకు సాగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్, సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికలపై వార్డు ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు.సిరిసిల్ల ఒకప్పుడు ఎలా ఉందో, బిఆర్ఎస్ పాలనలో ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలకు స్పష్టంగా వివరించాలని కెటిఆర్ సూచించారు. “మన పని మనమే చెప్పుకోవాలి వేరే ఎవరు చెప్పరు” అని ఆయన అన్నారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ఇక స్థానిక ఎన్నికలు ఉండవని, నేరుగా సాధారణ ఎన్నికలే ఉంటాయని పేర్కొంటూ, సిరిసిల్ల మున్సిపాలిటీ గెలవడమే కాదు – అన్ని వార్డులను బిఆర్ఎస్ కైవసం చేసుకోవాల్సిందే అని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన పేరుతో గందరగోళం సృష్టిస్తోందని మండిపడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను ఎత్తివేయాలనే కుట్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని, ఈ అంశం సిరిసిల్ల ప్రజలు, న్యాయవాదులు, మేధావుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. జిల్లాలను ఎత్తివేయడానికి సిద్ధమైన ప్రభుత్వం సెస్‌ను కూడా ఎత్తివేయడంలో ఆశ్చర్యం లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనను తుగ్లక్ తరహా నిర్ణయాల పాలనగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, రవీందర్ రావు, రామారావు, చక్రపాణి,సిద్ధం వేణు, సుభాష్, మల్లారెడ్డి, శ్రావణ్ రావు, శ్రీనివాస్, రాజారాం నాయకులు పాల్గొన్నారు.



## మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీకి మరమ్మతులు

### ‘ప్రజాపక్షం’ వార్తకు స్పందించిన మిషన్ భగీరథ అధికారులు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలో జగిత్యాల ధర్మపురి మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ లీకేజీ కావడంతో వార్డం రోజులుగా నీరు వృథా అవుతున్నాయని, ఏ నీరు ఎటు పోతే మాకేంటి మా జీతం మాకు వస్తే చాలు" అని గురువారం నాడు ‘ప్రజాపక్షం’ దినపత్రిక వార్త ప్రచురించగా స్పందించిన జగిత్యాల మిషన్ భగీరథ అధికారులు, గురువారం పైపు లైన్ లీకేజీకి మరమ్మత్తులు చేయడంతో పైపు లైన్ లీకేజీకి కృషి చేసిన ప్రజాపక్షం దినపత్రికకు పాత్రికేయునికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అభినందనలు తెలియజేశారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పరిశీలించిన సుడా చైర్మన్



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** కరీంనగర్ మార్కెట్ రోడ్డు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు దేవాలయ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ శానిటేషన్ అధికారులకు సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకుంటామని తెలిపారు. బ్రహ్మాండంగా అద్భుతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. ఆయన వెంట ఈవో సుధాకర్, చకిలం గంగాధర్, నాయకులు దన్నాసింగ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, చింతల కిషన్, జొన్నల రమేష్, గుడిపాటి రమణారెడ్డి, దాసరి నరసింహారెడ్డి, రాజాగౌడ్, లక్కిరెడ్డి, కిరణ్ తదితరులున్నారు.

## వాహనాలను భద్రంగా... బాధ్యతతో నడపాలి



### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/వేములవాడ:** ప్రతి వాహనదారుడు తమ వాహనాన్ని భద్రంగా. బాధ్యతతో నడపాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల (సడక్ సురక్ష అభియాన్) కార్యక్రమాన్ని వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ లో గురువారం జిల్లా రవాణా శాఖా ఆధ్వర్యంలో నిర్వహించగా, ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గితే హాజరై ప్రారంభించారు. ట్రాఫిక్ సిగ్నల్ రంగులలాగా సిద్ధం చేసిన బెలూన్లను, శాంతి కపోతాలను ఎగురవేసారు.రోడ్డు భద్రతకు సంబంధించిన స్టికర్లను వాహనాలకు అతికించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమని స్పష్టం చేసారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో ఇంటి పెద్ద దిక్కును కోల్పోతే ఆ కుటుంబం చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని వివరించారు. ప్రతి వాహనదారుడు ఓవర్ స్పీడ్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. ట్రాక్టర్ డ్రైవర్లు జాగ్రతగా నడపాలని పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ కు వచ్చే రహదారులకు మరమ్మత్తు చేయిస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవాలని, హెల్మెట్ ధరించని వారికి పెట్రోల్ బంక్ యజమానులు సామాజిక బాధ్యతగా పెట్రోల్ పోయవద్దని కోరారు. అనంతరం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. వాహనాలు అతివేగంగా నడపవద్దని, మొబైల్ చూస్తూ వాహనాలు నడపవద్దని, స్కూల్ ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకువెళ్ళవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రుత్విక్ సాయి,ఆర్డీఓ రాధాభాయి, జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, ఎంవీఐ వంశీధర్, ఆర్టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ రాకేశ్, సిరిసిల్ల, వేములవాడ డిపో మేనేజర్లు ప్రకాష్ రావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## బడికి వచ్చేలా పాఠ్యాంశాలపై అవగాహన

### స్తంభంపల్లి ప్రీ ప్రైమరీ స్కూల్‌ను సందర్శించిన ఇన్‌చార్జి కలెక్టర్



**ప్రజాపక్షం/ వేములవాడ /బోయిన్ పల్లి:** బుడిబుడి అడుగుల బాలలు బడికి ఆనందంగా వచ్చేలా. వారికి పాఠ్యాంశాలపై అవగాహన కలిగేలా తీర్చిదిద్దారు. బడిని పీఎంశ్రీలో భాగంగా సమగ్ర శిక్ష కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో ప్రీ ప్రైమరీ సెక్షన్లు మంజూరు అయ్యాయి. ఇందులో భాగంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశాల మేరకు బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లిలో ప్రీ ప్రైమరీ విద్యాలయానికి నూతన హంగులతో సిద్ధం చేశారు. ప్రాథమిక విద్య అంశాలపై అవగాహన వచ్చేలా వివిధ రంగులతో చిత్రాలు, పెయింటింగులు, ఫర్నిచర్ ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఆ విద్యాలయాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం సందర్శించారు. పిల్లల ఫ్రెండ్లీ చిత్రాలు, పెయింటింగ్ లు, ఫర్నిచర్ ఏర్పాటు చేయగా ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. ఎందరు విద్యార్థులు చదువుతున్నారు? ఏమి ఏమి నేర్పిస్తున్నారో ఆరా తీశారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలోని పదమూడు మండలాల్లో ప్రీ ప్రైమరీ తరగతులు కొనసాగుతున్నాయి. అనంతరం అదే ఆవరణలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సైన్స్ కు సంబంధించిన పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వార్షిక పరీక్షలకు ప్రణాళిక ప్రకారం సిద్ధం కావాలని సూచించారు. ఈ స్కూళ్లో విద్యార్థుల అడ్మిషన్లు పెంచేలా కృషి చేయాలని టీచర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ వినోద్ కుమార్, తహసిల్దార్ నారాయణరెడ్డి, ఎంపీఓ శ్రీధర్, డీఈఓ కార్యాలయ అధికారి శైలజ, సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

## ఫిబ్రవరి చివరి నాటికి సోలార్ విద్యుత్ ఉత్పత్తి

### మంథనిలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లాలో సహకార సంస్థల ఆధ్వర్యంలో చేపడుతున్న పీఎంకుసుమ్ సోలార్ ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచాలని,ఫిబ్రవరి నెలాఖరు లోగా గ్రిడ్ కు అనుసంధానం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.గురువారం మంథని మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మంథని మండలం కన్నాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నాగారం గ్రామంలో ఎంపిపిఎస్, పీ.హెచ్.సి సబ్ సెంటర్, గుంజపడుగు గ్రామంలో నిర్మాణంలో ఉన్న పీ.హెచ్.సి భవనం, జడ్పీహెచ్ఎస్,1 మెగా వాట్ సోలార్ ప్లాంట్ నిర్మాణం,మంథని లోని ఆర్డీఓ కార్యాలయ నిర్మాణ పనులు,జడ్పీహెచ్ఎస్ బాలికలు, బుట్టుపల్లి లోని ఆర్ అండ్ ఆర్ పనులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ కన్నాల పాఠశాలలో ప్రహరి గోడ, గేట్ ఏర్పాటు, మైనర్ మరమ్మత్తు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నాగారం గ్రామంలోని పాఠశాలలో మంజూరు చేసిన పనులు,సబ్ సెంటర్ నిర్మాణ పనులు నెల రోజుల్లో లోగా పూర్తి చేయాలని అన్నారు. గుంజపడుగు జడ్పీహెచ్ఎస్ లో మంజూరు చేసిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. గుంజపడుగు లో ఫ్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసే సోలార్ ప్లాంట్ పనులు పూర్తి చేసి ఫిబ్రవరి చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మాల, రెడ్కో జిల్లా మేనేజర్ దురిశెట్టి మనోహర్, కేడీసీసీ బ్యాంకు సీఈఓ సత్యనారాయణ రావు, ఎంపిడిఓ శ్రీజ, తహశీల్దార్ అరీఫోద్దిన్, ఏడీఈ వెంకటనారాయణ, రెడ్కో డిఓ మునీందర్, ఏడీఓ లక్ష్మీ కాంత్,గ్రీన్ సెక్యూర్ రమాకాంత్, ఏఈ పిఆర్అనుదీప్, విక్రమ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


### కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్ష/జగదేవ్‌పూర్:** పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నభోజనం అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి నిర్వహకులను ఆదేశించారు. మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలోని గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్యాభోజనం ప్రక్రియను ఆకస్మికంగా తనీఖి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వండిన భాగరా అన్నం, ఆలుగడ్డ, చిక్కుడు టామాటా మిక్స్ కూరలను పరిశీలించారు. అనంతరం ఆమే మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహకులు విద్యార్థులకు వడ్డించే క్రమంలో వారికి సరిపోయెంత కూరను పెట్టాలని సూచించారు. కామన్ డైట్ మెనూ తప్పకుండా పాటించాలన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు కూర్చున్నచోటకు వెల్లి అన్నం,కూర వడ్డించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. పిల్లలకు చదువు, మధ్యాహ్న భోజనంలో రాజీ పడోద్దని ఉపాధ్యాయులకు సూచించారు. భోజన విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే వేటు తప్పదని హెచ్చరించారు.



## నిరుద్యోగ యువత కోసం హరీషన్న ఉద్యోగ యాప్ రూపకల్పన

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి 57 రకాల పోటీపరీక్షలకు సిద్ధం చేసేలా యాప్




**ప్రజాపక్షం/సిద్దిపేట :** నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు సిద్దిపేట ఎమ్మెల్యే,మాజీ మంత్రి హరీష్‌రావు సరికొత్త ఆప్‌ను రూపొందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 57 రకాల పోటీ పరీక్షలకు సిద్ధం చేసేలా హరీష్ అన్న ఉద్యోగ యాప్‌ను రూపొందించారు. ఇందులో 2వేల గంటల వీడియో రికార్డింగ్ పాఠాలు. 400 నమూన ప్రశ్నాపత్రాలు ఉంటాయి. ఆన్‌లైన్ వేదికకు శుక్రవారం రోజున సిద్దిపేట యువత కోసం ఉచితంగా తరగతులు వీక్షించే సదుపాయాన్ని ప్రారంభించనున్నారు. సిద్దిపేట నిరుద్యోగ యువత కోసం తన స్వంత ఖర్చులతో యాప్‌ను రూపొందించారు. గత ప్రభుత్వం హరీష్ రావు గ్రూపు 1, గ్రూపు 2 పోలీస్ కానిస్టేబుల్, టెట్, ఉపాధ్యాయ ఇలా ఉచితంగా కోచింగ్ ఇప్పించారు. ఏంతో మంది యువతకు ఉద్యోగాలు వచ్చాయి. అదే స్ఫూర్తితో నేటి సాంకితికత పెరగటం, అదేవిధంగా హైదరాబాద్‌కు వెళ్లి కోచింగ్ సెంటర్‌లో కోచింగ్ తీసుకోవటం, రూమ్ కిరాయి, ఇలా ఒక్కోయువతకు సుమారు 50 వేల ఖర్చు ఏసి ఏన్నో వ్యయ ప్రయాసాలు పడుతున్న దృష్ట్యా, హరీష్‌రావు యువత ఇంటి వద్ద ఉండి ఉచితంగా కోచింగ్ తరహాలో ఆన్‌లైన్ క్లాసులు వినేవీలుగా ఈ ఉద్యోగ యాప్‌ను ఏర్పాటుకు సంకల్పించనున్నారు. దీంతో ఏంతోమంది పేద విద్యార్థులకు మేలుజరుగుతుందన్నారు. నిరుద్యోగులకు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం సంస్థల ఉద్యోగాల సమాచారం తెలియని పరిస్థితి నెలకొంది. సందేహాల నివృత్తికి సమాయాన్ని నిర్దేశిస్తారు. రీజనింగ్, అర్థమేటిక్, ఆంగ్లం కరెంట్ అఫైర్లు, చరిత్ర,రాజనీతి, ఆర్థిక. భౌగొలిక తదితర ముఖ్యమైన సబ్జెక్టుల పాఠాలుంటాయన్నారు. తెలుగు, ఆంగ్ల భాషాలో చూసే సదుపాయం కల్పిస్తున్నారు. ఉద్యోగ ప్రకటనలు ప్రదర్శిస్తారని, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ సైతం ఇందులో ఎప్పటికప్పుడు సమాచారం ఉండేలా ఈ యాఫ్‌లో పొందపర్చినట్లు తెలిపారు.

# ప్రిక్వార్టర్స్‌కు సింధు, శ్రీకాంత్

## ప్రణయ్, జార్జి నిష్క్రమణ



**జకర్తా:** ఇండోనేషియా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగు షట్లర్లు పివి సింధు, కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్ విఘ్నాలను దాటి ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నారు. ఇటీవలే ముగిసిన ఇండియా ఓపెన్‌లో నిరాశపరిచిన సింధు.. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో 22–20, 21–18తో ఐదో సీడ్ మనామి సుయిజు (జపాన్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్లో శ్రీకాంత్.. 21–15, 21–23, 24–22తో కొకి వతనబె (జపాన్)తో జరిగిన హోరాహోరీ పోరులో విజయం సాధించాడు.
లక్ష్యసేన్.. 21–13, 16–21, 21–14తో వాంగ్ జు వీ (తైవాన్)ను మట్టికరిపించాడు. కానీ సీనియర్ షట్లర్లు కిరణ్ జార్జి 17–21, 14–21తో ఉబైదుల్లా (ఇండోనేషియా) చేతిలో ఓడగా, హెచ్ఎస్ ప్రణయ్ 19–21, 11–21తో లీ జి జియా (మలేషియా) కు తలవంచాడు. మహిళల సింగిల్స్‌లో సింధుతో పాటు అన్‌మోల్ ముందంజ వేయగా తన్వి శర్మ, ఆకర్షి కశ్యప్ తొలి రౌండ్‌కే ఇంటిబాట పట్టారు.

# వరల్డ్ కప్‌లో ఆడేందుకు ఇండియా వెళ్లడం లేదు: బంగ్లాదేశ్



**ఢాకా:** టి–20 వరల్డ్ కప్ వేదికలను మార్చడానికి ఐసిసి నిరాకరించడంతో.. ఆ టోర్నీను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బహిష్కరించింది. ఫిబ్రవరి 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వరల్డ్ కప్‌లో ఆడేందుకు ఇండియా వెళ్లడం లేదని బంగ్లా క్రికెట్ బోర్డు పేర్కొన్నది. గురువారం ఢాకాలో క్రికెట్ బోర్డు, జాతీయ క్రికెటర్లు, క్రీడామంత్రి ఆసిఫ్ నజ్రుల్ మధ్య జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. ఆటగాళ్ల భద్రతకు సమస్య లేదని ఐసిసి పేర్కొన్నా .. ఇండియాలో ట్రావెల్ చేసేందుకు బిసిబి నిరాకరిస్తున్నది. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరగడంతో.. ఐపిఎల్లో ఆడుతున్న ముస్తఫిజుర్ను తొలగిస్తూ బిసిసిఐ నిర్ణయం తీసుకున్నది. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బంగ్లా క్రికెటర్లు ఇండియాలో పర్యటించేందుకు నిరాకరిస్తున్న విషయం తెలిసిందే. వేదికల మార్పు విషయంలో ఐసిసి తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని నజ్రుల్ పేర్కొన్నారు. ఇండియాకు వెళ్లవద్దు అని తమ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. అయితే తమ మ్యాచ్‌లను శ్రీలంకలో ఆడేందుకు తమకు ఐసిసి అవకాశం ఇస్తుందని ఆశిస్తున్నామని ఆయన అన్నారు. వరల్డ్ కప్‌లో భాగంగా బంగ్లాదేశ్ జట్టు ఇండియాలో నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నది. మూడు కోలకత్తాలో, ఒకటి ముంబై వేదికగా ఆ మ్యాచ్‌లు షెడ్యూల్లో ఉన్నాయి. ఒకవేళ బంగ్లా రాకపోతే ఆ జట్టు స్థానంలో స్కాట్ల్యాండ్ ఆడే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

## జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో

# సత్తాచాటిన తెలంగాణ ప్లేయర్లు




గువాహటి వేదికగా జరిగిన జాతీయ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తెలంగాణ కరాటే ప్లేయర్లు సత్తాచాటారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు జరిగిన టోర్నీలో తెలంగాణ టీమ్ మొత్తం 34 పతకాలు సొంతం చేసుకుంది. ఇందులో 12 స్వర్ణాలు సహా 13 రజతాలు, 9 కాంస్య పతకాలు ఉన్నాయి. తెలంగాణ ప్లేయర్లు కాటా, కుమిటే వ్యక్తిగత, టీమ్ ఈవెంట్లలో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. అండర్10, 12, 14, 18 వయసు విభాగాల్లో యువ ప్లేయర్లు ప్రతిభ చాటగా, సీనియర్లు ఆకట్టుకున్నారు.

# రోహిత్‌కు డాక్టరేట్



**పుణె:** టీమ్ ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మకు గౌరవ డాక్టరేట్ హోదా దక్కింది. తన నాయకత్వ శైలికి తోడు క్రికెట్‌కు చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా అజింక్యా డివై పాటిల్ యూనివర్సిటీ.. రోహిత్‌కు డాక్టరేట్‌తో సత్కరించింది. బుధవారం జరిగిన కాన్వకేషన్ కార్యక్రమంలో హిట్‌మ్యాన్‌కు ఈ పట్టాను ప్రదానం చేసింది. 'క్రికెట్‌లో అభిమానులందరికీ రోహిత్..హిట్‌మ్యాన్‌గా పరిచయం. కానీ అతని కెరీర్లో డాక్టరేట్ సరికొత్త మైలురాయిగా నిలుస్తుంది' అని యూనివర్సిటీ ఒక ప్రకటనలో పేర్కొంది.

# కీళ్ల నొప్పులు సామాన్యం..



వృద్ధాప్యంలో చాలా మంది ఎదుర్కొనే సాధారణ ఆరోగ్య సమస్యల్లో కీళ్ల (రుమాటిక్) నొప్పులు ఒక ముఖ్యమైనవి. మోకాళ్లు, నడుము, మెడ, భుజా లు, వేళ్ల వంటి సంధుల్లో వచ్చే ఈ నొప్పులు క్రమంగా రోజువారీ జీవనాన్ని ప్రభావితం చేస్తాయి. వయస్సు పెరిగే కొద్దీ శరీరంలో జరిగే మార్పులు, జీవనశైలి, పోషక లోపాలు కలిసి ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. రుమాటిక్ నొప్పులను సకాలంలో అర్థం చేసుకుని సరైన జాగ్రత్తలు తీసుకుంటే, సౌకర్యవంతమైన జీవితం గడపగలగడం సాధ్యమే.కీళ్ల నొప్పులు అనేవి ప్రధానంగా సంధులు, కండరాలు, నరాల వ్యవస్థను ప్రభావితం చేసే నొప్పుల సమాహారం. ఇవి ఒక్కసారిగా రావచ్చు లేదా సంవత్సరాల పాటు మెల్లగా పెరుగుతూ ఉండవచ్చు. కొంత మందిలో ఉదయం లేవగానే కాళ్లు చేతులు గట్టిగా ఉండటం, కదలడానికి ఇబ్బంది కలగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మరికొందరిలో వాతావరణ మార్పులతో నొప్పులు ఎక్కువవుతుంటాయి. రుమాటిక్ పెయిన్స్‌కు ప్రధాన కారణాల్లో వయస్సు పెరగడం ఒకటి. కాలక్రమంలో సంధుల్లో ఉండే కార్టిలేజ్ అరిగిపోవడం వల్ల ఎముకలు ఒకదానికొకటి రాయడం మొదలవుతుంది. దీని వల్ల నొప్పి, వాపు ఏర్పడతాయి. హార్మోన్ల మార్పులు కూడా ముఖ్యపాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా మహిళల్లో మెనోపాజ్ తర్వాత ఎముకల సాంద్రత తగ్గిపోవడం వల్ల నొప్పులు పెరుగుతాయి. కాగా, శరీరంలో దీర్ఘకాలిక వాపు ఉండటం మరో కారణం. రుమాటాయిడ్ ఆర్థ్రైటిస్ వంటి వ్యాధుల్లో శరీర రోగ నిరోధక వ్యవస్థనే సంధులను దెబ్బతీస్తుంది. దీర్ఘకాలం శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, పాత గాయా లు, పోషకాహార లోపాలు కూడా రుమాటిక్ నొప్పులకు దారితీస్తాయి. చలికాలం, తేమ ఎక్కువగా ఉండే వాతావరణం ఈ నొప్పులను మరింత తీవ్రతరం చేస్తాయి.

**కనిపించే లక్షణాలు...** వృద్ధుల్లో సాధారణంగా ఉదయం లేవగానే సంధులు కదలకపోవడం, కొంతసేపటికి కదలిక సులభమవడం కనిపిస్తుంది. మోకాళ్లలో నొప్పి వల్ల నడవడంలో ఇబ్బంది, మెట్లు ఎక్కడం దిగడం కష్టంగా అనిపించడం సాధారణం. వేళ్ల సంధుల్లో వాపు, పట్టుదల తగ్గిపోవడం, కొన్నిసార్లు స్వల్ప జ్వరం, అలసట కూడా తోడవుతాయి. నొప్పి ఎక్కువగా ఉన్నప్పుడు నిద్ర భంగం కావడం వల్ల మానసిక ఒత్తిడి పెరుగుతుంది.

**ఉపశమన మార్గాలు...** రుమాటిక్ నొప్పులను పూర్తిగా నివారించడం సాధ్యంకాకపోయినా, సరైన జీవనశైలి ద్వారా వాటి తీవ్రతను తగ్గించుకోవచ్చు. రోజూ తేలికపాటి వ్యాయామం చేయడం చాలా ముఖ్యం. నడక, యోగా, నీటిలో చేసే వ్యాయామాలు సంధులపై ఒత్తిడి తగ్గించి కదలిక ను మెరుగుపరుస్తాయి. దీర్ఘకాలం ఒకే స్థితిలో కూర్చోవడం లేదా నిలబడడం తప్పించాలి.



చల్లని వాతావరణంలో మోచేతులు, మోకాళ్లు, చేతివేళ్లను వెచ్చగా ఉంచుకోవడం అవసరం. నొప్పి ఉన్న ప్రాంతాల్లో వేడి నీటి కాపు లేదా గోరువెచ్చని నూనెతో మర్దన ఉపశమనాన్ని ఇస్తుంది. బరువును నియంత్రించడం కూడా ముఖ్యం. అధిక బరువు మోకాళ్లు, నడుముపై అదనపు ఒత్తిడిని పెంచుతుంది. అవసరమైతే వైద్యుల సలహాతో నొప్పి నివారణ మందులు, ఫిజియోథెరపీ తీసుకోవచ్చు.

**ఆహారం...** కీళ్ల నొప్పుల నియంత్రణలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. ఎముకలు, సంధులు బలంగా ఉండేందుకు కాల్షియం, విటమిన్ 'డి' అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి. పాలు, పెరుగు, నువ్వులు, ఆకుకూరలు, సూర్యకాంతి ఈ విషయంలో ఉపయోగపడతాయి. వాపును తగ్గించే ఆహారం కూడా ముఖ్యం. పసుపు, అల్లం వంటి సహజ పదార్థాలు శరీరంలోని వాపును తగ్గించడం లో సహాయపడతాయి. మూడు కొవ్వు ఆమ్లాలు ఉన్న ఆహారం సంధుల నొప్పిని తగ్గించడంలో ఉపయోగపడుతుంది. చేపలు, వాల్‌నట్స్, అవిసె గింజలు ఇందుకు ఉదాహరణ. అధిక చక్కెర, నూనె, ప్రాసెస్డ్ ఆహారాలను తగ్గించాలి. ఇవి శరీరంలో వాపును పెంచుతాయి. తగినంత నీరు తాగడం వల్ల సంధుల్లో తేమ నిలిచి కదలిక సులభమవుతుంది. కాగా, నొప్పితో కూడిన జీవితం వృద్ధుల్లో నిరాశను, ఒంటరితనాన్ని పెంచుతుంది. అందుకే మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా చూసుకోవాలి. కుటుంబ సభ్యులతో మాట్లాడటం, తేలికపాటి కార్యకలాపాల్లో పాల్గొనడం, ధ్యానం వంటి పద్ధతులు మనసుకు శాంతిని ఇస్తాయి.

**వైద్యుల సలహా తప్పనిసరి...** నొప్పులు రోజురోజుకూ పెరుగుతూ ఉంటే, సంధుల్లో తీవ్ర వాపు లేదా ఆకృతి మార్పులు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. స్వీయ మందులు వాడటం వల్ల సమస్య తీవ్రమయ్యే అవకాశం ఉంటుంది. సరైన నిర్ధారణతోనే సరైన చికిత్స సాధ్యమవుతుంది. వృద్ధుల్లో రుమాటిక్ నొప్పులు సాధారణమైనప్పటికీ నిర్లక్ష్యం చేయాల్సిన సమస్య కాదు. సరైన ఆహారం, నియమిత వ్యాయామం, జీవన శైలి మార్పులు, మానసిక ధైర్యం ఉంటే ఈ నొప్పులను చాలావరకు నియంత్రించవచ్చు. వృద్ధాప్యం నొప్పులతోనే కాకుండా, సౌకర్యంగా గడపడానికి ముందస్తు జాగ్రత్తలు అత్యంత అవసరం.




## 82 ఏళ్ల వయసులో ఫిట్‌నెస్ కోసం వ్యాయామం

చెన్నైకు చెందిన 82 ఏళ్ల వృద్ధురాలు, వయస్సు అనేది ఆరోగ్యానికి అడ్డంకి కాదని నిరూపిస్తూ నేటితరానికి ఒక గొప్ప పాఠం చెబుతోంది. ఆమె పేరు కిరణ్ బాయి. చీర కట్టుకుని, చెప్పులు లేకుండా, ఇంటి ప్రాంగణంలోనే డెడ్‌లిఫ్ట్‌లు, స్క్వాట్లు చేస్తూ ఆమె సోషల్ మీడియాలో వైరల్ అయ్యారు. మనవడు చిరాగ్ చోర్డియా ఆమెతో కలిసి చేసిన వ్యాయామ వీడియోలను పంచుకోవడంతో, కిరణ్‌బాయి ఫిట్‌నెస్ ప్రేరణగా మారారు. 2020లో కిరణ్ బాయి మంచం మీద నుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లకు బలమైన దెబ్బ తగిలింది. ఆ సమయంలో చాలామంది ఆమె ఇక విశ్రాంతి జీవితం గడపాల్సిందే అనుకున్నారు. ఆ సమయంలో ఆమె మనవడు చిరాగ్ చోర్డియా తనఅమ్మమ్మ దగ్గరకు వచ్చాడు. ఆమె జీవితాన్ని చురుకుగా మార్చాలన్న లక్ష్యంతో, ఇంట్లోనే ఒక చిన్న వ్యాయామ కేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. ఆమె వయస్సు, ఆరోగ్య స్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా వ్యాయామ ప్రణాళికను రూపొందించాడు. వ్యాయామం వల్ల ఆమె కేవలం శారీరకంగా బలపడడమే కాదు, మానసికంగా కూడా ధైర్యం పొందారు. ఈరోజు కిరణ్ బాయి కేవలం అనామక వృద్ధురాలు కాదు... ఆమె ఒక స్ఫూర్తి.



# విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న పాలకులు

## దేశ సమగ్రత, విద్యారంగ సమస్యలపై సమరశీల ఉద్యమాలు
## ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్ పిలుపు
## అట్టహాసంగా జరిగిన ఎఐఎస్ఎఫ్ ములుగు జిల్లా 2వ మహాసభలు




**ప్రజాపక్షం/ములుగు :** సమాజానికైనా అవసరమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ నైతిక విజ్ఞానిక మానవీయ విలువలు ఇచ్చే సాధన విద్య అని, ఆ విద్యను నేటి పాలకులు భ్రష్టు పటిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్ ఆరోపించారు. గురువారం ములుగు జిల్లా కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా 2వ మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం నుంచి డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు విద్యార్థుల భారీ ప్రదర్శన నిర్వహించారు. మహాసభ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎఐఎస్ఎఫ్ శ్వేతారుణ పతకాన్ని స్టాలిన్ ఆవిష్కరించారు. అనంతరం నారా దిలీప్, అనుముల రాజ్‌కుమార్‌ల అధ్యక్షవర్గంగా జరిగిన ప్రతినిధుల మహాసభలో స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తున్నాయని దుయ్యబట్టారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారన్నారు. దానిలో కేంద్రంలోని బిజెపి నూతన జాతీయ విద్యావిధానం పేరుతో విద్య కార్పొరేటీకరణ, విద్య కేంద్రీకరణ, కాషాయికరణ చూస్తుందని, విద్యారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు స్వాగతం పలుకుతోందన్నారు. ములుగు జిల్లాలో ఉన్న గిరిజన యూనివర్సిటీకి నిధుల కేటాయింపులు పూర్తి స్థాయిలో జరగలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితిలో ఉందన్నారు. జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు కాలేదన్నారు. సమస్యల సుడిగుండంలో ప్రభుత్వ హాస్టళ్లు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు. నిధులు విడుదలపై ఉప ముఖ్యమంత్రి ఇచ్చి హామీకి కూడా గ్యారంటీ లేకపోవడం విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి విద్యార్థి లోకాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహాసభలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్, జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, నాయకులు నేరాళ్ళ జోసెఫ్, నారా దిలీప్, అనుముల రాజ్‌కుమార్, దుర్గం శివకుమార్, కుమ్మరి రంజిత్, కొండగోర్ల సాయి కుమార్, చెన్నూరి రామ్‌చరణ్, జాడి మహేష్, సునర్కని రణధీర్, చీల దేవేందర్, బోడ సాయి, కృష్ణ, రమ్య, సౌజన్య పాల్గొన్నారు.

## ర్యాలీలో పాల్గొన్న సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ

మేడారం సమ్మక్క సారలమ్మ సందర్శన, పర్యటనకు వెళుతున్న సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ జిల్లా కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యార్థుల ర్యాలీ ప్రదర్శనను చూసి ఆగి సందర్శించి మద్దతు పలికి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు విజయ సారధి, పంజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.




# కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేయాల్సిందే



## కాంట్రాక్టు ఏజెన్సీల ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** కాంట్రాక్టు కార్మికులను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇలాంటి ఉద్యోగ భద్రత లేకుండా శ్రమ, ఆర్థిక దోపిడికి గురి చేసే కాంట్రాక్టు ఏజెన్సీల వ్యవస్థను రద్దు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఉమ్మడి జిల్లా కమిటీ నేతృత్వంలో రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని యూనియన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆసుపత్రి వివిధ రంగాల కార్మికుల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం సాధించిన మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేటేశ్వర్‌రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యరంగంలో దశాబ్దాల తరబడి శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ సూపర్‌వైజర్ కార్మికులు థర్డ్ పార్టీ ఏజెన్సీల కింద ఎలాంటి ఉద్యోగ భద్రతలకు నోచుకోకుండా వైద్యరంగంలో ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తున్నారన్నారు. ఏజెన్సీల విధానం ద్వారా కార్మికులకు జీతాల చెల్లింపుల్లో పారదర్శకత లేదని యూనియన్ పోరాటాలు బలంగా ఉన్నచోట మాత్రమే జీవోలు అమలవుతున్నాయన్నారు. కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.15 లక్షలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, కాలవ్యవధి ముగిసిన ఏజెన్సీలను రద్దు చేసి తక్షణమే కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్, కార్మికులు బి.చెన్నయ్య, దేవానంద్, రంగయ్య, శంకర్‌నాయక్, గోపాల్‌నాయక్, రాజు, అంజిలయ్య, మురళి, నైసన్, భీమయ్య, యాదయ్య, ఖాదర్, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, బాల్‌రాజ్, నరేష్, చిన్నయ్య, అంజి, పద్మమ్మ, లక్ష్మమ్మ, యాదమ్మ, మీనా, అలివేల, మమత, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మోదీ పాలనలో పెరుగుతున్న నిరుద్యోగం

## ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్‌కుమార్ సిన్హా
## ఎఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దేశంలో ప్రధాని మోదీడీ బిజెపి పాలనలో నిరుద్యోగ తీవ్రత రోజు రోజుకు పెరుగుతుందని ఆలిండియా యూత్ ఫెడరేషన్ (ఎఐవైఎఫ్) జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా ఆరోపించారు. గురువారం ఎఐవైఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల ఫోటోలతో, నిరుద్యోగుల డిమాండ్స్‌తో రూపొందించిన 2026 క్యాలెండర్‌ను రోషన్‌కుమార్ సిన్హా, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా నాయులు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చింతల రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో రోషన్‌కుమార్ సిన్హా మాట్లాడుతూ దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి, ఉద్యోగ క్యాలెండర్‌ను అమలు చేసి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్ శ్రీమాన్, ఖమ్మంజిల్లా సహాయకార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, నాయకులు చిర్రా ఉపేందర్, దాసరి బన్ను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# సిపిఐలోకి పలువురు యువకుల చేరిక



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** యువతతోనే దేశాభివృద్ధి ఆధారపడి ఉందని, సిపిఐలో చేరేందుకు యువత ముందుకు రావడం అభినందనీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్(పాల్వంచ)కు చెందిన పలువురు యువకులు కూనంనేని, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా సమక్ష్యంలో గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్‌లో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో చేరిన యువత వారివారి ప్రాంతాల్లో సమస్యలపై అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి పాటుపడాలని, సమస్యకు పరిష్కార మార్గం చూపిన నాడు ఓ కమ్యూనిస్టుగా పొందే సంతృప్తి వేరుగా ఉంటుందని తెలిపారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ తీసుకునే నిర్ణయానుసారంగా పని చేయాలని, అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కె.రవీంద్రబాబు, జి.ప్రశాంత్, పి.మధు, సిహెచ్.సాయికిరణ్, కె.హుస్సేన్, కె.శివప్రసాద్, కె.నాగేంద్రబాబు, కె.సతీష్, కె.మోహన్, ఎం.జంపన్నల ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువకులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

## ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో నిర్వహించిన ఎఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల విషయంలో, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని దీని కారణంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల విడుదలపై ఇచ్చిన హామీకి కూడా గ్యారెంటీ లేకపోవడం విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బకాయిలో ఉన్న ఫీజులను అన్నింటిని విడుదల చేసి విద్యార్థి లోకాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి తమ్మునబోయిన నరేష్, నాయకులు గడ్డం నాగరాజు, నెల్లూరు శివ, గడ్డం వినయ్, జి.సురేష్, ఎస్.నరేష్ పాల్గొన్నారు.



# ప్రమాదరహిత సమాజాన్ని నిర్మించుకుందాం

రోడ్డు భద్రత నియమాలు పాటించడం ప్రతీ ఒక్కరి బాధ్యత : కూనంనేని




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించుకుందామని, రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ప్రతీ ఒక్కరి బాధ్యతగా భావించాలని శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం కొత్తగూడెం డిఎస్‌పి ఆధ్వర్యంలో మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అరైవ్, అలైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పోలీసులు ప్రమాదరహిత సమాజం కోసం చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు బాగున్నాయని, రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యతే కాదని, ఇది అందరి సమిష్టి బాధ్యత అన్నారు. వాహనాలు నడిపే క్రమంలో తప్పని సరిగా నియమాలు పాటించాలని హెల్మెట్, సీటు బెల్టులు ధరించాలని, మితిమీరిన వేగాన్ని తగ్గించి వాహన సామర్ధ్యానికి అనుగుణంగా రోడ్లపై నడపాలని సూచించారు. వాహనాలు వేగంగా నడపడం ద్వారా అనుకోని ప్రమాదాలు జరిగితే నియంత్రించడం కష్ట తరంగా ఉంటుందని, తద్వారా ప్రాణాల మీదికి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.మధ్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడుతున్నారని, తద్వారా వారి కుటుంబ సభ్యులు అనాధలుగా మారుతున్నారని చెప్పారు. ప్రతీ ప్రాణం విలువైందే అని, దీనిని గమనంలోనికి తీసుకుని ప్రవర్తించాలని చెప్పారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించి ఎదుట వారిని ఇబ్బందుల పాలు చేయరాదని, ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని కూనంనేని సూచించారు. కొత్తగూడెంలో ట్రాఫిక్ నియంత్రణకు త్వరలో రూ.45 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరలో చేపడుతున్నట్లు చెప్పారు. అదే విధంగా పట్టణంలోని ప్రధాన ఇరుకు రోడ్లను అనువుగా మార్చేందుకు సింగరేణి సౌజన్యంతో రోడ్ల వెడల్పు కార్యక్రమంతోపాటు మరమ్మత్తులు చేయబోతున్నట్లు చెప్పారు. ప్రజల భద్రత, రక్షణ కోసం అనునిత్యం పనిచేస్తున్న పోలీసులను ఎంఎల్‌ఏ అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, 2 టౌన్ సిఐ ప్రతాప్, 3 టౌన్ సిఐ శివప్రసాద్, లక్ష్మీ దేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్, ఎస్సై విజయకుమారి, పట్టణ వ్యాపారులు, స్థానికులు, ప్రముఖులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## శాశ్వత మార్కెట్ పనులు ప్రారంభించాలి



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యాసా నరేష్ పత్తి జూలూరుపాడు ఉప మార్కెట్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తెల్ల బంగారానికి నిలయమైన జూలూరుపాడు శాశ్వత మార్కెటు పనులను త్వరగా ప్రారంభించాలని, ఒకనాడు సిపిఐ (ఎం) పోరాట ఫలితంతో అధికారులు సబ్ మార్కెట్‌ను ఏర్పాటు చేసి గత సంవత్సరం దాకా జెండా పాట నిర్వహించి పత్తి కొనుగోలు కొనసాగించారని కానీ ఈ సంవత్సరం సీజన్ ప్రారంభ దశలో ప్రభుత్వం పత్తి మార్కెట్‌ను శాంక్షన్ చేసి నిధులు కేటాయించి టెండర్లు పిలవగా టెండర్ దక్కించుకున్న గుత్తేదారు నేటికీ మూడు నెలలు అవుతున్నా పనులు ప్రారంభించలేదని తక్షణమే మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించాలని అన్నారు. లేని యెడల వేలాదిమందికి హమాలీలకు జీవనాధారమైన జూలూరుపాడు మార్కెట్ పరిసర ప్రాంతాల రైతాంగానికి సౌలభ్యంగా ఉన్న మార్కెట్ పనులు ప్రారంభించక పోతే ఈ ప్రాంతంలో రైతులు, హమాలీలను కలుపుకొని సిపిఐ(ఎం) పార్టీ పోరాటానికి సిద్ధమవుతుందని పనులు ప్రారంభించే అంతవరకు రానున్న కాలంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసనలకు పిలుపుని ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు గార్లపాటి వెంకటి. బోడ అభిమిత్ర. పార్టీ శాఖ కార్యదర్శి ఇల్లంగి సీతారాములు. హమాలీ మేస్త్రిలు పోతురాజు, బోడయ్య, జాన్, మేస్త్రీ సుందరం, మేస్త్రీ హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## కమిషనర్, సిబ్బంది సేవలు మరువలేనివి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శత వసంతాల ఈనెల 18 నుంచి 21 వరకు జరిగిన కార్యక్రమాల సందర్భంగా ప్రజలకు ఎటువంటి అంతరాయం కలుగకుండా, పారిశుద్ధ్యానికి ఇబ్బందులు లేకుండా మున్సిపల్ కమిషనర్‌తో పాటు సిబ్బంది అందించిన సేవలు మరువలేనివని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లైమెంట్ తెలిపారు. ఈనెల 18న పెద్ద సంఖ్యలో ప్రజలు బహిరంగ సభకు తరలి వచ్చారని ఈ సందర్భంగా నిర్వహించిన ప్రదర్శన, బహిరంగ సభ సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారని ఆయన తెలిపారు. సభ అనంతరం కూడా పారిశుధ్య పనులు చేపట్టి నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూశారని ఆయన తెలిపారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పువ్వాడ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## కృష్ణారెడ్డి కుటుంబానికి అండగా బిఆర్ఎస్



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల పరిధిలోని గాదెపాడులో గుండెపోటుతో మృతి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు దాచేపల్లి కృష్ణారెడ్డి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామా నాగేశ్వరరావు అన్నారు. మృతుడు కృష్ణారెడ్డి స్వగ్రామమైన గాదెపాడుకు వారిద్దరు వేరువేరుగా చేరుకొని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

## గిరిజన నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** నిరుద్యోగులైన గిరిజన యువతీ యువకులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని ప్రభుత్వ రంగ సంస్థలలో జీవనోపాధి పెంపొందించుకోవడానికి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోని జీవితాల్లో స్థిరపడాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గురువారం ఐటిడిఏ ప్రాంగణంలోని వైటిసిలో గిరిజన యువతీ యువకులకు గెస్ట్ సర్వీస్ అసిసోయేట్, ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ సర్వీస్ ఎలక్ట్రీషియన్ శిక్షణ అందిస్తున్న కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అక్కడ శిక్షణ పొందిన వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంది వచ్చే అవకాశాలను ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. 60 రోజులపాటు జరిగే ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవితాల్లో స్థిరపడాలని సూచించారు. పనిచేసే ప్రదేశంలో ఓపిక చాలా అవసరమని, హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. అనంతరం ఈ నెల 27న జరిగే ఎస్ఆర్ సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి గిరిజన భవన్ వద్ద పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు, జేడిఎం హరికృష్ణతో పాటు తదితరులున్నారు.

## సామాజిక సేవలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకం

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** జాతీయ సేవా పథకంలో భాగంగా గ్రామాలను సందర్శించి సామాజిక సేవ అందించడంలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకమని రఘునాథపాలెం సర్పంచ్ గాజుల కృష్ణారావు తెలిపారు. ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల సోషల్ సైన్సెస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక శిబిరంలో భాగంగా గురువారం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గాజుల కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా గ్రామంలో సేవ చేస్తున్న విద్యార్థులను అభినందించారు.యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డా॥ ఎం. పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి. ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి అనురాధ, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా॥ ఎన్. శ్రీనివాసరావు, కళాశాల ఐక్యు ఏసి కో ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

తహసీల్దార్లు, ఎంపిడిఒలతో కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సత్వర న్యాయం అందే లా అధికారులు ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తహసీల్దార్లు, ఎంపిడిఒలతో రెవెన్యూ సమస్యలు, గ్రామాల పారిశుధ్యంపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు ప్రజల దరఖాస్తుల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. ఇటీవల ఎన్నికైన నూతన సర్పంచ్‌ల శిక్షణా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఉదయాన్నే అధికారులు క్షేత్ర సందర్శన చేయాలన్నారు. గ్రామాల్లో వీధి దీపాల మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామాలకు కేటాయించిన నిధులు 30 శాతం పారిశుధ్యానికి, 30శాతం తాగునీటి సరఫరాకు కేటాయించాలన్నారు. అన్ని గ్రామాల్లో ట్రాక్టర్లు పనిచేసేవిధంగా చర్యలు తీసుకోవాలని పారిశుద్ధ్యం, తాగునీరు సరఫరాకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన స్లాట్లను ఏరోజుకారోజు పరిష్కరించాలని పెండింగ్ లో ఉంచరాదని ప్రజలకు అసౌకర్యం కలిగించవద్దన్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు 45 రోజుల్లో గ్రౌండింగ్ కానీ యెడల వాటిని రద్దు చేసి ఎంఎల్‌ఎల దగ్గర తాజా ప్రతిపాదనలను తీసుకోవాలన్నారు. ఇల్లు రద్దు విషయంలో ఆర్థికంగా ఇల్లు కట్టుకోలేని నిరుపేదలు ఉన్నచో స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం ఇప్పించేవిధంగా సహకరించాలన్నారు. భూ భారతి పోర్టర్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమయానికి లాగిన్ అవ్వాలని, లాగిన్ కాకుండా స్లాట్లను క్యాన్సిల్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులు నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. భూభారతిలో 60 రోజులకు పైబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై దృష్టిపెట్టి యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆమోదించిన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ వెంటనే చేయాలన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో మూడు గ్రామాల చొప్పున 70 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, పివోటి, ఆసైన్డ్, సీలింగ్, పోరంబోకు తదితర భూములు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో లెక్క తేల్చాలన్నారు. అభివృద్ధి పనులకు భూ సేకరణ త్వరితగతిన చేయాలన్నారు. చింతకానిలో నర్సింగ్ కళాశాల, మధిరలో ఐటి హబ్ స్థలం కేటాయింపు వెంటనే చేయాలన్నారు. అధికారుల నిర్ల క్ష్యం, నిర్లప్తతను సహించేది లేదని ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పనితీరులో వెనకబడ్డ వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ. పద్మశ్రీ, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు,జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, తహసీల్దా ర్లు, ఎంపిడివోలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యుడి చేతిలో పాశుపతాస్త్రం 'ప్రజాపక్షం'

పారిశుద్ధ్య కార్మికులతో 'ప్రజాపక్షం' క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కూసుమంచి:**సామాన్యుడి చేతిలో పాశుపతాస్త్రంగా పని చేస్తున్న ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సరం క్యాలెండర్‌ను కూసుమంచిలోని గ్రామ పంచాయితీ పారిశుధ్య కార్మికుల చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులు ప్రజాపక్షం దినపత్రికను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక నిజమైన ప్రజల పక్షంగా ఉన్నదని నమ్ముతున్నట్లు తెలిపారు. కూసుమంచి మం డలంలో అనేక సమస్యలను వెలికితీయడంలో ప్రజాప క్షం పత్రిక ముందున్నదని, సామాన్యుల పక్షాన సైతం అనేక కథనాలు ప్రసరిస్తుందని ఇంకా పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న తమలను ఎవర్వూ ఒక క్యాలెండ ర్ ఆవిష్కరణకు గుర్తించలేదని అది కేవలం ప్రజల పక్షాన పని చేస్తున్న ఒక ప్రజాపక్షం దినపత్రిక మాత్రమే పారిశుద్ధ్య కార్మికులను గుర్తించి తమ తన హక్కున చేర్చుకొని అందరూ సామానులేనంటూ క్యాలెండర్ ఆవిష్కరణకు మమ్ములను ఆహ్వానించి మా చేత ఆవిష్కరింపజేసిన ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యానికి, జిల్లా బ్యూరో బాధ్యులకు వారు కృతజ్ఞతలు, అభినంద లు తెలుపుతూ ఇంకా ఈ పత్రిక పది కాలాలపాటు వర్ధిల్లాలని మరింతగా ప్రజల్లోకి వెళ్లి కిందిస్థాయి నుండి పై స్థాయి వరకు ప్రజల సమస్యలను వెలికి తీసి తమ భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారా ప్రజల్ని మేల్కొల్పాలని వా రు కోరారు. ఈకార్యక్రమంలో కూసుమంచి మండల ప్రజాపక్షం రిపోర్టర్ ఎం.భార్గవ్‌తో పాటు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు నలగాటి ప్రవీణ్, గోపె భిక్షం, కొక్కెరేణి గురవయ్య, నల్లగాటి ఉపేందర్, కొత్తపెల్లి అచ్చాలు, గోపె సత్యం, పిట్టల వీరయ్య, గంజి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు – ఏటూరి నాగారం రహదారి మరమ్మతులు వెంటనే చేపట్టాలి

రోడ్డుకు ఇరువైపులా ఇసుక ను తొలగించాలి : సిపిఐ నిరసన



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు నుండి ఏటూరి నాగారం వెళ్లే ప్రధాన రహదారి గుంటలను వెంటనే పూడ్చి మరమ్మత్తులు చేపట్టాలని, ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అలాగే మణుగూరు అంబేద్కర్ సెంటర్లో ఉన్న మసీదు నుండి ఎల్ఐసి ఆఫీస్ వరకు రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయి ఇసుక మేట వేసిందని, వెంటనే ఇసుక మేటను, సంబంధిత అధికారులు పట్టించుకోని, తొలగించాలని సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శిలు దుర్గ్యాల సుధాకర్, మండల కార్యదర్శి జక్కుల రాజబాబులు డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ మణుగూరు నుండి ఏటూరి నాగారం వెళ్లే ప్రధాన రహదారి గుంతలదగ్గర సిపిఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ రోడ్డు పరిస్థితి అధ్వానంగా ఉందని, రోడ్లు ఇబ్బందికరంగా మారిందని టూ వీలర్స్ ప్రయాణికులు, అనేకమంది గుంటలలో పడి కాళ్లు చేతులు విరగొట్టుకున్నారని, అనేక యాక్సిడెంట్లు జరిగాయని, అయిన దీనిపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన స్పందన లేదని, హెచ్‌టిపిఎస్‌కు రోజూకు వందల లారీలు, వరంగల్, ఎటురు నాగారం వరకు నిత్యం వేలాది మంది ప్రయాణీకులు ప్రయాణం చేస్తున్నారని, దీంతో పాటు ఈనెల మేడారం జాతర ఉన్న సందర్భంగా మణుగూరు నుండి రెండు రాష్ట్రాల వారు ఈ రహదారి నుండే ప్రయాణాలు చేసే పరిస్థితి ఉన్నందున, ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బి శాఖ పట్టించుకుని గుంతలు లేకుండా తాత్కాలిక మరమ్మతులైన చేపట్టి, యాక్సిడెంట్లు జరగకుండా ప్రయాణికులకు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ సెంటర్ మసీదునుండి ఎల్ఐసి ఆఫీస్, మైత్రి హోండా షోరూం వరకు రోడ్డుకి ఇరువైపులా సగం రోడ్డు ఇసుకమేట వేసిందని, అనేక టూ వీలర్స్ జారీ ఆక్సిడెంట్లు జరుగుతున్నాయని, రోడ్డు మీద ఉన్నటువంటి ఇసుక మేటలను సంబంధిత అధికారులు తొలగిస్తే ప్రయాణికులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యంగా ఉంటుందని, సంబంధిత గ్రామపంచాయతీ లేదా అధికారులు స్పందించి ఇసుక మేటర్ ను తొలగించి, రోడ్డు శుభ్రపరచాలని వారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, మంగి వీరయ్య, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, సిపిఐ మణుగూరు పట్టణ సహాయ కార్యదర్శి చింతల దశరథం, అదబాల ప్రవీణ్, బొగ్గుముట్ట అధ్యక్షులు యాకూబ్, శ్రీకాకుళం వీరమల్లు,లింగస్వామి, దాసరి శ్రీను, యాకయ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లకు ఆన్‌లైన్ ద్వారా ఇసుక

'మన ఇసుక వాహనం' పైలెట్ ప్రాజెక్టు అమలు : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు ప్రభు త్వ అవసరాలకు ఇక నుండి ఆన్‌లైన్ ద్వారానే ఇసుక రవాణా అందిస్తారని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇసుక వాహనం పైలట్ ప్రాజెక్టును జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇసుక రవాణా సరఫరా వ్యవస్థను పారదర్శకంగా, నియంత్రిత విధానంలో అమలు చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మన ఇసుక మన వాహనం ఆన్లైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టిందన్నారు. టిజిఎండిసి తహశిల్దార్లు, పంచాయతీ కార్యదర్శులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇకనుండి జిల్లాలో ఇసుక సరఫరా మన ఇసుక వాహనం ద్వారానే ఆన్‌లైన్ పద్ధతుల్లో జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రతీ లావాదేవీలు ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. ఇందులో ఎలాంటి మానవ జోక్యం ఉండదన్నారు. మండలాల వారీగా ఇసుకకు ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా ఇసుక రీచ్‌లు గు ర్తించాలని సూచించారు. ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతం అయ్యేందుకు అధికారులంతా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడి అధికారులు, టిజి ఎండిసి సిజిజి హైదరాబాద్ ప్రతినిధులు, మండలస్థాయి తహశిల్దార్లు,ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిపిఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఓనర్లు, డీలర్లు, సేల్స్ అధికారులు, పంపు ఆపరేటర్లకు గురువారం నిర్వహించిన సిపిఆర్ అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఇటీవల కాలంలో గుండెపోటు వల్ల చాలా మంది మరణిస్తున్నారని గుండెపోటు వచ్చిన వెంటనే సిపిఆర్ చేయడం వల్ల మనిషి ప్రాణాలను కాపాడేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. సిపిఆర్ చేసేందుకు వైద్య పరంగా ఎటువంటి అనుభవం అవసరం లేదని సాధారణ మనుషులు కూడా సిపిఆర్ చేసి ప్రాణాలు కాపాడవచ్చునని తెలిపారు. ప్రతి ఒక్కరూ సిపిఆర్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గోల్డెన్ అవర్‌లో సిపిఆర్ చేయడం వల్ల ప్రాణాలు కాపాడగలుగుతామన్నారు. మనిషి ఎప్పుడైనా స్పృహ కోల్పోతే వెంటనే సిపిఆర్ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

## 40 మందికి సామాజిక శిక్ష



**ప్రజాపక్షం/భద్రాచలం:** డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన 40 మంది వ్యక్తులకు భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్ సామాజిక శిక్ష విధించారు. ఆ 40మందిని పట్టణ పోలీసులు గురువారం కోర్టులో ప్రవేశపెట్టగా వారికి జరీమానా విధించిన న్యాయమూర్తి కోర్టు ఆవరణలో మొక్కలు నాటించారు.దీనిని పలువురు అభినందించారు. వాహనాలు నడిపే సమయంలో మద్యం సేవించి నడపరాదని సూచించారు. గతంలోసైతం డ్రంగ్ అండ్ డ్రైవ్‌లో దొరిగిన కొందరితో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు శుభ్రం చేయించిన విషయం విధితమే.

# మున్సి'పోల్స్' సందడి

• సమాయత్తమవుతున్న రాజకీయ పార్టీలు • ఖమ్మంలో ఐదు, భద్రాద్రిలో కార్పొరేషన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలకు ఎన్నికలు • మణుగూరు యథాతథం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల సందడి మొదలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రాజకీయ పార్టీలు తమ కార్యకర్తలను మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నాయి. రెండు రోజుల్లో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలవుతుందన్న వార్తల నేపథ్యంలో రాజకీయ పార్టీలు డివిజన్ల వారీగా గెలుపు గుర్రాల కోసం వేట ప్రారంభించాయి. ఖమ్మం జిల్లాలో కొత్తగా ఏర్పడిన ఏదులాపురం, కల్లూరుతో పాటు వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం కార్పోరేషన్‌తో పాటు ఇల్లందు, కొత్తగా ఏర్పడిన అశ్వారావుపేట మున్సిపాలిటీకి ఎన్నికలు జరగనున్నాయి. రాజకీయ పార్టీలు ఓటర్ల జాబితా అనంతరం వార్డుల వారీగా పార్టీ బలాబలాలను అంచనా వేయడంతో పాటు గెలిచే అభ్యర్థుల కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో రాజకీయ పార్టీల మధ్య పొత్తుల చర్చలు కూడా ప్రారంభమయ్యాయి. పొత్తులు స్థానిక పరిస్థితులు బట్టి ఉండే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జిగా కొండా సురేఖను నియమించగా బిఆర్ఎస్ పార్టీ మున్సిపాలిటీకి ప్రత్యేకంగా ఎన్నికల ఇంచార్జిలను నియమించింది. ఇప్పటికే ఆశావాహులతో ఇంచార్జీలు చర్చలు జరుపుతున్నారు. అదే సమయంలో కలిసి వచ్చే పార్టీలతో అవగాహన వైపు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. పార్టీ గుర్తులపై ఎన్నికలు జరగనుండడంతో రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నాయి. ఖమ్మంజిల్లాలో వామపక్షాల నిర్ణయం కూడా కీలకం కానుంది. దాదాపు అన్ని మున్సిపాలిటీల్లోనూ వామపక్షాలు గణనీయమైన బలాన్ని కలిగి ఉన్నాయి.

### కొత్తగూడెం కార్పొరేషన్‌పై సిపిఐ గురి : సాబీర్‌పాషా

కొత్తగూడెం కార్పోరేషన్‌పై సిపిఐ గురి పెట్టింది. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు సంపాదించిన సిపిఐ అదే రీతిలో నూతనంగా ఏర్పాటైన కార్పోరేషన్‌ను కైవసం చేసుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తుంది. సంస్థాగతంగా బలమైన నిర్మాణం ఉండటం, శాసన సభ్యునిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఉండడంతో సిపిఐకి అదనపు బలం చేకూరింది. సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా గడిచిన కొంత కాలంగా కార్పోరేషన్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నారు. కూనంనేని సాంబశివరావు శాసన సభ్యునిగా చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ గెలుపు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలతో పాటు కార్పోరేషన్‌లోని అన్ని డివిజన్లలో ఇప్పటికే ఒక దఫా సమావేశాలను నిర్వహించారు. ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీల్లో సైతం సిపిఐ అభ్యర్థులు బరిలో నిలుస్తారని సాబీర్‌పాషా తెలిపారు.

### మున్సిపల్ ఎన్నికల్లో పోటీ : దండి సురేష్

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో కలిసి వచ్చే పార్టీలతో కలిసి పోటీ చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ఏదులాపురం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు నియోజక వర్గాల్లో తమ బలానికి అనుగుణంగా పోటీ చేస్తామని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని తమకు ఆమోదయోగ్యమైన ఒడంబడిక కుదిరితే ఆయా పార్టీలతో కలిసి పని చేసేందుకు సిద్ధమన్నారు.

**మణుగూరులో యథాతథ స్థితి :** మణుగూరు మున్సిపాలిటీ ఏర్పాటు స్థానిక ప్రజలకు శాపంగా మారింది. గతంలో పంచాయతీగా ఉన్న మణుగూరును 20 ఏళ్ల క్రితం మున్సిపాలిటీగా మార్పు చేశారు. మణుగూరు ఏజెన్సీ ప్రాంతంలో ఉండడంతో కొంత మంది దీనిపై కోర్టును ఆశ్రయించారు.

అప్పటి నుంచి ఎన్నికలు నిర్వహించడం లేదు. కొందరు మణుగూరును తిరిగి గ్రామ పంచాయతీగా మార్చాలని ఆందోళనలు చేపట్టారు. అటు మణుగూరును మున్సిపాలిటీగానే ఉంచి ఎన్నికలు నిర్వహించడం కానీ అలా సాధ్యం కాకపోతే తిరిగి గ్రామ పంచాయతీగానే ఉంచి ఎన్నికలు నిర్వహించడం కానీ ప్రభుత్వం చేయడం లేదు. పాలక వర్గాలు లేకపోవడంతో ఇష్టానుసారంగా మున్సిపల్ పాలన తయారైంది. గతంలో భద్రాచలాన్ని, సారపాక పట్టణాలను కూడా మున్సిపాలిటీగా ప్రకటించారు. ఏజెన్సీ చట్టాలు ఇతరత్రా సమస్యలతో తిరిగి పంచాయతీలుగా మార్చి ఇటీవల ఎన్నికలు నిర్వహించారు. అదేవిధంగా మణుగూరు పట్టణాన్ని కూడా గ్రామ పంచాయతీగా మార్చాలని లేదంటే మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని స్థానిక రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ




ప్రజాపక్షం/ఎల్కతుర్తి : ప్రజాపక్షం దినపత్రిక 2026 క్యాలెండర్ ను ఎల్కతుర్తి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐమాట్లాడుతూ ప్రజాపక్షం పత్రిక ప్రజా సమస్యల పైన వార్తలు రాస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండాలని నిరంతరం సమస్యలు తెలిపే పత్రికగా నిలిచి ప్రజల గుండెల్లో ఒక భాగంగా ఉండాలి అన్నారు. ప్రజలకు అక్షర రూపంలో సమస్యల పరిష్కారంలో ముందు ఉండే పత్రిక ప్రజాపక్షం దినపత్రిక అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం దినపత్రిక రిపోర్టర్ కంచర్ల సదానందం తో పాటు ప్రజాపక్షం పత్రికను ఇష్టపడే ముఖ్యులు ఉన్నారు.

## ఇల్లంద గ్రామంలో కోతుల బెడదకు వినూత్న పరిష్కారం



ప్రజాపక్షం/వర్ధన్నపేట: ఇల్లంద గ్రామంలో కోతుల బెడద రోజు రోజుకీ విపరీతంగా పెరిగిపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలాది కోతులు ఇళ్లలోకి చొరబడి దాడులు చేయడంతో పాటు గాయపరుస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురువుతున్నారు. ఒంట రిగా బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది, కోతుల నుంచి మా ప్రాణాలను కాపాడండి అంటూ గ్రామస్తులు వేడుకుంటున్న నేపథ్యంలో ఇల్లంద గ్రామ సర్పంచ్ బేతి సాంబయ్య వినూతన ఆలోచనతో ముందుకు వచ్చారు. కోతులను భయ పెట్టేందుకు చింపాంజీ రూపంలో వేషాలు ధరించే ప్రయోగాన్ని చేపట్టారు. సొంత నిధులు వెచ్చించి చింపాంజీ మాస్కులు తెప్పించి, గ్రామ పంచాయితీ పాలకవర్గ సభ్యులు పంచాయితీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు కలిసి చింపాంజీ వేషధారణలో కోతులను తరిమికొట్టే ప్రయత్నం చేశారు. కోతులు ఎక్కువగా సంచరించే కాలనీల్లో చింపాంజీ వేషాల్లో సిబ్బంది పరుగులు పెడుతూ, హావభావాలు, చేష్టలతో కోతులను హడలెత్తించారు. ఈ వేషధారణను చూసి భయపడిన కోతులు తుర్రుమని పారిపోవడంతో గ్రామస్తులకు తాత్కాలికంగా ఊరట లభించింది. ఈ వినూత్న ఐ డియా అదుర్స్‌గా ఉందని గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తుండగా, ప్రస్తుతం ఇదే సరైన మార్గంగా కనిపించిందని సర్పచ్ సాం బయ్య తెలిపారు.

## డిసిసి అధ్యక్షురాలిని కలిసిన కొమ్మూరి



ప్రజాపక్షం/జనగామ :కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు లకావత్ ధన్వంతిని మాజీ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జనగామలోని లకావత్ ధన్వంతి నివాసంలో కలిసి రాబోవు మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీని విజయపథంలో నడిపించడం కోసం దిశా నిర్దేశం, వ్యూహాలపై చర్చించారు. ప్రతి వార్డులో బలమైన అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు కావల్సిన ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా శుక్రవారం మంత్రి సీతక్క రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపైనా చర్చించారు. జనగామలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని కార్యకర్తల్ని సిద్ధం చేయాలని చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు లకావత్ లక్ష్మి నారాయణ నాయక్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులువంగాలమల్లారెడ్డి,బనుకశివరాజ్ యాదవ్, మేడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ నిధులు మధ్యతరగతి బతుకులకు భరోసా



ప్రజాపక్షం/గూడూరు/కొత్తగూడ;సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు మధ్యతరగతి ప్రజలకు భరోసా అని కొత్తగూడ సర్పంచ్ మల్లెల భాగ్యమ్మ అన్నారు.గురువారం కొత్తగూడ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో గాంధీ నగర్ చెందిన మహమ్మద్ యాకుబ్‌కు 18.500 రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కను అందజేశారు.ఈసందర్భంగా సర్పంచ్ భాగ్యమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యావైద్యం వ్యవసాయ రంగాలకు అధిక ప్రాథమిక నిస్తుందని అమే అన్నారు.పేద మధ్యతరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజాప్రభుత్వం ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆమే తెలిపారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు బోడ ఏరియా టౌన్ ఉపాధ్యక్షులు వెలదండవీయం మండల నాయకలు మధ్య బాలరాజు ఏరియా నాయక్ అఫ్జల్ యూత్ కాంగ్రెస్ మండల నాయకలు యాదగిరి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/పాలకుర్తి: మండల కేంద్రంలోని ఇందిరా మహిళా శక్తి ఎస్ఎల్ఎన్ ఫంక్షన్‌హాల్ పరిసరాలను గురువారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పరిశీలించారు. నేడు రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ భవనం మహిళా సాధికారతకు, స్వయం ఉపాధి కార్యక్రమాలకు కేంద్రంగా నిలవాలన్నారు.మహిళాసంఘాలకు ఈ భవనం పూర్తి స్థాయిలో ఉపయోగపడే లా నిర్వహణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సరస్వతి, ఎంపిడిఒ వేదవతి, కాంగ్రెస్ నాయకులు రాపాక సత్య నా రాయణ, గిరగాని కుమారస్వామి, అధికారులు పాల్గొన్నా రు.

## కొన్ని రోజుల పాటు సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లకు షార్ట్ టర్మినేషన్

ప్రజాపక్షం/నెక్కొండ:రైల్వే పరిపాలనా కారణాల దృష్ట్యా కొన్ని ప్రయాణికుల రైళ్ళను నిర్ణీత కాల వ్యవధిలో షార్ట్ టర్మినేషన్/ ఒరిజినేషన్ చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 17033 బిడిసిఆర్, బిసిక్యూ సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ రైలు, 17034 ఎస్ఆర్‌యూ ఆర్..బిడిసిఆర్ సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ రైళ్లు జనవరి 24 నుండి ఫిబ్రవరి 14, 2026 వరకు కాజీపేట జంక్షన్ వరకు మాత్రమే నడుస్తాయని వెల్లడించారు. ఈ కాలంలో ఆయా రైళ్లు తమ పూర్తి గమ్య స్థానాలకు వెళ్లవని పేర్కొన్నారు. ప్రయాణికులు ముందుగా రైళ్ల వివరాలు తెలుసుకొని ప్రయాణాలు ప్రణాళిక చేసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క



ప్రజాపక్షం/భూపాలపల్లి :మహిళ సాధికారతే రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం లక్యం అని,మహిళలు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సంతోషంగా ఉంటుందని కాంక్షించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృతంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ముందుకు పోతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు.గురువారం జిల్లా కేంద్రం లోని సుభాష్ నగర్ కమ్యూనిటీ హాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరెలు పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యంగా వివిధ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళలు సంతోషంగా ఉండాలంటే స్వతహాగా ఖర్చు పెట్టుకునే స్వేచ్ఛ ఉండాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మార్చి నెలాఖరు వరకు ప్రతి ఒక్క మహిళలకు చీర అందిస్తామన్నారు. సంఘాలను ఇబ్బంది పెట్టకుండా రుణాలు ఇప్పించాలని సోలార్ పెట్రోల్ బంకులు, క్యాంటీన్లు వంటి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ, భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి 63 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు 15 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, మన నియోజకవర్గంలో విఓ సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విఓ సంఘాలకు 10 ఎకరాలు భూమిక ఇస్తే అందులో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతకు ముందు మున్సిపాలిటీ పరిధిలోని సుభాష్ కాలనీలో రామాలయం నుండి 5 ఇంక్లైన్ జంక్షన్ వరకు 2కోట్లతో నిర్మించనున్న సి.సి. రోడ్డు మరియు సైడు కాలువ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు.ఈ సమావేశంలో ఎస్పీ సంకీర్త్, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విజయలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ కమిషనర్ జోన, మెప్మా పిడి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలి..

**గ్రామాలు కన్నతల్లిలాంటివి**

గ్రామాల అభివృద్ధికి సర్పంచులు కృషి చేయాలని, గ్రామాభివృద్ధికి చేసిన సేవలు కలకాలం గుర్తుండిపోతాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం జిల్లా కేంద్రం లోని బిసి బాలుర వసతి గృహంలో జరుగుతున్న సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళికతో వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ఆదర్శ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి పంచాయతి లకు వచ్చే నిధులపై పూర్తి అవగాహన కలిగి, వాటిని సమర్థంగా వినియోగించి సమగ్ర అభివృద్ధి సాధించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి ఇప్పటికే రూ.237 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు త్వరలో మంజూరవు తాయని తెలిపారు. ఈ సందర్భంగా సమ్మక్కసారక్క జాతరకు సర్పంచులను ఆహ్వానించారు. అనంతరం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ప్రభుత్వ నిధులతో పాటు స్థానిక వనరుల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకునే సమగ్ర కార్యాచరణ రూపొందించాలన్నారు. మూడు నెలలకు ఒకసారి గ్రామ సభలు నిర్వహించి గ్రామాభివృద్ధికి దిశానిర్దేశం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ శిక్షణలో ఇచ్చిన అంశాలపై పూర్తి అవగాహన కలిగి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సమగ్ర పాత్ర పోషించాలని సూచించారు.ఈ సమావేశంలో ఎస్‌పి సంకీర్త్, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, డిపిఒ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ప్రజాపక్షం/స్టేషన్ ఘన్ పూర్ : జాతరకు వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, జాతర కమిటీ చైర్మన్లు, స్థానిక సర్పంచులు సమన్వయంతో పని చేసి సమ్మక్క సారలమ్మ జాతరలను విజయవంతంగా పూర్తి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో జరిగే మినీ సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంతాలు చిల్పూర్ మండలంలోని కొచిల్పూర్ శ్రీపతిపల్లి, లింగంపల్లి, గార్లగడ్డ తండా ఫతేపూర్, చిల్పూర్, స్టేషన్ ఘనపూర్ మండలంలోని జిట్టేగూడెంతాటికొండ, ఇప్పగూడెంలలో జరిగే ఏర్పాట్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంబంధిత శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర ప్రాంతాలలో ఫార్మేషన్ రోడ్లు, గద్దెల కలరింగ్, టాయిలెట్స్, త్రాగు నీరు, విద్యుత్ శాఖ సంబంధిత పనులన్నింటిని 24వ తేదీ నాటికి పూర్తి చేయాలని 25వ తేదీన పనులను ప్రారంభోత్సవం చేసుకోవాలని తెలిపారు. 89లక్షల 50 వేలతో జాతరలలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జాతర స్పెషల్ ఆఫీసర్లు జాతర జరిగే నాలుగు రోజులు అందుబాటులో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. జాతరలలో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని, జాతర జరిగే ప్రాంతంలోని చుట్టు పక్కల గ్రామాల నుండి పారిశుద్ధ్యసిబ్బందిని నియమించుకోవాలని తెలిపా రు. అలాగే పోలీస్ అధికారులు పటిష్టమైన భద్ర త చర్యలు తీసుకోవాలని అన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి జాతరలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, ఆర్డివో వెంకన్న, పంచాయతీ రాజ్, విద్యుత్, రూరల్ వాటర్ సప్లై, ఎండోమెంట్, రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారులు, జాతర కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దామెరగుట్ట సమ్మక్క సారలమ్మ జాతరకు మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



ప్రజాపక్షం/ఖిలావరంగల్: శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర అమ్మవారిపేట దామెరగుట్ట కమిటీ దేవాలయ ధ ర్మాదాయ శాఖ మంత్రి కొం డా సురేఖను గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర దామెరగుట్ట అమ్మవారిపేట నందు జరిగే జాతరకు తప్పకుండా రావాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తప్పకుండా జాతరకు వచ్చి దర్శించుకుంటానని అలాగే అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకొని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని జాతర కమిటీ వారికి తెలిపారు. ధర్మకర్తలు దాసి రాందేవ్, బైరి నాగరాజు, బైరి హరినాథ్, ఏ రామ్మూర్తి, బత్తిని అఖిల్‌గౌడ్, నాగపురి సంజయ్‌బాబు, ఎం సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీత వృత్తి సమస్యల సాధనకు పోరాడాలి

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు



ప్రజాపక్షం/ వరంగల్ : రాష్ట్రంలో కల్లు గీత పనివారలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు జరపాలని బిసిహక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్ లో గీత పని వారల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బైరి తిరుపతి, బిసి హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి తో కలిసి గీత పని వారల సంఘం క్యాలెండర్ ను వెంకట్రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణ, సరళీకరణ విధానాలతో గీత, చేనేత, మత్స్య, రజక, గొర్రెల పెంపకం తదితర వృత్తులన్ని విధ్వంసమయ్యాయని, ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించడంలో పాలకులు విఫలమైనారన్నారు. గీత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గీత పనివారలకు ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను రెండేళ్లు దాటిన అమలు పరచకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.పెండింగ్ లో ఉన్న రూ. 12 కోట్ల ఎక్స్‌గ్రేషియా బకాయిలు వెంటనే చెల్లించాలని, గీత కార్మికులకు ఇస్తున్న కిట్స్‌లు అందరికి ఇవ్వాలని, వృత్తిదారులందరు ఐక్యమై సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపు నిచ్చారు. పల్లె రాజుగౌడ్, పట్టాపురం ఏకాంతం గౌడ్, చిర్ర శ్రీనివాస్ గౌడ్, పెద్దగాం మధుకర్, అనంతుల రమేష్ గౌడ్, అర్జున్, చెలుకల రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సమస్య ఎక్కడుంటే తీన్మార్ మల్లన్న అక్కడే



ప్రజాపక్షం/హసన్‌పర్తి: సమస్య ఎక్కడ ఉంటే తీన్మార్ మల్లన్న అక్కడ ఉంటాడని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ అధికారులు, పాలకులు ప్రజల సమస్యను పట్టించుకోకుండా కాలయాపన చేస్తే ప్రజల పక్షాన ఎల్లపుడు అండగా ఉంటానని ఎమ్మెల్సీ తీర్మాన్ మల్లన్న అన్నారు. గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల అందిన ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేస్తున్నట్లు తీన్మార్ మల్లన్న తెలిపారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి కళాశాలలో మౌళిక సదుపాయాల గురించి తెలుసుకొని వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో తయారుచేస్తున్న విత్తనాలు రైతులకు నేరుగా అందచేయాలని అలాగే మేలి రకం విత్తనాలు తయారుచేయడంలో విశ్వవిద్యాలయం ముందుందని కాని ప్రయివేటు మార్కెట్ వల్ల మేలి రకం విత్తనాలు రైతులకు చేరడం లేదన్నారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కుమార్ రెడ్డి, డాక్టర్ డీన్ రవీంద్రనాయక్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రవీణ్‌కుమార్, ప్రొఫెసర్ మాలతి, బోధన అధ్యాపకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గండ్ర



ప్రజాపక్షం/భూపాలపల్లి :భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు ఇతర నాయకులు, అధికారులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పుల్లూరురామయ్యపల్లిలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, స్మశానవాటిక నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం తుమ్మలచెరువు బండ్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, రాంనగర్ లో పబ్లిక్ అమినిటీ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, మున్సిపల్ ఇసంపల్లి జోన, నాయకులు దాట్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

ప్రజాపక్షం/పాలకుర్తి:ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు.జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు తెలంగాణ రీజినల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ సభ్యులు చిలువేరు అభిగౌడ్ ఆద్వర్యంలో రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం ద్వారా ప్రాణ రక్షణ సాధ్యమని తెలిపారు. అతివేగం తగ్గించి రోడ్డు నియమాలు పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లగించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు భద్రతా అందరి భద్రత నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీళ్లే బెస్ట్:ఎమ్మెల్యేపల్లా

ప్రజాపక్షం/బచ్చన్నపేట: పారే నది నీళ్లను మూడు సార్లు ఫిల్టర్ చేసి గ్రామాలలో ఇంటింటికి పంచే మిషన్ భగీరథ నీళ్లే బెస్ట్ అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని లక్ష్మాపూర్‌లో కేశిరెడ్డిపల్లికి చెందిన మాజీ సర్పంచ్ మల్లవరం రమేష్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కోడలు సుస్మిత వెంకటేశ్వర్‌రెడ్డిలు రూ.2లక్షల ఆర్థిక సహాయంతో వాటర్ ప్లాంట్ నిర్మించగా దాన్ని దాత వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ కల్పన రాజిరెడ్డి, ఉప సర్పంచ్ మహేష్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కల్పన రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.40వేల కోట్లు వెచ్చించి కేసీఆర్ గ్రామాలకు నీటిని అందించే కార్యక్రమం తీసుకువచ్చారన్నారు.దాత వెంకటేశ్వర్ రెడ్డి తన గ్రామమే కాకుండా ఇతర గ్రామాలకు కూడా సహాయం అందించి అభివృద్ధిలో చేయూతనివ్వాలన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు.ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు రాజిరెడ్డి, పుష్పలీల, లోకేష్, భార్గవి, శ్రీకాంత్, నాయకులు నర్సిరెడ్డి, బాలరాజు, కనకయ్య, లక్ష్మయ్య, బాలస్వామి, రవందర్, ఉపేందర్, నాగరాజు, నర్సింహారావు, పాల్గొన్నారు.

## మేడారం పరిరక్షణే ధ్యేయం

22 భాషల భారీ బ్యానర్‌తో వినూత్న అవగాహన ర్యాలీ



ప్రజాపక్షం/హనుమకొండ :మేడారం మహాజాతర పవిత్రతను, అక్కడి అటవీ సంపదను పరిరక్షించడమే లక్ష్యంగా ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట భారీ అవగాహన ర్యాలీతో పాటు ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో మేడారం పరిరక్షణ కోసం 22 భాషల భారీ బ్యానర్‌తో నిర్వహించిన వినూత్న అవగాహన ర్యాలీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, సామాజిక వేత్తలు ఇ.వి. శ్రీనివాస్ రావు, డాక్టర్ సి.హెచ్. భద్ర తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం భారత రాజ్యాంగం గుర్తించిన 22 భాషల్లో రూపొందించిన భారీ క్లాత్ బ్యానర్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టిక్ రహిత మేడారం కోసం ఇచ్చిన సందేశం ప్రజలను ఆలోచింపజేసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి పాల్గొని, పర్యావరణ పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ తరహా వినూత్న కార్యక్రమాలను అభినందించారు. మేడారం వంటి పవిత్ర ప్రాంతాల్లో ప్రజల సహకారంతోనే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

**ప్లాస్టిక్ రహిత మేడారం జాతరకు పిలుపు**

ఈ నెల 28 నుండి 31 వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో జరగనున్న ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను పూర్తిగా 'ప్లాస్టిక్ రహిత' జాతరగా మార్చాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని సామాజికవేత్త, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ కార్యదర్శి సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అడవిని, అటవీ జీవ వైవిధ్యాన్ని కాపాడాలని, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు అడవిలో వదిలివేయకూడదని కోరారు.

**అంతర్జాతీయ గుర్తింపు దిశగా ప్రయత్నం**

ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సి.హెచ్. భద్ర మాట్లాడుతూ "గత 14 సంవత్సరాలుగా మా సంస్థ మేడారంలో ప్లాస్టిక్ నియంత్రణ కోసం నిరంతరం పనిచేస్తోంది. ఈసారి జాతరకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలనే లక్ష్యంతో, పర్యావరణానికి హాని చేయని వస్త్రంతో 22 భాషల్లో నినాదాలు రాసిన భారీ బ్యానర్‌ను రూపొందించామని,ఇది చరిత్రలో నిలిచిపోతుంది" అని అన్నారు.

**కోట్లాది ప్లాస్టిక్ వ్యర్థాలతో మేడారానికి ముప్పు**

ఈ సందర్భంగా ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ "ఈసారి జాతరకు సుమారు 2.5 నుంచి 3 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఒక్కొక్కరు సగటున 10–20 ప్లాస్టిక్ కవర్లు లేదా బాటిళ్లు వాడితే, 10 నుంచి 15 కోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలు అడవిలో చేరే ప్రమాదం ఉందని, ఇది మేడారం అడవిని కాలుష్య కాసారంగా మారుస్తుందన్నారు. భక్తులు బాధ్యతగా ప్లాస్టిక్‌ను త్యజించి అడవి తల్లిని కాపాడితేనే మన భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**విద్యార్థుల నినాదాలతో మారుమోగిన ప్రాంతం**

ఈ ర్యాలీలో కాకతీయ పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'సేవ్ మేడారం –క్లీన్ మేడారం– గ్రీన్ మేడారం' అంటూ నినాదాలు చేయగా, ఆ ప్రాంతమంతా పర్యావరణ సందేశంతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పిట్టల వెంకన్న, ప్రపంచ పర్యావరణ సంస్థ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ పటేల్,జాతీయ యువజన కార్యదర్శి సుమేర్, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల రాంప్రసాద్, దయాప్రసాద్,సామాజిక కార్యకర్త చంద్రప్రకాష్, జనగామ జిల్లా అధ్యక్షుడు నీలం యువరాజ్, రోషన్ గైక్వాడ్, బాగడి రమేష్, అనికేత్, సంస్థ అంబాసిడర్ అద్వైత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
ఖమ్మం
శుక్రవారం
23-01-2026
www.prajapaksham.in

“మెగా అభిమానులు మెచ్చేలా ఉన్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం, బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, చిరంజీవి సినీ ప్రయాణంలో అతి పెద్ద విజయంగా నిలిచింది. ఈ నేపథ్యంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి చెందిన పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపింది.”

రీల్

# 'వెల్లేదారిలో' పాట విడుదల



చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీ చక్రాస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ మీద చింతా వినీష రెడ్డి, చింతా గోపాల కృష్ణా రెడ్డి నిర్మాతలుగా చింతా రాజశేఖర్ రెడ్డి సహ నిర్మాతగా వినయ్ రత్నం తెరకెక్కించిన చిత్రం 'శ్రీ చిదంబరం. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట జంటగా నటించిన 'శ్రీ చిదంబరం' చిత్రంలో ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎమ్ కీరవాణి ఆలపించిన 'వెల్లేదారిలో' అనే ఓ పాట బ్యూటిఫుల్ పాటను విడుదల చేశారు. ఈ పాటను సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణిపాటను విడుదల చేశారు. చందు రవి సంగీతం అందించిన ఈ పాటకు చంద్రశేఖర్ సాహిత్యాన్ని సమకూర్చారు. ఈ పాట ట్యూన్తో పాటు సాహిత్యం అందించారు. కీరవాణి గాత్రం ఈ పాటకు ప్రాణం పోసింది. ఈ సందర్భంగా నిర్మాత గోపాల కృష్ణ రెడ్డి మాట్లాడుతూ కీరవాణి ఈ పాటలను ఆలపించడం ఎంతో సంతోషంగా ఉంది. ఆయన గాత్రంతో ఆ పాట ఎంతో గొప్పగా మారింది. సినిమా విషయానికొస్తే ఇదొక ఓ అందమైన ప్రేమ కథ, వింటేజ్ విలేజ్ డ్రామాలో పూర్తి కొత్తదనం నిండి ఉంటుంది. ప్రతి పాత్ర, ప్రతి విజువల్ ఎంతో సహజంగా ఉంటుంది.ఇక ఇందులో హీరోకి ఉన్న అసలు పేరు కాకుండా.. ఊరంతా కూడా చిదంబరం అని ఎందుకు పిలుస్తుంటారు.. మరి అలా ఎందుకు పిలుస్తారు? అసలు హీరో ఎప్పుడూ కూడా కళ్లద్దాలు ఎందుకు పెట్టుకుని ఉంటాడు? అలా చేయడానికి గల కారణం ఏంటి? అనే ఇలాంటి ఎన్నో ఆసక్తికరమైన ప్రశ్నలకు సమాధానం ఈ సినిమా. కొత్తదనంతో నిండిన సినిమాలను ఆదరించే తెలుగు ప్రేక్షకులకు తప్పకుండా మా చిత్రం నచ్చుతుంది' అన్నారు. వంశీ తుమ్మల, సంధ్యా వశిష్ట, గోపీనాథ్, శివకుమార్ మట్ట, కల్పలత గార్లపాటి, అరుణ్ కుమార్, తులసి, నాయుడు మోరం, శంకర్ రావు తదితరులు నటిస్తున్నారు.





# పురుషలో వెన్నెల కిషోర్ పోస్టర్ రిలీజ్

భార్యాభర్తల కథకు కాస్త కామెడీ జోడించి, రియాలిటీకి దగ్గరగా చూపిస్తే ఆ సినిమా ఇచ్చే కిక్కే వేరేలా ఉంటుందని చెప్పుకోవచ్చు. సరిగ్గా అదే లైన్ తీసుకొని వినూత్నంగా ఎంటర్టైన్ చేయడానికి ప్రేక్షకుల ముందుకు వస్తున్న చిత్రం'పురుష:' ప్రస్తుత తరానికి తగ్గట్టుగా ట్రెండీ మేకింగ్తో రాబోతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మరో పక్క ప్రమోషన్ పనుల్లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా ఎప్పటికప్పుడు 'పురుష:' మూవీ టీమ్ వదులుతున్న పోస్టర్స్ ఆడియన్స్ లో క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. పెళ్లి తర్వాత పురుషులు పడే అవస్థలు చూపిస్తూనే.. పెళ్లి తర్వాత జీవితంలో భార్యల ఇంపార్టెన్స్ ఏంటనేది ఈ సినిమాలో చూపించనున్నారని ఇప్పటికే విడుదల చేసిన టీజర్ స్పష్టం చేసింది. ఇక తాజాగా మరో డిఫరెంట్ పోస్టర్ వదిలి సినిమాపై ఇంకాస్త హైప్ పెంచేశారు. తాజాగా వదిలిన ఈ పోస్టర్ లో వెన్నెల కిషోర్ ఏదో అయోమయంలో పడినట్లు కనిపిస్తుండగా.. కిటికీ దగ్గర ఏం జరిగింది అని పోస్టర్ పై రాసి ఇంకాస్త క్యూరియాసిటీ పెంచారు. మొత్తానికి ఈ పోస్టర్ చూస్తుంటే సినిమాలో ఖచ్చితంగా ఫుల్ ఫన్ ఉంటుందని, గతంలో ఏ సినిమాలో కూడా చూడని డిఫరెంట్ సీన్స్ ఆడియన్స్ ఈ సినిమాలో చూడబోతున్నారని స్పష్టమవుతోంది. బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై బత్తుల కోటేశ్వరరావు ఈ 'పురుష:' సినిమాను నిర్మిస్తున్నారు. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతున్నాడు. కేవలం పోస్టర్లు, ఫస్ట్ లుక్స్‌నే జనాల్లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తున్న మేకర్స్.. ఇప్పటి వరకు హీరోల పాత్రలు, వారి బిహేవియర్, పాత్రల తీరుకి తగ్గట్టుగా పరిచయం చేశారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్గా సతీష్ ముత్యాల పని చేస్తుండగా.. శ్రవణ్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. ఎడిటర్గా కోటి, ఆర్ట్ డైరెక్టర్గా రవి బాబు దొండపాటి వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేయనున్నారు. సినిమాలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజకుమార్, వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్, శ్రీ సంధ్య, గబిరాక్, అనైరా గుప్తా, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, పమ్మి సాయి, వి.టి.వి. గణేష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర బృందానికి పవన్ ప్రశంసలు



మెగా అభిమానులు మెచ్చేలా ఉన్న 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం, బాక్సాఫీస్ దగ్గర కాసుల వర్షం కురిపిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి, చిరంజీవి సినీ ప్రయాణంలో అతి పెద్ద విజయంగా నిలిచింది. ఈ నేపథ్యంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కి చెందిన పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపింది.మెగా బ్లాక్బస్టర్ విజయాన్ని సాధించిన సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి, అలాగే 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్ర యూనిట్ సభ్యులందరికీ శుభాకాంక్షలు అని పవన్ కళ్యాణ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.నాలుగు దశాబ్దాలకు పైగా చిరంజీవి గారు ప్రజల హృదయాలకు అత్యంత దగ్గరగా నిలుస్తూ.. అదే తపన, అదే ఉత్సాహంతో తన నటన, హాస్యం, నృత్యాల ద్వారా ప్రేక్షకులను నిరంతరం అలరిస్తున్నారు. ఆయన అద్భుతమైన సినీ ప్రస్థానంలో ఇది మరో విజయవంతమైన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన అనిల్ రావిపూడి గారికి ప్రత్యేక అభినందనలు. సంక్రాంతికి మరో ఘన విజయాన్ని అందించిన ఆయన ప్రతిభ ప్రశంసనీయం. చిరంజీవి , విక్టరీ వెంకటేష్ ఒకే తెరపై కలిసి కనిపించడం ప్రేక్షకులకు నిజంగా అపూర్వ ఆనందాన్ని కలిగించింది.సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందించిన అద్భుతమైన సంగీతం, సినిమాకు మరింత శక్తిని జోడించింది.నిర్మాతలు సాహు గారపాటి, సుష్మిత కు కూడా ప్రత్యేక అభినందనలు అని పవన్ కళ్యాణ్ తెలిపారు.

# మొగుడు గ్లింప్స్ రిలీజ్






తమిళ దర్శకుల్లో 'సుందర్ సి ' సినిమాలకు ఉండే క్రేజే వేరు. ఆయన తీసిన సినిమాలు తెలుగు ప్రేక్షకులకు కూడా బాగా కనెక్ట్ అవుతుంటాయి. ఈ క్రమంలోనే తాజాగా హీరో విశాల్తో ఓ సినిమా రూపొందిస్తున్నారు. సుందర్ సి. అవ్ని సినీమాక్స్ ప్రైవేట్ లిమిటెడ్, బెంజ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై కుష్బూ సుందర్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఏసిఎస్ అరుణ్ కుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మొగుడు అనే టైటిల్ తో రాబోతున్న చిత్రంలో విశాల్ సరసన తమన్నా భాటియా హీరోయిన్ గా నటిస్తోంది. కమెడియన్ యోగిబాబు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. హిప్ హాప్ తమీజా సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, మరోవైపు ప్రమోషన్స్ మొదలుపెట్టారు. ఇందులో భాగంగా తాజాగా మొగుడు టైటిల్, గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఏకంగా 5 నిమిషాల నిడివితో ఈ వీడియో కట్ చేసి ఒక్కసారిగా సినిమాపై హైప్ తీసుకొచ్చారు. ఇందులో విశాల్ తమన్నాలను భార్యాభర్తలుగా చూపిస్తూనే సినిమాలో డెప్త్ ఏంటనేది క్లియర్ గా చెప్పేశారు. 'ఇలా చూడండి.. మొగుడులా ఉండటం ముఖ్యం కాదు.. మొగుడు మొగుడులా ఉండటమే ముఖ్యం. అర్థమైందా అత్తయ్యా'' అంటూ యోగిబాబు చెప్పిన సీరియల్ క్లిపింగ్ చూపిస్తూ మొగుడు గ్లింప్స్ మొదలు పెట్టారు. ఆ తర్వాత తమన్నా ఇంటికి యోగిబాబు రావడం, ఆమె అందానికి ఫిదా కావడం.. చివరకు తమన్నా మొగుడు విశాల్ని చూసి బిత్తరపోవడం లాంటి సీన్స్ ఆసక్తికరంగా చూపించారు. మరీ ముఖ్యంగా భార్యాభర్తలుగా విశాల్ తమన్నా అదరగొట్టారనే చెప్పుకోవాలి. భర్తకు ఆర్డర్స్ వేసే భార్యగా తమన్నా, ఇంట్లో వంట పనులు చేస్తూనే శత్రువుల తాట తీసే భర్తగా విశాల్ భలే కిక్కిచ్చారు. ఈ వీ డియో చూస్తుంటే మొగుడు మూవీ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకెక్కిస్తున్నారు. విశా ల్ 36వ చిత్రంగా ఇది నిర్మిస్తున్నారు. ఎగ్జిగూటివ్ ప్రొడ్యూసర్ ఎన్.మణి వన్నన్.

# ఇన్ ఫ్లుయెన్సర్ యామిని హీరోయిన్‌గా చిత్రం

సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ యామినీ ఈఆర్ ను హీరోయిన్ గా పరిచయం చేస్తున్నారు . రతన్ రిషి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ప్రస్తుతం తన మూడో చిత్రంగా యామినీ ఈఆర్ తో హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ నటిస్తున్నారు. ఈ మూవీలో ఎంతో స్పెషల్ గా, ఇంట్రెస్టింగ్ గా ఉండే హీరోయిన్ తండ్రి పాత్ర కోసం నైటీస్ సినిమాలోని ఒక నటుడ్ని పెట్టాలని ఆలోచిస్తున్నారు. ఈ సినిమా సంబంధించిన పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఉన్న ఈ సిస్టమ్, సొసైటీలో జరిగే ప్రేమ కథతో మూవీ రూపొందుతున్నట్లు దర్శకుడు రిషి తెలిపారు. ప్రేమికుల రోజు ఫిబ్రవరి 14న టైటిల్ ప్రకటించనున్నారు.



# 'హనీ' టెర్రిఫిక్ టీజర్ రిలీజ్





నవీన్ చంద్ర, దివ్య పిళ్లై ప్రధాన పాత్రల్లో కరుణ కుమార్ రచన, దర్శకత్వం వహించిన సైకలాజికల్ హారర్ మూవీ హనీ. ఓవిఏ ఎంటర్టైన్మెంట్స్ బ్యాన్ప రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రాన్ని శేఖర్ స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ చిత్రం నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణ తో మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు, డార్క్ సైకలాజిక్ ఎలిమెంట్స్ తో ఉండబోతోంది. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. వెన్నులో వణుకు పుట్టించేలా వున్న టీజర్ సినిమాపై అమాంతం ఆసక్తిని పెంచింది. ఇప్పటివరకు మనం చూసిన హారర్ కు భిన్నంగా, హనీ టీజర్ పూర్తిగా నిశ్శబ్దం, చీకటి, మర్మమైన చూపులు, తెలియని శక్తులు కలిసి ఒక మార్మిక ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాయి. దర్శకుడు కరుణ కుమార్ ఇప్పటి వరకు ఎన్నడూ చూడని కథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాడనే సంకేతాలు టీజర్లో బలంగా చూపించాడు. హారర్ను కేవలం భయపెట్టే అంశంగా కాకుండా ఊహకు అతీతంగా ప్రజెంట్ చేస్తున్న విధానం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ప్రతి ఫ్రేమ్లోనూ ఏదో పెద్ద రహస్యం దాగుంది అన్న ఫీలింగ్ కలుగుతుంది. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్, నాగేష్ బానెల్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.సైకాలజికల్ డెప్త్, సోషల్ రిలవెన్స్, హారర్ అంశాల సమ్మేళనంతో రూపొందిన 'హనీ' ఫిబ్రవరి 6న ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ అందించేందుకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం కరుణ కుమార్, నిర్మాతలు: రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి , సినిమాటోగ్రఫీ నగేష్ బన్నెల్ ఎడిటింగ్ మార్తాండ్ వెంకటేష్ అందిస్తున్నారు.

# భారీ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయని చెప్పారు. సరండా అడవిలో అనల్ దా తన బృందంతో పాటు ఉన్నాడని పోలీసులకు అందిన సమాచారం మేరకు ఈ ఆపరేషన్ ప్రారంభించామని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఆపరేషన్స్) మైఖేల్ రాజ్ ఎస్ పిటిఐకి తెలిపారు. గిరిడీహ్ జిల్లాలోని పిర్తాండకు చెందిన అనల్ దా 1987 నుండి చురుకుగా ఉన్నాడు. పోలీసులు చాలా సంవత్సరాలుగా అతని కోసం గాలిస్తున్నారు. సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ జ్ఞానేంద్ర ప్రతాప్ సింగ్ సోమవారం పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా కేంద్రమైన చైబాసాను సందర్శించారు. కోల్హాన్, సరండా ప్రాంతాలు జార్ఖండ్‌లో మావోయిస్టులకు చివరి కంచుకోటలుగా పరిగణించబడతాయి. బుద్ధ పహాడ్ చత్రా, లతేహార్, గుమ్లా, లోహర్దగా, రాంచీ, పారస్‌నాథ్ ప్రాంతాలలో భద్రతా బలగాలు వారి కార్యకలాపాలను సమర్థవంతంగా అరికట్టాయని అధికారులు తెలిపారు.

# ఎలా చర్చిస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

ద్వీపం భవిష్యత్తు గురించి డెన్మార్క్ లేదా గ్రీన్‌లాండ్ తరపున నాటో అధిపతి చర్చలు జరపలేరని, ఆ అధికారం ఆయనకు లేదని ఘాటుగా స్పందించారు. గ్రీన్‌లాండ్ సహా యావత్ ఆర్కిటిక్ ప్రాంత భవితవ్యానికి సంబంధించి నిర్దేశిత ప్రణాళిక నిమిత్తం ఒక చట్రాన్ని తయారు చేసేందుకు ట్రంప్–మార్క్ రట్టే అంగీకరించడాన్ని ఆమె తప్పు పట్టారు. తమ అంతర్గత సార్వభౌమాధికారాన్ని తామే నిర్ణయించుకుంటామన్నారు. నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టేతో ట్రంప్ చర్చలు జరపడం మంచి విషయమేనని, కానీ జరగాల్సిన విధంగా ఈ సంభాషణలు విపులంతగా జరగలేదని ఆమె తప్పుపట్టారు. ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రత యావత్ నాటో కుటుంబానికి సంబంధించిన సమస్య అని, అందువల్ల సహజంగానే ట్రంప్–నాటో అధిపతి మధ్య చర్చలు జరగడం మంచి విషయమేనని అన్నారు. ఆర్కిటిక్‌లో నాటో భద్రత పెంచాలనే విషయంపై చాలాకాలంగా మేం అడుగుతూనే ఉన్నామని గుర్తుచేశారు. దావోస్‌లో సమావేశానికి ముందునుండే తాము నాటో ప్రధాన కార్యదర్శితో సంభాషణలు చేస్తూనే ఉన్నామన్నారు. ''డెన్మార్ రాజ్యపాలన గురించిన ప్రతి విషయం నాటోకు క్షుణ్ణంగా తెలుసు, మేం మా డెన్మార్క్‌దేశ ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు,సామాజిక వ్యవస్థ, భద్రత వంటి దేనిగురించైనా చర్చించగలం, కానీ మా సార్వభౌమాధికారం గురించి సంప్రదింపులు చేయలేం, డెన్మార్క్,గ్రీన్‌లాండ్ సార్వభౌమాధికారం, అంతర్గత విషయాల గురించి మేమే నిర్ణయించుకోగలం '' అని మెట్టే ఫ్రెడరిక్సెన్ తన ప్రకటనలో పేర్కొన్నారు. మా దేశ సమగ్రతను,సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తూ, ఆర్కిటిక్ ప్రాంత భద్రతను బలోపేతం చేసే విషయంపై చర్చిస్తే మిత్రదేశాలతో కలిసి ఆ సంభాషణల్లో అందరూ (నాటో కూటమి) పాల్గొనాలని డెన్మార్క్ ప్రభుత్వం కోరుకుంటోందని ఆమె స్పష్టం చేశారు. డెన్మార్క్ రక్షణమంత్రి ట్రోయెల్స్ లండ్ పౌల్సెన్ కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐతే నాటో ఐక్యతను కొనసగించడానికి రట్టే విధేయతతో పనిచేస్తున్నారనీ,ఆర్కిటిక్ లో భద్రతను బలోపేతం చేయడానికి కూటమి మరింత చేయాల్సి ఉందని చెప్పడం సానుకూలంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా, సుంకాల ఉపసంహరణ, గ్రీన్‌లాండ్‌పై బలప్రయోగ విరమణకు ట్రంప్ తీసుకున్న నిర్ణయం పట్ల డెన్మార్క్ విదేశాంగమంత్రి లార్స్ లోకే రాస్ముస్సేన్ హర్షం ప్రకటించారు. ''ఈరోజు ఉదయం కంటే అస్తమయం ఎంతో మెరుగైన విధంగా ముగిసిందని రాస్ముస్సేన్ ఎన్‌బిసి న్యూస్‌తో అన్నారు. ఇక ట్రంప్‌ను ప్రశంసించే కాలం ముగిసిందని తొలుత దావోస్‌లో బుధవారం రాస్ముస్సేన్ విమర్శించారు. గ్రీన్‌లాండ్‌పై బలప్రయోగాన్ని, యూరప్‌పై అదనపు సుంకాలను నిలిపివేస్తామని ట్రంప్ రెండు శుభవార్తాలు చెప్పారన్నారు.

## బ్రస్సెల్స్‌లో అత్యవసర సమావేశం

గ్రీన్‌లాండ్‌లో బలప్రయోగం చేయబోమని, విభేదించిన యూరప్ దేశాలపై 10 శాతం అదనపు సుంకాలు విధించబోమని దావోస్ వేదికగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన తర్వాత యూరప్ దేశాలు ఊరట చెందాయి. దావోస్‌లో కొన్ని గంటలపాటు చెలరేగిన గందరగోళాన్ని యూరప్‌దేశాల నాయకులు ఇప్పుడిప్పుడే జీర్ణించుకుంటున్నారు. కానీ ఇంకా చాలా ప్రశ్నలు మిగిలిపోయి ఉన్నాయని యూరప్ దేశాలు భావిస్తున్నాయి. ట్రంప్ కొంత వెనుకంజ వేసినాగానీ గ్రీన్‌లాండ్ సమస్య పరిష్కారానికి ఇంకా..ఇంకా చాలా దూరంలోనే ఉండిపోయింది. దీంతో ట్రాన్స్ అట్లాంటిక్ కూటమి విచ్ఛిన్నమయ్యే ప్రమాదం పొంచి ఉందన్న విషయంపై కూటమి నాయకులు గురువారం రాత్రి పొద్దుపోయాక బ్రస్సెల్స్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉంది. కాగా ట్రంప్‌తో చర్చలు జరిపిన నాటో ప్రధాన కార్యదర్శి మార్క్ రట్టో ట్రంప్‌ను డాడీ అని సంబోధించి విమర్శలకు గురయ్యారు. నాటో కుటుంబంలో రక్షణవ్యయాన్ని బాగా పెంచడంలో కృషి చేశారని ట్రంప్‌ను ప్రశంసిస్తూ ఆయనను రట్టో డాడీ అని సంబోధించారు. బ్రిటన్‌కు కొంత ఊరట కలిగినప్పటికీ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ చుట్టూ ఉన్నవారంతా మాత్రం ట్రంప్ వెనకడుగు ఉద్దేశపూర్వకంగా, తన చర్యలను తాను సమర్థించుకున్నారని భావిస్తున్నారు. బిబిసి విశ్లేషకులు ఈ విషయం వెల్లడించారు. స్వీడన్ ఉప ప్రధానమంత్రి ఎబ్బా బుష్ మాట్లాడుతూ, అమెరికాతో సంబంధాలు ఇప్పుడు దెబ్బతిన్నాయని, అందువల్ల యూరప్ ఇప్పుడు తనను తాను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. డెన్మార్ నుండి గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకోవడానికి వ్యతిరేకించే దేశాలపై పదీ శాతం సుంకాలు విధిస్తానంటూ కొద్ది రోజులుగా తీవ్ర కలకలం రేపారు. నిర్ణీత ప్రకారం ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి ఈ పదీశాతం అదనపు సుంకాల భారం ఎనిమిది యూరప్ దేశాలపై అమలులోకి వస్తాయని తొలుత ట్రంప్ చెప్పారు. యూరప్ దేశాలకు ప్రత్యక్షంగా ఆర్థిక నష్టం కలిగించకుండా తాత్కాలిక చర్యలు తీసుకున్నప్పటికీ, గ్రీన్‌లాండ్ విషయంలో ఆయన వెనక్కు తగ్గలేదు.





# లక్షలాది మంది కార్మికుల హక్కుల పరిరక్షణకు ఎఐటియుసి కృషి

నూతన డైరీ ఆవిష్కరణలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఐటియుసి 1920 అక్టోబర్ 31న బ్రిటీష్ హయాంలో స్థాపించటం జరిగిందని, ఆనాటి నుండి ఈనాటి వరకు లక్షలాది కార్మిక సంఘాలకు, కోట్లాది మంది కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్, హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గురువారం 2026వ సంవత్సరపు కార్మికుల మార్గదర్శి డైరీని ఎఐటియుసి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పానుగంటి పర్వతాలు, జక్కు రాజు, రాష్ట్ర సమితి సభ్యులు బొడ్డుపల్లి కిషన్, దత్తు నాయక్, మద్దిలేటి, వాటర్‌వర్క్ రమేష్, శివశంకర్ తదితరులు పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి నూతన డైరీ కార్మికులకు మార్గదర్శి, నిత్యం చేసే కార్యక్రమాలను డైరీలో పొందుపరుస్తూ, ఏ నెలకు ఆ నెల కార్యక్రమాల రిపోర్టును రాష్ట్ర కేంద్రానికి పంపించాలని కోరారు. ఎఐటియుసి చొరవ వల్ల ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య అక్టోబర్ 3, 1945లో ఏర్పడనాటికి ఎఐటియుసి విశేష కృషి జరిపిందని ఆయన తెలిపారు. నేడు మోడీ నాయకత్వాన ఏర్పడిన బిజెపి ప్రభుత్వంపై చట్టాలన్నింటినీ రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లలో వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల చట్టం, వత్తి రీత్యా రక్షణ, ఆరోగ్యం పనిపరిస్థితుల కోడ్, సోషల్ సెక్యూరిటీ కోడ్‌లను తీసుకొచ్చి కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు, కార్మికుల హక్కుల్ని కాలరాసేందుకు చట్టాలను రద్దు చేసిందన్నారు. దీనికి వ్యతిరేకం గా 10 కేంద్ర కార్మిక సంఘాలు గతంలోని 25సార్లు దేశవ్యాపిత సార్వత్రిక స మ్మెలు చేస్తూ, కోడ్లను రద్దు చేయాలని, 44 చట్టాలను యధావిధిగా అమలు చే యాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను నిర్వహించాలని గురువారం జరిగిన రాష్ట్ర సదస్సు తీర్మానించిందని బాల్‌రాజ్ తెలిపారు.

# కార్మికులను మళ్లీ బానిసత్వంలోకి నెట్టడమే

(మొదటి పేజీ తరువాయి)

రిసెర్చ్ సెంటర్ డైరక్టర్ డాక్టర్ సురేష్ బాబు అధ్యక్షత వహించారు. లేబర్‌కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. సదస్సులో అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించిన ప్రధాన కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటిని కేవలం నాలుగు కోడ్‌లుగా మార్చడం సంస్కరణ కాదని, ఇది కార్మిక హక్కులపై ప్రత్యక్ష దాడి అని దుయ్యబట్టారు. ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సామాజిక భద్రతా పథకాల పరిధి తగ్గిపోవడంతో కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని అమర్‌జీత్ కౌర్ హెచ్చరించారు. గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ వర్కర్లకు భద్రత ఉంటుందన్న ప్రభుత్వ హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని, చట్టబద్ధమైన హక్కులు మాత్రం లేవని విమర్శించారు. కార్మికులు తమ న్యాయమైన డిమాండ్‌ల కోసం సమ్మె చేసే హక్కును కూడా కొత్త కోడ్‌లు కాలరాస్తున్నాయని, అనేక నిబంధనలు పెట్టి యూనియన్లను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. 'ప్రజాస్వామ్య హక్కులు కార్మిక హక్కులు' ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయని, వీటిని కాపాడుకునేందుకు కార్మిక వర్గం రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక కార్మికులతో పాటు ఐటి, మీడియా, అసంఘటిత రంగాల వారు కూడా ఈ చట్టాల వల్ల నష్టపోతారని, అందుకే అందరూ ఏకమై దేశవ్యాప్త పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కోడ్‌లను అమలు చేయకుండా ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

## యజమానులకు అపరిమిత అధికారాలు : పి. ప్రసాద్



ఐఎఫ్‌టియు జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ 1926లో ఆమోదించిన ట్రేడ్ యూనియన్ల చట్టం కొత్త కోడ్‌లతో సమాధి చేయబడుతోందన్నారు. కొత్త కోడ్‌లో పొందుపర్చిన 60 రోజుల ముందస్తు నోటీసు వంటి నిబంధనలు కార్మికుల నిరసన గళాన్ని అణచివేయడమేనని అన్నారు. కొత్త లేబర్ కోడ్‌లు యజమానులకు అపరిమిత అధికారాలను కల్పిస్తూ 'హైర్ అండ్ ఫైర్' విధానాన్ని చట్టబద్ధం చేస్తున్నాయని విమర్శించారు. గిగ్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తామన్న ప్రకటనలకు స్పష్టమైన నిధులు, అమలు విధానం లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని చెప్పారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, సమ్మె లాంటి ప్రాథమిక హక్కులపై తీవ్రమైన ఆంక్షలు విధించిందని మండిపడ్డారు. యూనియన్లు లేని కార్మిక వర్గం నిస్సహాయంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## జర్నలిస్టులపై ప్రభావం : శ్రీనివాస్‌రెడ్డి



తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గతంలో జర్నలిస్టులకు రక్షణగా ఉన్న 'వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్'ను రద్దు చేసి, దానిని ఇతర కార్మిక చట్టాలతో కలిపి 'ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్‌లో చేర్చడం వల్ల జర్నలిస్టుల ప్రత్యేక గుర్తింపు, రక్షణ పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేజ్ బోర్డుల వ్యవస్థ దెబ్బతింటే యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై జర్నలిస్టులు ఆధారపడాల్సి వస్తుందని, ఉద్యోగ భద్రత లేకుండా మీడియా స్వేచ్ఛ నిలబడబోదని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత లేకపోతే, వారు స్వేచ్ఛగా వార్తలు రాయలేరని, ఇది ప్రజాస్వామ్యానికే ముప్పు అని అన్నారు. 1952లో ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ సిఫారసుల మేరకు స్వాతంత్ర్యం తర్వాత రెండు చట్టాలు ఆమోదించారని, అవి జర్నలిజం ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉద్దేశించిబడినవని, 1955లో వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టం, 1958లో మూడు చట్టాలు ఆమోదించి, భారత ప్రెస్ కౌన్సిల్, వార్తా పత్రికల నమోదు, జర్నలిస్టుల వేతన సవరణ కోసం వేతన బోర్డు ఏర్పాటుకు దారితీశాయని తెలిపారు. ఈ రెండు చట్టాలు జర్నలిస్టుల సంక్షేమం, ప్రెస్ స్వేచ్ఛకు కీలకమైనవని, కానీ కొత్త కార్మిక కోడ్‌లలో 29 చట్టాలతో పాటు వీటిని కూడా రద్దు చేశారని తెలిపారు. ఈ కొత్త చట్టాలు ప్రధానంగా కార్పొరేట్ సంస్థలకు, యజమానులకు అనుకూలంగా ఉన్నాయని, తద్వారా పని గంటలు పెరగడం, ఉద్యోగ భద్రత తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈ లేబర్ కోడ్‌లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అన్ని కార్మిక సంఘాలకు విజ్ఞప్తి చేయాలని శ్రీనివాస రెడ్డి సూచించారు. కేవలం పారిశ్రామిక కార్మికులతో పాటు జర్నలిస్టులు, మీడియా రంగంలో పనిచేసే వారు కూడా ఈ చట్టాల వల్ల ప్రభావితమవుతారని, అందరూ ఐక్యంగా పోరాడాలని సూచించారు. కార్మికులు, జర్నలిస్టులు, మేధావులు అందరూ కలిసి ఈ లేబర్ కోడ్‌లను వ్యతిరేకించాలన్నారు.





Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com